
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



విశాఖపట్నం


జిల్లా వార్తలు

గురువారం 5 డిసెంబరు 2024



సీఎం పర్యటన సందర్భంగా టీడీపీ కార్యాలయం వద్ద భద్రతా ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న సీపీ

నేడు ముఖ్యమంత్రి రాక



- రాత్రికి పార్టీ కార్యాలయంలో బస
- 6న 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'కు హాజరు
- అనంతరం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో సమీక్ష

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గురువారం రాత్రి నగరానికి రానున్నారు. ముంబైలో మహారాష్ట్ర సీఎం ప్రమాణ స్వీకారానికి హాజరై.. అక్కడ నుంచి రాత్రి 7.30 గంటలకు బయలుదేరి 9.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి రాత్రి 10.05 గంటలకు సెవెన్‌హిల్స్ ఆస్పత్రి వెనుక గల టీడీపీ కార్యాలయానికి చేరుకుని బస చేస్తారని అధికారులు వెల్లడించారు. ఆరో తేదీ కార్యక్రమాల వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. అయితే శుక్రవారం ఉదయం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలను కలుసుకుంటారు. తరువాత నోవాటెల్‌లో జరగనున్న 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'లో పాల్గొంటారు. అనంతరం వీఎంఆర్‌డీఏలో అధికారులతో సమీక్ష నిర్వహించి రాత్రికి విజయవాడ వెళతారని పార్టీ వర్గాలు తెలిపాయి.

కాగా ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పార్టీ కార్యాలయం, తదితరచోట్ల జిల్లా యంత్రాంగం, పోలీస్ అధికారులు భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీసీపీలు అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, ఏడీసీపీలు, ఏసీపీలు టీడీపీ కార్యాలయం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా అధికారులకు సీపీ పలు సూచనలు చేశారు. పార్టీ కార్యాలయ భవనం మొత్తం తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం బాంబ్, డాగ్ స్క్వాడ్లు పార్టీ కార్యాలయం ఆవరణ, లోపల తనిఖీలు చేపట్టాయి.

అమరవీరులకు నివాళులు

నౌకాదళ దినోత్సవం సందర్భంగా బుధవారం ఆర్‌కే బీచ్‌రోడ్డులోని 'విక్టరీ ఎట్ సి' స్థూపం వద్ద అమరవీరులకు జిల్లా ఉన్నతాధికారులు బుధవారం నివాళులు అర్పించారు. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, పోలీస్ కమిషనర్ శంకరబ్రత బాగ్చీ, నేవీ అధికారులు పుష్పగుచ్ఛాలు ఉంచి దేశం కోసం ప్రాణాలు అర్పించిన వారిని స్మరించుకున్నారు.



ఘనంగా తొలి గురువారం పూజలు

మార్గశిర మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో తొలి గురువారం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఈవో సుజాత అభిషేకాలతో పూజలు ప్రారంభించారు. అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భారీ ఏర్పాట్లు చేశారు.

- 8లో



భూములకు రక్ష, బాధ్యులకు శిక్ష

వుడాలో రూ.540 కోట్ల కుంభకోణం కేసుపై లోకాయుక్త తీర్పు

- అనర్హులకు కేటాయించిన ప్లాట్ల రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి వెనక్కి తీసుకోవాలని ఆదేశాలు
- బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టండి
- ఐఏఎస్ అధికారి శ్రీధర్‌పై చర్యలు ఉపసంహరణ
- మరో ఐఏఎస్ విష్ణుపై చర్యలకు తెలంగాణాకు లేఖ
- ఎనిమిది మంది వుడా ఉద్యోగులపై కేసులు, చర్యలు
- నాడు వెలుగులోకి తెచ్చింది 'ఆంధ్రజ్యోతే'

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పుష్కరం క్రితం విశాఖపట్నం నగరాభివృద్ధి సంస్థ (వుడా-ఇప్పుడు వీఎంఆర్‌డీఏ)లో వెలుగుచూసిన భారీ భూ కుంభకోణం కేసుకు ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త ఎట్టకేలకు ముగింపు పలికింది. చేతులు మారిన భూములను కాపాడాలని ఆదేశించింది. కుంభకోణంలో భాగస్వాములైన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇతర వ్యక్తులపై క్రిమినల్ కేసులు కొనసాగించాలని స్పష్టం చేసింది. అన్యాక్రాంతమైన భూముల రిజిస్ట్రేషన్లు రద్దు చేసి, వాటిని వెనక్కి తీసుకోవాలని పేర్కొంది. ఈ కేసులో సీఐడీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఏసీబీ విడివిడిగా విచారణ చేపట్టాయని, వారి నివేదికలన్నీ అందాయని, వాటిపై చర్యలు తీసుకున్నామని పురపాలన పట్టణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నివేదిక ఇవ్వడంతో ఈ కేసును క్లోజ్ చేస్తున్నామని ఉప లోకాయుక్త రజని బుధవారం తెలిపారు.

వుడా పద్నాలుగేళ్ల క్రితం ల్యాండ్ పూలింగ్ పేరుతో భూములు సేకరించి, అనర్హులకు అభివృద్ధి చేసిన ప్లాట్లను కేటాయించింది. ఆ ప్లాట్లలో కొన్నింటిని భూములు ఇచ్చిన వారికి కాకుండా వేరే వ్యక్తుల పేరుతో నేరుగా రిజిస్టర్ చేసింది. ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన వారికి లేఅవుట్ అభివృద్ధి చేసిన చోట ప్లాట్లు ఇవ్వాలనేది నిబంధన. కానీ వుడా అధికారులు అలా కాకుండా సుమారుగా 14 లేఅవుట్లలో విలువైన ప్లాట్లను కేటాయించారు. భూమి ఇచ్చిన వ్యక్తి నిజంగా యజమానా?, కాదా? అని పూర్తిగా పరిశీలించకుండానే వారికి అభివృద్ధి చేసిన



'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన ఓ కథనం

... మిగతా 6వ పేజీలో



ఎంవీపీ కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూమిలో నిర్మించిన భవనం

కుంభకోణం ఎలా జరిగిందంటే...

అప్పట్లో వుడా వైస్ చైర్మన్లుగా పనిచేసిన ఐఏఎస్ అధికారులు ఎన్.విష్ణు, బి.శ్రీధర్‌లు, ఎస్టేట్ అధికారి ఎ.జగదీశ్‌లు కలిసి వారికి కావలసిన వారికి వుడా భూములను అతి తక్కువ ధరకు కట్టబెట్టేశారు. ఎంవీపీ కాలనీలో గజం రూ.50 వేలు పలికిన సమయంలో రూ.500 చొప్పున రిజిస్టర్ చేసేశారు. బీచ్‌రోడ్డులో కూడా అలాగే ఇచ్చేశారు. ఎంవీపీ కాలనీ సెక్టార్-1లో సర్వే నంబర్ 5/పిలో సామాజిక అవసరాల కోసం విడిచిపెట్టిన భూమిని హయగ్రీవ జగదీశ్వరుడితో సహా మరో ఐదుగురికి రాసిచ్చేశారు. అందులో పద్మజ నిర్మాణ్ కంపెనీ అపార్టుమెంట్ నిర్మాణం చేపట్టింది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే ల్యాండ్ పూలింగ్ పేరుతో చేసింది అతి పెద్ద కుంభకోణం. భూమిని సమీకరించామని అనర్హుల పేర్లు జాబితాలో చేర్చి వారికి ఇవ్వాల్సిన దానికంటే ఎక్కువ విస్తీర్ణంతో కూడిన ప్లాట్ల ను వేర్వేరు లేఅవుట్లలో కేటాయించారు. కొన్నింటిని వేరే వారి పేరుతో థర్డ్ పార్టీ రిజిస్ట్రేషన్ చేశారు. లబ్ధి పొందిన వారి జాబితా చూస్తే అందులో చాలామందికి అసలు భూములే లేవని తరువాత తేలింది.

పెద్దిపాలెంలో రైస్ మిల్లు సీజ్

- బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్టు గుర్తింపు

విశాఖపట్నం, డిసెంబబరు 4 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా వ్యవహారంపై పౌర సరఫరాల అధికారులు దాడులు కొనసాగించారు. బుధవారం ఆనందపురం మండలం పెద్దిపాలెంలో అభిషేక్ ట్రేడర్స్ రైస్‌మిల్లుపై భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్ నేతృత్వంలో అధికారులు దాడులు చేశారు. మిల్లులో సరకుకు సంబంధించి రికార్డులలో నమోదుకాని 124 బస్తాల బియ్యాన్ని సీజ్ చేశారు. లెక్కలు లేని సరకు నిల్వ చేసిన రైస్‌మిల్లును ఆర్డీవో సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఆనందపురం తహసీల్దార్ శ్యాంప్రసాద్, పౌరసరఫరాల అధికారులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లులో తనిఖీలు నిర్వహిస్తున్న భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, ఆనందపురం తహసీల్దా శ్యామ్‌ప్రసాద్

జైలులో వరుస ఘటనలపై సీరియస్

- గత సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్, అదనపు సూపరిటెండెంట్ వెంకటేశ్వర్లుపై సస్పెన్షన్ వేటు
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం, ఖైదీల ప్రవర్తనపై పర్యవేక్షణలోపం ఆరోపణలు



కిశోర్‌కుమార్



వెంకటేశ్వర్లు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ కేంద్ర కారాగారంలో వరుసగా చోటుచేసుకున్న ఉదంతాలను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. అందుకు కారకులుగా భావిస్తూ కొద్దిరోజులు కిందటి వరకూ జైలు సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఎస్.కిశోర్‌కుమార్, అదనపు సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వర్లను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డీజీ కుమారవిశ్వజిత్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. కారాగారం లోపల నుంచి కొందరు ఖైదీలు రాత్రి వేళ ఫోన్ కాల్స్ మాట్లాడుతున్నట్టు కాల్‌డేటా రికార్డ్ (సీడీఆర్)లో అధికారులు గుర్తించారు. అలాగే గోదావరి బ్లాక్‌లో శిక్ష అనుభవిస్తున్న ఖైదీ ఉప్పాడ గౌరీశంకర్ బ్యారెక్ లోపల వెంటిలేటర్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అదేవిధంగా జైలు ఆస్పత్రిలో ఫార్మసిస్టుగా పనిచేస్తున్న శ్రీనివాసరావు గంజాయి ప్యాకెట్లను లంచ్ బాక్స్‌లో పెట్టుకుని ఖైదీలకు అందజేసేందుకు వెళుతూ సెక్యూరిటీకి పట్టుబడ్డాడు. దీంతో

... మిగతా 6వ పేజీలో

ఫార్మా ప్రమాదంపై దాగుడుమూతలు

- 'ఠాగూర్ లేబొరేటరీస్' ఘటనపై భిన్న వాదనలు
- యాజమాన్యం చెప్పిందే వేదం అన్నట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు
- సొంత పరిశీలన, విచారణ శూన్యం
- వాస్తవాలకు ముసుగు
- అసలు అక్కడ విష వాయువులు ఎలా లీకయ్యాయో నిర్ధారించని వైనం



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి) ఠాగూర్ ఫార్మా కంపెనీలో ప్రమాదంపై అసలు విషయాలు బయటకు రావడం లేదు. ఆ కంపెనీ అనుమతి లేని మందులు తయారు చేస్తున్నప్పుడు ప్రమాదం జరగ్గా...ఆ ఘటనపై యాజమాన్యం చెప్పిన విషయాలనే అధికారులు వల్లె వేస్తున్నారు. వాస్తవంగా ఏమి జరిగింది అనేది వెల్లడించడం లేదు. అసలు వారు అన్నీ సక్రమంగా పరిశీలించారా?...అనే అనుమానాలు కలుగుతున్నాయి. దీనిపై 'ప్రజల కోసం శాస్త్రవేత్తల బృందం' తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తోంది. కంపెనీ యాజమాన్యాన్ని కాపాడడానికి అధికారులు సహకరిస్తున్నారని ఆరోపిస్తోంది. ప్రమాదం జరిగిన తరువాత అక్కడకు ఫ్యాక్టరీస్ విభాగం అధికారులు, కాలుష్య

... మిగతా 6వ పేజీలో

'ఠాగూర్' ఫార్మాపై కేసు నమోదు

పరవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని ఠాగూర్ ఫార్మా లేబొరేటరీస్ ప్రైవేటు లిమిటెడ్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్టు అనకాపల్లి జిల్లా పరవాడ సీఐ జి.మల్లికార్జునరావు తెలిపారు. ఫ్యాక్టరీలో వారం కిందట విష వాయువు లీకవ్వడంతో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, మరో 30 మంది తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన సంగతి తెలిసిందే. యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లనే ప్రమాద తీవ్రత పెరిగిందని అధికారులు తేల్చారు. దీనిని తీవ్రంగా పరిగణించి వివిధ సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు. నిర్లక్ష్యం, మానవ ప్రాణాలకు హాని కలిగించడం, ప్రమాదాన్ని అధికారులకు తెలియకుండా దాచిపెట్టడం, తదితర అభియోగాలపై కేసు నమోదుచేశారు. భారతీయ న్యాయ సహిత సెక్షన్ 106 (1), 125 (ఎ), 125 (బి), 239, 286 రెడ్‌విత్ 3 (5) కింద కేసు నమోదుచేసినట్టు సీఐ వెల్లడించారు. ఇదిలావుంటే అస్వస్థతకు గురైన ఉద్యోగుల్లో ఇంకా 11 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారని వెల్లడించారు. వారిని రెండు, మూడు రోజుల్లో డిశ్చార్జి చేసే అవకాశం ఉందన్నారు.



ఫీజు రీయింబర్స్‌మెంట్ పీజీకి వర్తించేనా?



- వైసీపీ ప్రభుత్వ హయాంలో పీజీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్‌కు స్వస్తి
- గడిచిన నాలుగేళ్లలో భారీగా తగ్గిన ప్రవేశాలు
- అధికారంలోకి వస్తే పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన కూటమి నేతలు
- ప్రభుత్వ నిర్ణయం కోసం ఆశగా ఎదురుచూస్తున్న విద్యార్థులు, కళాశాలల ప్రతినిధులు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదు. గతంలో డిగ్రీతోపాటు పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సులు చదువుతున్న వారికి ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించేది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పీజీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేసింది. దీంతో గడిచిన నాలుగేళ్లగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల సంఖ్య భారీగా తగ్గింది. రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది ఉన్నత చదువులకు దూరమయ్యారు. ఇదే విషయాన్ని పాదయాత్ర సమయంలో నారా లోకేష్ దృష్టికి విద్యార్థులు తీసుకువెళ్లారు. దీంతో పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చేస్తామని అప్పట్లో ఆయన హామీ ఇచ్చారు. ఇదే విషయాన్ని పలువురు విద్యార్థులు మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్‌కు వెళ్లి విన్నవించారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు చెబుతున్నారు. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పీజీ కాలేజీల అసోసియేషన్ ప్రతినిధులు కూడా ఉన్నత విద్యాశాఖ అధికారులను కలిశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేయకపోవడంతో కొన్నాళ్లుగా ఆశించిన స్థాయిలో సీట్లు భర్తీ కావడం లేదనే విషయాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై కొద్దిరోజుల్లో కీలక నిర్ణయం వెలువడే అవకాశం ఉందని ఇటు విద్యార్థులు, అటు కళాశాలల యాజమాన్యాల ప్రతినిధులు ఆశాభావంతో ఉన్నారు.

50కి పైగా పీజీ కాలేజీలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలో గల ఉమ్మడి విశాఖపట్నంతోపాటు విజయనగరం జిల్లాలో 50కి పైగా పీజీ కళాశాలలు ఉన్నాయి. ఆయా కాలేజీల్లో

... మిగతా 6వ పేజీలో



కమనీయం... అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమ శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

అధ్వానంగా తునిపాలెం రోడ్డు



రాళ్లు తేలి ఉన్న రోడ్డు

పద్మనాభం రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మద్ది పంచాయతీ శివారు తుని పాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు రాళ్లు తేలి అధ్వానంగా ఉండడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పూర్తిగా గోతులమయం కావడంతో వాహనదారులు, పాదచారులు నరకయాతన పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఎక్కడ గొయ్యి ఉందో ఎక్కడ నీరు ఉందో తెలియక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే పెంట గ్రామం నుంచి అలమండ ఆర్‌ఎస్ వరకూ ఉన్న రహదారి పరిస్థితి కూడా ఇంతే. అనంతవరం నుంచి గొల్లలపాలెం వరకు ఉన్న రోడ్డు కూడా పూర్తిగా గతుకులతో నిండిపోయింది. ఆర్ అండ్‌బీ ఇంజినీరింగ్ అధికారులు ప్రధాన రహదారుల మరమ్మతుపై దృష్టిసారిస్తున్నారు తప్ప గ్రామీణ రోడ్లను పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాలయంలో అనధికార అర్చకుడు

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉపాలయంగా సింహగిరి ఘాట్ రోడ్డు టోల్‌గేటు వద్ద ఉన్న వరసిద్ధి వినాయక ఆలయంలో అనధికార అర్చకుడు విధులు నిర్వహించడం పట్ల భక్తులు విమర్శలు చేస్తున్నారు. సాధారణంగా ఆలయంలో పనిచేసే అర్చక పరిచారకులు తమ వ్యక్తిగత అవసరాల కోసం సెలవు పెట్టినప్పుడు దేవస్థానం అధికారులు ప్రత్యామ్నాయంగా వేరే ఉద్యోగిని ఏర్పాటు చేస్తారు. కానీ అందుకు విరుద్ధంగా రెండు రోజులుగా రెగ్యులర్ అర్చకుడు సెలవు తీసుకోగా ప్రైవేటు వ్యక్తిని పూజలు చేయడానికి ఉంచడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పద్మనాభం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శుక్రవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ కె. ఆనందకుమార్ చెప్పారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 6న రెడ్డిపల్లి, 7న పొట్నూరు, 10న పాండ్రంగి, 11న గంధవరం, 12న కొవ్వాడ, 13న అయినాడ, 17న బుడ్డివలస, 18న బుడ్డివలస అగ్రహారం, 19న నేరేళ్లవలస, 20న చిన్నాపురం, 21న తునివలస, 24న నర్సాపురం, 26న కోరాడ, 27న వెంకటాపురం, 28న రేవిడి, 31న అనంతవరం గ్రామాల్లో సదస్సులు జరుగుతాయని తెలిపారు. జనవరి 3న తిమ్మాపురం, 4న విజయరాంపురం, 7న బాందేవపురం, 8న మద్ది గ్రామాల్లో సదస్సులు ఉంటాయన్నారు. ప్రజలు, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

మాజీ కౌన్సిలర్ సోమరాజు మృతి పట్ల నివాళి

తగరపువలస, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భీమిలి మాజీ కౌన్సిలర్, సీపీఐ నాయకుడు తూతిక సోమరాజు మంగళవారం చిట్టివలసలోని తన స్వగృహంలో అనారోగ్యంతో మృతి చెందారు. ఈమేరకు ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సీపీఐ కార్యదర్శి కానూరి రాంబాబు, మాజీ కౌన్సిలర్ సన్యాసమ్మ, వైసీపీ నాయకుడు రామునాయుడు, దేవాంగుల సంఘం నాయకుడు తౌడుబాబు, తదితరులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

7 నుంచి గీతామృత ప్రవచనాలు

సీతమ్మధార, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతుబజార్ పక్కనున్న వర్మ కాంప్లెక్స్‌లో ఈ నెల 7 నుంచి 11 వరకు గీతా జయంతి వేడుకలు, గీతామృత ప్రవచనాల నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ఆర్ వర్మ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.



నిర్వహణ కరవైన అల్లూరి ప్రదర్శన శాల



లైట్లు లేకపోవడంతో నెలకొన్న చీకటి



అలంకారప్రాయంగా ఉన్న స్టాల్స్

శిల్పారామం..అభివృద్ధి శూన్యం

- గత ఐదేళ్లు పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- కొరవడిన నిర్వహణ లోపం
- కనీస సదుపాయాలు కరువు
- వెలగని లైట్లు.. తాగునీటికి ఇబ్బందులు
- సందర్శకులకు వినోదం ఊసేలేదు



తాగునీటి సదుపాయం కోసం నిర్మించిన ప్లాట్‌ఫారం

మధురవాడ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : శిల్పారామంలో సందర్శకులకు కనీస సౌకర్యాలు లేవు.ముఖ్యంగా గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోకపోవడంతో ప్రస్తుత పరిస్థితి పూర్తి అధ్వానంగా ఉంది. ఇక్కడికి వస్తున్న పర్యాటకులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. శిల్పారామం సుమారు 26 ఎకరాల్లో విస్తరించి ఉంది. జాతరలో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు లేవు. దీంతో ఆ ప్రాంతంలో చీకట్లు అలముకున్నాయి. గత ప్రభుత్వం ఒక్క కొత్త లైటు కూడా వేయలేదు. అన్ని రోజుల్లోనూ ఉదయం 10 నుంచి రాత్రి 8 వరకు పర్యాటకులకు ప్రవేశం ఉంది. కొంతమంది ఆకతాయిలు చీకటి వల్ల రాత్రి వేళ ఇక్కడికి చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. పర్యాటకులకు తాగునీటి సదుపాయం కోసం గతంలో ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో అది పాడైంది. మళ్లీ ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేస్తామని అధికారులు చెబుతున్నా.. కార్యరూపం దాల్చడం లేదు. రాత్రివేళ విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీకి టార్చిలైట్లు కూడా అందించలేని దుస్థితిలో అధికారులు ఉన్నారు.జాతరలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు ప్రదర్శన శాలలో ఉన్న బొమ్మల్లో కొన్నింటికి చేతులు, కాళ్లు విరిగిపోయాయి. వీటికి కనీసం మరమ్మతులు కూడా చేయడం లేదు. పర్యాటకులకు అందుబాటులో దుస్తులు, మహిళల అలంకరణ సామగ్రి తదితర విక్రయాలు కోసం తాత్కాలిక స్టాల్స్ నిర్మించినా .. అవి నామమాత్రంగానే ఉన్నాయి.

వినోదం కరవు..

శిల్పారామంలో వారాంతపు వినోదం కోసం ప్రతి ఆదివారం సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ఆనవాయితీ. కొన్నేళ్లుగా రెండు, మూడు కళా బృందాలతోనే తరచూ ప్రదర్శనలు ఇస్తుండడంతో సందర్శకులకు విసుగ్గా ఉంటోంది. కొత్త బృందాలు ఇక్కడ ప్రదర్శనలు ఇవ్వడానికి ఆసక్తి చూపడం లేదు. ఈ బృందాలకు కనీస పారితోషికం కూడా చెల్లించలేని పరిస్థితిలో శిల్పారామం ఉంది. దీంతో ఇక్కడికి వస్తున్న సందర్శకులు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

శిల్పారామంలో పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు అదనపు లైట్లు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధుల కొరత వల్ల కొన్ని పనులు చేయలేకపోతున్నాం.తాగునీటికి ఆర్‌ఓ ప్లాంటు ఏర్పాటు చేస్తున్నాం. కొత్తగా స్టాల్స్ ఏర్పాటు చేయడానికి కూడా ప్రతిపాదనలు పంపించాం..

విశ్వనాథరెడ్డి, పరిపాలనాధికారి

గ్యారేజీకే పరిమితమైన ప్రచార రథం



గ్యారేజీలో ఉంచిన ప్రచార రథం

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవదాయ శాఖాధికారుల ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా హైందవ ధర్మం, వరాహలక్ష్మీనృసింహస్వామి క్షేత్ర మహత్మ్యం ప్రచారం కోసం తయారు చేసిన అప్పన్నస్వామి ప్రచార రథం దేవస్థానం గ్యారేజీకే పరిమితమైంది. 12 ఏళ్ల క్రితం రూ. 27 లక్షల దేవస్థానం నిధులతో ప్రముఖ సినీ ఆర్ట్ డైరెక్టర్ మణి సారథ్యంలో ఆలయ నమూనాలో ప్రచార రథాన్ని రూపొందించారు. తరువాత జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో రథాన్ని భక్తుల చెంతకు తీసుకువెళ్లారు. రథం వినియోగంలోకి వచ్చి ఇప్పటివరకు 46 వేల కిలోమీటర్లు మాత్రమే తిరిగినట్టు రథంలోని స్పీడోమీటర్ చెబుతోంది. ప్రస్తుతం ఎవరైనా ఉత్సాహవంతులు అభ్యర్థిస్తే రథాన్ని ఆయా ప్రాంతాలకు పంపి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. రథాన్ని ప్రారంభించినప్పుడు అప్పటి అధికారులు రథం నెలలో కనీసం సగం రోజులు ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాంతాలతో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి హిందూ ధర్మ వ్యాప్తి, అప్పన్న క్షేత్ర ప్రచారం చేపడుతుందని ప్రకటించారు. మొదట్లో బాగానే తిరిగినా నాలుగేళ్లుగా కొండదిగువ స్వామివారి ఉద్యానవనానికి చేరువలోని ట్రాన్స్‌పోర్టు గ్యారేజీకే రథం పరిమితమైంది. దీంతో రథంలోని దేవుడి విగ్రహాలు పూర్తిగా నిరాదరణకు గురవుతున్నాయి. రథాన్ని కొండ దిగువన లేదా సింహగిరిపై రద్దీ ప్రదేశాల్లో ఉంచి నిత్య పూజలు జరపాలని భక్తులు కోరుతున్నారు.



పారాయణం చేస్తున్న కళాశాల విద్యార్థులు

భగవద్గీత మానవ జీవనానికి మార్గదర్శి

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత మానవ జీవనానికి మార్గదర్శకంగా నిలుస్తోందని కనక మహాలక్ష్మి దేవస్థానానికి చెందిన వేద పండితుడు కందుకూరి బాలసుబ్రహ్మణ్యశర్మ అన్నారు. పతంజలి గీతా పిరమిడ్ ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో సింహగిరి కళా వేదికపై బుధవారం భగవద్గీత పారాయణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌకిక విద్యాభ్యాసంతో భుక్తికి చెందిన జ్ఞానం మాత్రమే లభిస్తుందని, అదే భగవద్గీత అధ్యయనంతో ముక్తి మార్గం దొరుకుతుందన్నారు. భగవద్గీత నేర్చుకుంటే వేదాల సారంతో పాటు విజ్ఞానం, వివేకం, విచక్షణ వంటి పలు సద్గుణాలు అలవడతాయని చెప్పారు. అనంతరం పతంజలి సంస్థ ప్రతినిధి గీతా సత్యవతి భగవద్గీతలోని 5, 6 అధ్యయనాలను గోపాలపట్నంలోని ఎస్‌వీఎల్ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులతో పారాయణ చేయించారు.

అప్పన్నను దర్శించుకున్న బీసీసీఐ సభ్యుడు



ప్రొటోకాల్ అధికారితో సెలక్టర్ అజేయ్ రాత్రా

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని బుధవారం భారత క్రికెట్ టీమ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు అజేయ్‌రాత్రా దర్శించుకున్నా రు. ఆయనకు అధికారులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న అతని గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామివారి ప్రసాదాలు అందజేశారు.

కప్పస్తంభ ఆదాయం రూ.7.9లక్షలు

వరాహలక్ష్మీనృసింహస్వామికి కప్పస్తంభ ఆలింగనాల ద్వారా గత నెలలో రూ.7.9 లక్షల ఆదాయం సమకూరింది. ఆ నెలలో 31,788 మంది భక్తులు రూ.25 టికెట్ చెల్లించి కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకోగా రూ.7,94,700 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు.

రసాయన విపత్తులపై మాక్‌డ్రిల్



ఈస్టిండియా పెట్రోలియంలో నిర్వహించిన మాక్ డ్రిల్

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్‌ఇండియా పెట్రోలియంలో ఫ్యాక్టరీల శాఖ రసాయన విపత్తులపై బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించింది. సొసైటీ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీతో రసాయన పరిశ్రమలో భద్రత, అత్యవసర నిర్వహణపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించింది. ఇందులో భాగంగా ఫార్మాసహా వివిధ పరిశ్రమలకు చెందిన 300 మంది ప్రతినిధుల సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కర్మాగారాల జాయింట్ చీఫ్ జె.శివశంకరరెడ్డి ప్రసంగిస్తూ అత్యవసర రెస్క్యూటీమ్‌కు రసాయన విపత్తులను ఎలా ఎదుర్కోవాలో, ప్రాణ,ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలో నేర్పుతుందన్నారు. ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్‌ఇన్‌స్పెక్టర్ జీవీవీఎస్ నారాయణ వీక్షించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పీజీకి వర్తించేనా?

... 5వ పేజీ తరువాయి

సుమారు 4,958 సీట్లు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసినప్పటి నుంచి అనేక కాలేజీల్లో సీట్లు సరిగా భర్తీ కావడం లేదు. గతంలో శత శాతం సీట్లు భర్తీ అయిన గ్రూపుల్లో కూడా 20 నుంచి 40 శాతం కాని పరిస్థితి ఏర్పడడంతో ప్రముఖ కాలేజీలు కూడా పీజీ కోర్సుల నిర్వహణ నుంచి తప్పుకున్నాయి. మళ్లీ అమలు చేస్తారన్న ఉద్దేశంతో కొన్ని కాలేజీలు మాత్రం కోర్సులను కొనసాగిస్తూ వస్తున్నాయి.

జైలులో వరుస ఘటనలపై సీరియస్

... 5వ పేజీ తరువాయి

కేంద్ర కారాగారంలో భద్రత, అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్ ఎస్.కిషోర్‌కుమార్‌ను అనంతపురం జైలు సూపరింటెండెంట్‌గా, అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును నెల్లూరు జైలు అదనపు సూపరింటెండెంట్‌గా అటాచ్‌మెంట్ చేశారు. మరోవైపు వరుస ఉదంతాలపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, సెక్యూరిటీ, గార్డు డ్యూటీలు చేసేవారికి సెక్షన్ మార్చకపోవడం, జైలు భద్రత, ఖైదీల ప్రవర్తనపై పర్యవేక్షణ లోపించడమే కారణంగా తేలింది. దీంతో ఏపీ ప్రిజన్స్ రూల్స్ 1979 ఆఫ్ 3 ప్రకారం వారిద్దరిపై సస్పెన్షన్ వేటు వస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దేవాలయాల్లో ప్రొటోకాల్ నిబంధనలు

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవాలయల్లో సాధారణ భక్తుల కంటే ప్రొటోకాల్ కోరుకునే రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ అధికారులతో ఆలయ అధికారులకు తలనొప్పిగా మారింది. ప్రధానంగా పలు రాజకీయ పార్టీలకు చెందిన వార్డు స్థాయి నేతలు, పలు కుల సంఘాలకు చెందిన వారు, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉన్నత స్థాయి ఉద్యోగి నుంచి నాల్గవ తరగతి ఉద్యోగి వరకు కూడా తమకు ప్రొటోకాల్ మర్యాదలు కల్పించాలంటూ దేవాలయ అధికారులపై తరచూ వత్తిడి చేస్తున్నారు. ఇటువంటి పరిస్థితులను ముందుగానే గుర్తించిన దేవదాయ శాఖ రాష్ట్ర కమిషనర్ 2017 డిసెంబరు 17న ఆలయాల్లో ఎవరెవరికి ప్రొటోకాల్ మర్యాదలు చేయాలన్నది ఉత్తర్వులు జారీ చేశారు. తొలుత ఆలయాల వ్యవస్థాపక ధర్మకర్త, రెండవ స్థానాన్ని రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతికి, తరువాత దేశ అత్యున్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, రాష్ట్రాల ప్రధాన న్యాయమూర్తులు, గవర్నర్లు, ప్రధాని, ముఖ్యమంత్రులు, పీఠాధిపతులు, గుర్తింపు పొందిన మఠాధిపతులకు ప్రాధాన్యం ఇస్తారు. అలాగే మొదటిసారి దేవాలయాలను సందర్శించుకునే కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులకు ఒకసారి మాత్రమే అవకాశం కల్పిస్తారు. కానీ ఎమ్మెల్యేలు తాము వచ్చే ప్రతిసారి ప్రొటోకాల్ పాటించాలని అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు. వారి వెంట వచ్చే చోటామోటా నాయకులకు కూడా ప్రొటోకాల్ కింద దండలు, కండువాలు కప్పాలని చెబుతుండడం గమనార్హం, అక్కడితో ఆగకుండా తాము లేదా తమ పీఏలు ఫోన్‌లో చెప్పిన వెంటనే మర్యాదలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇటువంటివి దేవాలయ ఉద్యోగులకు తలనొప్పిగా మారుతున్నాయి.

29న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్

సీతంపేట, డిసెంబరు 4: (ఆంధ్రజ్యోతి): నగరంలోని అల్లూరి సీతారామారాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 29న ఇండియన్ ఫిల్మ్ మేకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్-2024 నిర్వహిస్తున్నట్లు స్టార్ మేకర్ సత్యానంద్ తెలిపారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో తన వద్ద శిక్షణ పొందిన సంతోష్ డాన్స్‌లో మాస్టర్ డిగ్రీ కోసం అమెరికా వెళ్లి షార్ట్ ఫిల్మ్ తీయడం అభినందనీయమని, ఈ లఘు చిత్రంలో తాను కూడా నటించానన్నారు. సంతోష్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ అవార్డు కోసం ఎంపిక కావడంతో పాటు అమెరికాలో అవార్డు పొందడం ఆయనలోని ప్రతిభకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఫిల్మ్ ఫెస్టివల్ గోడప్రతిని ఆవిష్కరించారు. ఆహూతులను ఆకట్టుకునే విధంగా, ప్రాధాన్యం కలిగిన చిత్రాలతో నిర్వహిస్తామన్నారు. ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాలది విజయ, మాజీ డెప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.



రైతుబజారులో నిర్మించిన దుకాణాల సముదాయం

రైతుబజారు ప్రారంభోత్సవానికి సన్నాహాలు

- రైతులకు దుకాణాల కేటాయింపు
- వచ్చే ఏడాది జనవరి నుంచి వినియోగంలోకి..

తగరపువలస, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో నిర్మించిన రైతుబజారు ప్రారంభోత్సవా నికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వాస్తవానికి ఆరు నెలలు క్రితమే రైతుబజారును ప్రారంభిం చాల్సి ఉండగా రైతులకు దుకాణాల కేటాయింపు జరగకపోవడంతో వాయిదా వేశారు. ఈమేరకు జేసీ ఆరిలోవ, తగరపువలసలో కొత్తగా ప్రారంభించనున్న రైతు బజార్ల దుకాణాలకు రైతులను కేటాయించే విషయంలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అందుకు తగిన విధంగా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ 34 కూరగాయల దుకాణాలు ఉండగా, పెద్ద దుకాణాలు, వాటికి అనుబంధంగా షాపింగ్ కాం ప్లెక్సు కూడా నిర్మించారు. ముందుగా ఈ ప్రాంతానికి చెందిన చిరు వ్యాపారులకు, కూరగాయల అమ్మకందారులకు అవకాశం కల్పిస్తారు. వారికి గుర్తింపు కార్డులు అందిస్తారు. కేవలం కూరగాయలే కాకుండా బియ్యం, పప్పు దినుసులు, నూనె వంటి నిత్యావసర సరకులు కూడా విక్రయించనున్నారు. వచ్చే ఏడాది జనవరి నెలలో రైతు బజార్‌ను ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

జనసేనలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో సందీప్

భీమునిపట్నం (రూరల్), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లవలస పంచాయతీకి చెం దిన పలు పార్టీల నాయకులు బుధవారం జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి సందీప్ కండువాలు కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మన్యాల రాంబాబు, శ్రీను, అప్పలరాము తదితరులు ఉన్నారు.

భూములకు రక్ష, బాధ్యులకు శిక్ష

... 5వ పేజీ తరువాయి

ప్లాట్లను కేటాయించారు. అలాగే ఎంవీపీ కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూమిని వుడా అధికారులు అడ్డగోలుగా కొందరికి అతి తక్కువ ధరకు కేటాయించారు. అందులో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. మరో కేసులో బీచ్‌రోడ్డులోని పాండురంగాపురం ఏరియాలో 450 గజాల స్థలాన్ని అతి తక్కువ ధరకు కేటాయించారు. ఇలా అనేక అవకతవకలు జరగడంతో వాటిని 'ఆంధ్రజ్యోతి' 'విశాఖలో భారీ భూ కుంభకోణం', 'అంతా అడ్డగోలే', వరప్రసాదం తదితర శీర్షికలతో వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ కుంభకోణం వల్ల వుడాకు రూ.539.49 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నాటి వీసీ నివేదిక ఇచ్చారు. వీటిపై లోకాయుక్త సుమోటోగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీడీ, విజిలెన్స్, ఏసీబీలతో విచారణ చేయించింది. తప్పులన్నీ నిర్ధారణ అయ్యాయి. అధికారులు, ఉద్యోగుల భాగస్వామ్యం ఉందని తేలింది. అప్పుడు వుడాకు వైస్ చైర్మన్‌గా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి ఎస్.విష్ణు తప్పు చేశారని నిర్ధారణ కావడం, ఆయన రాష్ట్ర విభజనలో తెలంగాణాకు వెళ్లడంతో చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ తరువాత వుడా వీసీగా చేసిన ఇంకో ఐఏఎస్ అధికారి బి.శ్రీధర్ కూడా నిబంధనలు ఉల్లంఘించారని తేల్చారు. అయితే ఆయనపై చర్యలను రాష్ట్ర ప్రభుత్వం 2018లోనే ఉపసంహరించుకుంది. ఇక వుడాలో దీనికి ప్రధాన కారణమైన అప్పటి ఎస్టేట్ అధికారి ఎ.జగదీశ్, పరిపాలన అధికారి కె.కరుణకుమార్, మరో ఏఓ వి.చిరంజీవిరాజు, సీనియర్ అసిస్టెంట్ పి.రామకృష్ణ, ఏఓ నరసింహమూర్తి, ఏడీఎం పున్నయ్య, ఏఓ పండునాయుడు, తహసీల్దార్ మనోరంజనిలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అలాగే ఈ కేసులతో సంబంధం ఉన్న వియ్యపు అప్పలనాయుడు, గెద్దాడ శ్రీనివాసరావు, బి.వరప్రసాద్, ధనలక్ష్మి, హయగ్రీవ జగదీశ్వరుడు, వై.పట్టాభి రామినాయుడు, కరణం రామారావులపై కేసులు నడుస్తున్నాయి.

కేసులు అన్ని నడుస్తున్నాయి

విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

ల్యాండ్ పూలింగ్ కుంభకోణంలో అనర్హులకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేశాము. వాటి రిజిస్ట్రేషన్లు రద్దు చేశాము. కొందరు రిట్ పిటిషన్లు వేశారు. కొన్ని కేసులకు సంబంధించి పూర్తిస్థాయిలో కౌంటర్లు వేయలేదు. వాటిని కూడా వేయిస్తున్నాము. ఈ కుంభకోణంలో ఒక వ్యక్తికి 11 ప్లాట్లు దక్కాయి.

ఫార్మా ప్రమాదంపై దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

నియంత్రణ మండలి అధికారులు వెళ్లారు. వారు స్వతంత్రంగా విచారణ చేయలేదని, భిన్నమైన సమాచారం ఇచ్చారని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపిస్తున్నారు. లామివుడీన్ (హెచ్ఐవీ మందు) ఉత్పత్తి మూడో దశలో ఉండగా ప్రమాదం జరిగిందని ఫ్యాక్టరీస్ విభాగం వెల్లడించింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం 'పాంటోప్రజోల్' మూడో దశ ఉత్పత్తిలో ఉండగా ప్రమాదం జరిగిందని, క్లోరిన్ వాయువు వెలువడిందని నివేదించింది. ఈ రెండు శాఖల అధికారులకూ కంపెనీ యాజమాన్యమే సమాచారం ఇచ్చింది. కానీ వారు వేర్వేరు కారణాలు వెల్లడించారు. ఫ్యాక్టరీస్ అధికారులు ఫాస్జీన్ గ్యాస్ వెలువడిందని పేర్కొన్నారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్‌లో క్లోరిన్ కలుపుతున్నప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి పెరిగిందని, యాసిడ్ బయటకు రాగా దానిపై సోడా జల్లారని, దాంతో ఫాస్జీన్ వాయువు వచ్చిందని, అది విషపూరితం కావడంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. క్లోరిన్ వాయువు వెలువడిందని కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది. వాస్తవానికి క్లోరిన్ వాసన సులువుగానే గుర్తించవచ్చు. 0.002-3.4 పీపీఎం స్థాయిలోనే వాసన తెలుస్తుంది. క్లోరిన్ వాయువు వస్తున్నప్పుడు దానిని పీలుస్తూ కార్మికులు అక్కడే ఎందుకు ఉంటారు?, ఘాటైన వాసన కాబట్టి దూరంగా వెళతారు. అది కనీస జాగ్రత్త. కానీ, బయటకు వచ్చింది క్లోరిన్ వాయువు అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎలా నిర్ధారించారో వెల్లడించలేదు.

ఇవీ అనుమానాలు...

- హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రెండూ కలవవు. అంటే రియాక్షన్ ఏమీ ఉండదు. అటువంటిది విషవాయువు ఎలా వచ్చింది?, ఎక్కడి నుంచి వచ్చింది?
- రియాక్టర్‌లో హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రియాక్టర్‌లో పోసినప్పుడు రియాక్షన్ ఉండదు. అటువంటపుడు ప్రెషర్ (ఒత్తిడి) ఎక్కడి నుంచి వచ్చింది?
- వెంట్ ఎందుకు తెరుచుకుంది?, అందులో నుంచి లిక్విడ్ ఎలా బయటకు వచ్చింది?

...ఇవన్నీ ప్రమాద స్థలిలో పరిశీలించాల్సిన ప్రాథమిక అంశాలు. కానీ రెండు శాఖల అధికారులు యాజమాన్యం చెప్పిన చిలక పలుకులే పలుకుతున్నారు తప్ప సొంతంగా విచారణ చేసి ఏమీ చెప్పడం లేదు. అనుమతి లేకుండా హెచ్ఐవీ మందులు తయారుచేయడం, అనుభవం లేని పనివారితో పనిచేయించడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి అనేక తప్పిదాలు ఉన్నాయి.

తరలింపులో అలసత్వం

ఘటన నవంబరు 26వ తేదీ సాయంత్రం 4.40 గంటలకు జరిగింది. ఆ స్థలంలో ఉన్న కార్మికులు బి-షిఫ్ట్ (మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10గంటలు) ముగిసిన తరువాత యాజమాన్యానికి చెప్పారు. వారిని 27వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు ఆస్పత్రిలో చేర్చారు. అంటే ఘటన జరిగిన 9 గంటల తరువాత వారిని చికిత్సకు పంపారు. కానీ యాజమాన్యం తక్షణమే పంపించామని చెబుతోంది. విషవాయువును పీల్చిన వెంటనే చికిత్సకు తరలిస్తే ప్రాణాలు దక్కేవి. కానీ 9 గంటలు ఆలస్యం కావడంతో ఇద్దరి ప్రాణాలు పోయాయి. ఇప్పటికి కూడా చనిపోయిన కార్మికులు పీల్చిన వాయువు ఏమిటనేది అధికారులు చెప్పడం లేదు.

సంక్షిప్తంగా..

కౌన్సిల్ సమావేశం అనుబంధ అజెండాలో కీలక అంశాలను చేర్చండి

» కార్పొరేటర్ మూర్తి యాదవ్

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11న జరిగే జీవీఎంసీ సర్వసభ్య సమావేశం కోసం తయారుచేసిన అజెండాలో కీలక అంశాలను విస్మరించినందున వాటిని అనుబంధ అజెండాలో చేర్చాలని కోరుతూ జనసేనకు చెందిన 22 వార్డు కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ జీవీఎంసీ కార్యదర్శి బి.వెంకటరమణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ పరిధిలో గత పదేళ్లలో జారీచేసిన టీడీఆర్ బాండ్లు, రెవెన్యూ విభాగంలో ఆస్తి పన్ను విధించడంలో జరుగుతున్న జాప్యం, గత ఐదేళ్లలో కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్లుల వివరాలతో పాటు బిల్లులు చెల్లింపునకు అనుసరిస్తున్న విధివిధానాలను తెలపాలంటూ కౌన్సిల్‌లో తాను గతంలో ప్రశ్నించానని, వాటిని తాజాగా కౌన్సిల్ అజెండాలో చేర్చనందున, అనుబంధ అజెండాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

విశాఖలో క్రీడాభివృద్ధికి సహకరించాలి

శాప్ చైర్మన్ రవినాయుడును కోరిన వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్



శాప్ చైర్మన్‌తో చర్చిస్తున్న ప్రణవ్ గోపాల్

సిరిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చేలా క్రీడాభివృద్ధికి తగిన సహకారం అందించాలని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడును వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ కోరారు. బుధవారం విజయవాడ శాప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా విశాఖ కైలాసగిరిపై సహస క్రీడలు ఏర్పాటు చేశామని వివరించారు. శాప్ ద్వారా వీలైనంత వరకు విశాఖ వేదికగా క్రీడల ఉత్సవాలు జరపాలని, వీఎంఆర్డీఏ నుంచి కూడా సహకారం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిన్నారులు ఉన్నత ఆశయాలతో చదువుకోవాలి : ప్రణవ్ గోపాల్



చిన్నారులతో ప్రణవ్ గోపాల్

సిరిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులు ఉన్నత ఆశయాలతో చదువుకోవాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ సూచించారు. తనను కలిసి అభినందనలు తెలియజేయడానికి వచ్చే వారందరికీ బొకేలు, శాలువాలు వద్దని చెప్పడం జరిగిందని పుస్తకాలు, పెన్నులూ ఇవ్వాలని కోరానన్నారు. అలా వచ్చిన పుస్తకాలు, పెన్నులూ స్వయంగా వివిధ ఆశ్రమాలలో చదువుకుంటున్న చిన్నారులు, వీఎంఆర్డీఏలో పని చేస్తున్న కింద స్థాయి ఉద్యోగులను గుర్తించి వారి పిల్లలకు సైతం అందించారు. దేశానికి అవసరమైన విలువైన మానవవనరులుగా విద్యార్థులు నిలవాలన్నారు. భవిష్యత్‌లో సైతం ఇదే విధానాన్ని తాను కొనసాగిస్తానని తెలియజేశారు. ఇందుకు అందరి సహకారం కావాలన్నారు.

సినిమా గైడ్

● **పుష్ప-2:** జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు(తెలుపు) 28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళ దుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీర దోస 28, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 34, కంద 58, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, క్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

కలవరపెడుతున్న ఏడాకుల చెట్లు

» శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవడంతో ప్రజల ఇబ్బందులు

» తొలగింపునకు చర్యలు తీసుకోవాలంటూ పెరుగుతున్న డిమాండ్

వెంకోజీపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ల క్రితం నగరంలో వచ్చిన హుద్‌హుద్ తుపాను కారణంగా కోల్పోయిన పచ్చదనాన్ని సత్వరమే తీసుకువచ్చేందుకు అప్పట్లో ప్రధాన రోడ్ల పక్కన్న, డివైడర్ల మధ్యలో ఏడాకుల చెట్లను వేశారు.అవి పెరగడంలో త్వరగానే పెరిగాయి. కానీ ఇప్పుడు అవి నగరవాసులకు ఆరోగ్యపరంగా ముప్పు కలిగిస్తున్నాయి. శీతాకాలం వస్తే చాలు వీటి ప్రభావం మరింతగా పెరుగుతోంది. ప్రస్తుతం ఇది పుష్పించే కాలం కావడంతో ఈ చెట్లు నిండా తెల్లని పువ్వులతో దర్శనమిస్తున్నాయి. చూడటానికి ఎంతో ముచ్చటగా ఉండే ఈ వృక్షాలు పువ్వుల నుంచి వెలువడే పుప్పొడి గాలిలో కలిసి శ్వాస సంబంధమైన సమస్యలను కలిగిస్తున్నాయి. వైద్యుల కూడా ఇదే చెబుతున్నారు.

తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రధాన మార్గాల్లో ఈ వృక్షాలు ఉన్నాయి. సీతమ్మధార నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఈ చెట్ల సంఖ్య విరివిగా కనిపిస్తాయి. ఏపుగా పెరిగిపోవడంతో ఇదే మార్గంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లకు తగులుతున్నాయి. దీంతో ఈదురుగాలులు వేసినా, వర్షం పడుతున్న సమయాల్లో ఈ కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి నిప్పురవ్వలు ఎగజిమ్ముతున్నాయి. స్థానికులు, చిన్నారులు, వృద్ధులు రోడ్డును దాటాలంటే ఈ మధ్య డివైడర్‌ను ఎక్కి, ఒక్కో చోట ఈ చెట్లను పట్టుకుని మరీ ఎక్కి రోడ్డును దాటుతుంటారు. ఈ క్రమంలో వర్షం పడే సమయంలోనూ, మంచుకురిసే సమయంలోనూ విద్యుత్ షాక్ తగులుతోందని ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు దాటాలంటే చాలు బిక్కుబిక్కుమంటున్నారు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈ చెట్లు పుష్పిస్తాయి. ఈ సమయంలో చెట్లను ప్రూనింగ్ చేస్తే పూలు వచ్చే అవకాశం, ఇబ్బంది ఉండదని, అలాగే హై టెన్షన్ విద్యుత్ తీగలను తాకకుండా చెట్లను తొలగించడం వంటి చర్యలను జీవీఎంసీ ఉద్యానవన విభాగం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



హెచ్‌బీ కాలనీలో ఏపుగా డివైడర్ మధ్యలో పెరిగిన ఏడాకుల చెట్లు



ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్లు

తిరోగమనంలో ప్రభుత్వ నిర్ణయాలు

» యూటీఎఫ్ నేతల విమర్శ



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

ఆరిలోవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగానికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుతం కూటమి సర్కారు అవలంబిస్తున్న విధానాలకు పెద్ద తేడా లేకుండా పోతోందని విశాఖ జిల్లా ఐక్య ఫెడరేషన్ (యూటీఎఫ్) సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉపాధ్యాయులకు, విద్యా రంగానికి ఇబ్బందిగా ఉంటున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

అనంతరం వీరిరువురూ విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, పదో తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు, ఇటువంటి ప్రతి నిర్ణయం అసంబద్ధంగా ఉందని పేర్కొన్నారు. మండలాల్లో పది శాతానికి మించి సెలవులు పెట్టరాదంటూ మండల విద్యాశాఖాధికారులు అత్యవసర సమయాల్లో కూడా సెలవులు ఇవ్వడం సబబుగా లేదన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి సైతం సెలవు ఇవ్వకుంటే ఎలా అని ప్రశ్నించారు. 100 రోజుల పాటు యాక్షన్ ప్లాన్‌లో ఆదివారంతో పాటు పండగ దినాలలో సైతం పని చేయాలని చెప్పడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయుల పనితీరుపై ప్రభావం చూపే ఇలాంటి అనాలోచిత నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలాగే యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 11న అన్ని డీఈవో కార్యాలయాల వద్ద నిరసనలు, 16వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామని వారు తెలిపారు.



ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న చెన్నా తిరుమలరావు తదితరులు

ఘంటసాల విగ్రహ పరిసరాల్లో ఆడిటోరియం ఏర్పాటు చేయాలి

రామ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల విగ్రహ ప్రాంగణంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండాచర్యలు తీసుకోవాలని ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు కోరారు. ఘంటశాల 102వ జయంతి సందర్భంగా బుధవారం బీచ్‌రోడ్డులో ఘంటశాల కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘంటసాల కోసం ఏర్పాటు చేసిన పార్కులో పాడైపోయిన హెలీకాప్టర్‌తో మ్యూజియం ఏర్పాటు చేయటం సమంజసం కాదన్నారు. చాలా కాలంగా ఘంటసాల స్మారక ఓపెన్ ఆడిటోరియం నిర్మించి కళాకారులకు అంకితం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఫుడ్‌కోర్టు నిర్మాణం చేయాలని భావించారని, ఇప్పటి స్పీకర్ అయ్యన్నపాత్రుడి జోక్యంతో ఆ నిర్ణయం వెనక్కు తీసుకున్నారన్నారు. తాజాగా ఇప్పుడు మ్యూజియం పేరుతో నిర్మాణాలు చేస్తున్నారని, ఈ పనులను నిలిపివేసి ఘంటసాల ఆడిటోరియం నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు మహ్మద్ గౌస్, కొణతాల రాజు, నూకల ప్రభాకర్, కె.రాజేంద్ర ప్రసాద్, బొమ్మిడి సత్యనారాయణ, రమణి, పోలమర శెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లా స్థాయి కళాఉత్సవ్

భీమునిపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌ను ఈనెల 5,6 తేదీల్లో నిర్వహిస్తున్నామని డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న బాలబాలికలు పోటీల్లో పాల్గొంటారన్నారు. గాత్ర సంగీతంలో శాస్త్రీయ, జానపద, భక్తి, దేశభక్తి గీతాలు, సోలో, ఐదుగురు సభ్యుల బృందం, వాద్య సంగీతంలో శాస్త్రీయ, సంప్రదాయ, మెలోడి, నృత్యంలో శాస్త్రీయ, సోలో, జానపద నాటక రంగంలో ఏకపాత్రాభినయం, మిమిక్రీ అంశాల్లో పోటీలుంటాయి. దృశ్యకళలో 2డి, 3డి, సంప్రదాయ బొమ్మల తయారీ, ప్రాంతీయ కలల వస్తువుల తయారీ, సంప్రదాయ కథ చెప్పడంలో బుర్రకథ, ఒగ్గు కథ ఉంటాయన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు వారి పాఠశాలల ఉపాధ్యాయులతో సహా డైట్‌లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ హాజరు కావాలన్నారు. వివరాలకు 94414 65299, 90524 23757 నంబర్లలో సంప్రతించాలన్నారు.

సీపీ కార్యాలయంలో పార్కింగ్ ఏరీనా ప్రారంభం



పార్కింగ్ ఏరీనాను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి, జీవీఎంసీ కమిషనర్ .సంపత్‌కుమార్, సంపత్‌కుమార్

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ ఆవరణలో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన ఏరీనాను సీపీ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది, ప్రజలు వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది పడుతుండడంతో జీవీఎంసీ కమిషనర్‌ను కోరిన వెంటనే నిధులు కేటాయించి షెడ్‌లను నిర్మించారన్నారు. సీసీ కెమెరాలు, లైటింగ్ సదుపాయం కల్పించేందుకు సహకరించారన్నారు. త్వరలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. నేరస్తులను రోడ్లపైనే గుర్తించే సదుపాయం అందుబాటులోకి వచ్చి నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ సీపీతో చాలాకాలంగా అనుబంధం ఉందన్నారు. పోలీసులు కొన్ని వాహనాలు అడిగారని, వాటిని సీఎస్ఆర్ నిధులతో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన లారీ దగ్ధం



దగ్ధమైన లారీ

ఆరిలోవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లో పార్కింగ్ చేసిన క్వారీ లారీ మంగళవారం రాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో దగ్ధమైంది. స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే లారీ చాలా వరకు కాలిపోయింది. మంగళవారం రాత్రి పిక్క తీసుకొని వెళ్లి అన్‌లోడ్ చేసిన అనంతరం ఇక్కడ పార్కింగ్ చేశామని, అయితే ఎందువల్లనో ఈ లారీ దగ్ధమైందని లారీ యజమాని మహేశ్ తెలిపారు. దీనిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.

రమాదేవి స్కూలులో సమస్యల్ని పరిష్కరించండి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విశాఖ ఆర్య వైశ్య సంఘం డైరెక్టర్ రూప, కూటమి పార్టీల నేతలు

ఆరిలోవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డులో గల రమాదేవి పబ్లిక్ స్కూలు తరగతులు అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారిప్రేమ్‌కుమార్‌కు విశాఖ ఆర్య వైశ్య సంఘం డైరెక్టర్ కొల్లూరి రూప, టీడీపీ వార్డు అధ్యక్షుడు సారిపల్లి మహేశ్, జనసేన 35వ వార్డు ఇన్‌చార్జి నారా నాగేశ్వరరావు, 42వ వార్డు ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు.అలాగే స్కూలులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ప్రాంతంలో అంతా పేద విద్యార్థులు ఉన్నారని, వారంతా ఇదే పాఠశాలలో చదువుతుంటారని తెలిపారు. తమ నివేదినపై డీఈవో సానుకూలంగా స్పందించినట్టు సంఘం నేతలు, పలు పార్టీల నాయకులు తెలిపారు. అలాగే ఈ సమస్యలను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు చెప్పారు.

నేటి నుంచి టీటీడీ క్యాలెండర్ల విక్రయం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం ఏటా ప్రచురించే క్యాలెండర్ల విక్రయాలను గురువారం ప్రారంభించనున్నారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో క్యాలెండర్లు అందుబాటులో ఉంటాయని టీటీడీ మేనేజర్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. బల్క్‌లో కావాల్సిన వారు తిరుమలబాలాజీ.ఏపీ.ఇన్ సైట్‌లో సంప్రతించాలని కోరారు.

22న పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా 7వ మహాసభలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఈవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి తదితరులు

సిరిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) విశాఖ జిల్లా 7వ మహాసభలను ఈ నెల 22న నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాజువాక డ్రైవర్స్ కాలనీలోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణతో సభలు ప్రారంభం అవుతాయన్నారు. సభా ప్రాంగణానికి బోయి విజయభారతి ప్రాంగణంగా నామకరణం చేశామన్నారు. మహిళా సంఘాల జాతీయ కో-ఆర్డినేటర్ ఝాన్సీ ప్రారంభోపసన్యాసం చేస్తారని, రచయిత్రి విజయభారతి స్మారకోపన్యాసం గూడూరు సీతామహాలక్ష్మి, ప్రైవేటీకరణ కోల్పోతున్న మహిళల ఉపాధి అవకాశాలపై రచయిత్రి మల్లీశ్వరి ప్రసంగించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వెంకటలక్ష్మి, రోహిణి, సభ్యులు ఇ.లక్ష్మి, కె.జయమ్మ, హరిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్ల నిషేధంపై అవగాహన



వ్యాపారులకు అవగాహన కలిగిస్తున్న శానిటరీ సిబ్బంది

వెంకోజీపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాలిథిన్ నిషేధంపై ప్రజలందరూ అవగాహన పెంపొందించుకోవాలని, తద్వారా విభిన్న రోగాల భారిన పడకుండా పరిరక్షించుకోవాలని 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ సూచించారు. బుధవారం కొత్త వెంకోజీపాలెంలోని జాతీయ రహదారి పక్కనున్న పండ్ల దుకాణం వద్ద వ్యాపారులకు పాలిథిన్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. డస్ట్‌బిన్‌లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడడం వలన క్యాన్సర్, ఇతర రోగాలకు బారిన పడతారని, తడి చెత్త, పొడి చెత్త వేర్వేరు చేసి ఇస్తే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఈ విషయమై ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ మేస్త్రి రమణ, శ్రీను, రాజు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 10న అవకాశమున్న అందరూ జరుపుకోవాలని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ వైజాగ్ శాఖ చైర్మన్ నరవ ప్రకాశరావు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో బుధవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు అందరూ ముందడుగు వేయాలన్నారు. ఈ నెల 8న నగరంలోని ఎల్‌బీ కళాశాల గాంధీ సెంటర్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకాశరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాబ్జీ, అప్పారావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

» ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు జరుగుతాయని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ద్వారకాకాంప్లెక్సులోని ఆర్ఎం కార్యాలయంలో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల ఆర్టీసీ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రీడాకారులకు రవాణా, వసతి, భోజనం, వైద్యం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ మేరకు సంబంధిత కమిటీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశంలోని 20 ఆర్టీసీ సంస్థల ఉద్యోగులు పోటీల్లో పాల్గొంటున్నారని, ఇప్పటికే గుజరాత్ ఆర్టీసీ నుంచి 24 మంది, బీఎంటీసీ నుంచి 50 మంది క్రీడాకారులు నగరానికి చేరుకున్నారన్నారు.

స్పీడ్ బ్రేకర్ తొలగింపు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయం సమీపంలోని నాలుగు రోడ్ల కూడలికి అన్ని వైపులా ఎత్తైన స్పీడు బ్రేకర్లు నిర్మించారు. దాంతో ఆగకుండా బీచ్‌రోడ్డు వెళ్లే చోట అప్పటికే ఉన్న స్పీడు బ్రేకరుకు ముందు మరొకటి ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికుల నుంచి పలు సార్లు ఫిర్యాదులు రావడంతో దానిని బుధవారం తొలగించారు.

7 నుంచి ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ-చెన్నై, విశాఖ-షాలిమార్ మధ్య ప్రత్యేక రైళ్లతోపాటు దువ్వాడ మీదుగా సంబల్‌పూర్-ఇరోడ్, భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-చెన్నై-విశాఖ : 08557 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 7 నుంచి మార్చి 1 వరకు ప్రతి శనివారం రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై సమీపంలోని ఎగ్మోర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08558 నంబరు గల రైలు ఈ నెల 8 నుంచి మార్చి 2 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఎగ్మోర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 10.35 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-షాలిమార్-విశాఖ : 08508 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి మార్చి 4 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.20కు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం తెల్లవారుజామున 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08507 నంబరు గల రైలు ఈ నెల 11 నుంచి మార్చి 5 వరకు ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది.



దువ్వాడ మీదుగా...

సంబల్‌పూర్-ఇరోడ్: 08311 నంబరు గల రైలు ఈ నెల 11 నుంచి మార్చి 3 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.30 గంటలకు ఇరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు ఈ నెల 13 నుంచి మార్చి 7 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఇరోడ్‌లో బయలుదేరి శనివారం మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

భువనేశ్వర్-యశ్వంతపూర్: 02811 నంబరు గల రైలు ఈ నెల 7 నుంచి ఫిబ్రవరి 22 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 1.53కు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 గంటలకుయశ్వంతపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు ఈ నెల 9 నుంచి ఫిబ్రవరి 24 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.

అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

విశాఖ మీదుగా షాలిమార్, వాస్కోడిగామ మధ్య నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో లింక్ హాఫ్మాన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లను అమరుస్తామని డీసీఎం తెలిపారు. విశాఖలో ఈ నెల 16 నుంచి, వాస్కోడిగామలో 19నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు.

చట్టాలు-హక్కులపై అవగాహన ఉండాలి



సదస్సు గోడప్రతిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపై గడిచిన కొన్నేళ్లుగా ఆశ్ర (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్) ప్రజల తరపున పోరాడుతోందని సంస్థ వ్యవస్థాపకుడు, సీనియర్ న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ పేర్కొన్నారు. ఆశ్ర ఆధ్వర్యంలో ఈ నెల 15న బెంగళూరు వేదికగా 6వ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాతీయ సదస్సు గోడప్రతిని ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కులకు భంగం కలిగినప్పుడు వారి కోసం న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. సుమారు తొమ్మిది రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ప్రతీ ఒక్కరికి చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శత్రుఘ్నుడు, జాతీయ సభ్యుడు నాగరాజు, విశాఖపట్నం బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమానీలకంఠేశ్వర స్వామి ఆదాయం. రూ.2.32 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న పీఠం సభ్యులు, భక్తులు

సీతమ్మధార, డిసెంబరు 4: (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఆలయం హుండీల్లో రూ.2,31,904 ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

అక్కయ్యపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న జరిగే మెగా తల్లిదండ్రుల దినోత్సవానికి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస ఆహ్వానించారు. ఆయనకు బుధవారం ఆహ్వాన పత్రిక అందించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఆర్.శ్రీనివాసరావు, పీడీ ఎ.సునంద్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ కార్డులు అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు కస్తూరినగర్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు ఆవాల నారాయణ స్వామి ఆధ్వర్యంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందరూ మద్దతు తెలపాలన్నారు. అనంతరం సభ్యత్వం కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారడపూడి కుమారి, గొటివాడ గంగరాజు, మారడపూడి వెంకటరావు, ఎం.ఆనంద్, అర్జల దాసు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన సహాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఉషాకిరణ్

మర్రిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మర్రిపాలెం మహరాణివీధికి చెందిన జనసైనికుడు కొలుసు శివ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను బుధవారం ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్, దొగ్గ సురేంద్ర, వీరమహిళలు పాండ్రంకి స్వర్ణలత, రాజ్యలక్ష్మీచౌదరి పాల్గొన్నారు.

కాన్వెంట్ జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్

జ్ఞానాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాన్వెంట్ జంక్షన్‌లో బుధవారం రాత్రి ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో అల్లిపురం, రైల్వేస్టేషన్‌కు వెళ్లే వాహనదారులు అందులో చిక్కుకున్నారు. రాత్రి వేళలో ట్రాఫిక్ అధికారులు ముఖ్యకూడళ్లలో ఉంటే ట్రాఫిక్ జామ్ నియంత్రణ అవకాశం కలుగుతుందని పలువురు వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ అధికారులు చర్యలు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

పుస్తకాలకు వన్నె తరగని ఆదరణ

» టర్నర్ చౌల్ట్రీ హాల్లో ప్రదర్శన మహోత్సవానికి అనూహ్య స్పందన » ఆంగ్ల రచనల కోసం ఆసక్తి » సందర్శిస్తున్న ప్రముఖులు



విశాఖ టర్నర్ చౌల్ట్రీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో వివిధ రకాల పుస్తకాలు

మహారాణిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పూర్వం పుస్తకమే ప్రపంచంగా చాలామంది గడిపేవారు. జ్ఞాన సముపార్జనకు, వికాసానికి, స్నేహ సంపద పెంచుకోవడానికి పుస్తకాలు ఉపకరిస్తాయన్నది చాలామంది నమ్మకం. కాలంతో పాటు వచ్చిన మార్పుల ప్రభావంతో పుస్తకాల వెలుగు మసకబారి, డిజిటల్ యుగం మానవాళిని చుట్టేసింది. సమాచార వేగానికి తప్ప విశ్లేషణాత్మక పఠనానికి ఉపకరించడం లేదన్నది క్రమేణా అర్థంకావడంతో పుస్తక పఠనానికే చాలామంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది కాలం నేర్పిన పాఠం. ఇంటర్నెట్, సెల్‌ఫోన్లలో క్షణాల్లో చేతిలోకి సమాచారం చేరుతున్నా. పుస్తకాలు చదివిన అనుభూతి ఇందులో ఉండడం లేదు. ఈ కారణంగా అనేక మంది తిరిగి పుస్తకాలు, పత్రికా పఠనం వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఎక్కడ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినా విశేష ఆదరణ కనిపిస్తోంది. విశాఖ టర్నర్ చౌల్ట్రీ హాల్‌లో నవంబరు 14న ప్రారంభమైన విశాలాంధ్ర పుస్తక మహోత్సవానికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనం. ఈ నెల 10వ తేదీతో ముగియబోతున్న ఈ ప్రదర్శనకు అనేక మంది సాహిత్య అభిమానులు, పుస్తక ప్రియులు ఎగబడుతున్నారు. ఈ ప్రదర్శనలో పెద్దబాల శిక్ష, చందమామ కథల పుస్తకాల నుంచి, సుప్రసిద్ధ రచయితలు, నేటితరం రచయితలు రాసిన అనేకానేక పుస్తకాలు లభ్యం కావడం విశేషం. కొత్తగా వెలువడిన పుస్తకాల కోసం పుస్తకప్రియులు అన్వేషిస్తున్నారు. ఆంగ్ల రచయితలు ఆర్‌కే నారాయణ్, సుధామూర్తి, చేతన్ భగత్, రుస్కేల్ బాండ్ వంటి వారి రచనలకు విపరీతమైన ఆదరణ కనిపిస్తోంది. ఈ ప్రదర్శనలో సుమారు 30 వేల రకాల పుస్తకాలు, 40 రకాల ప్రచురణ కర్తల నవలలు, కథలు, కవితలు, బాల సాహిత్యం, ఆధ్యాత్మికం, మానసిక విశ్లేషణలు, ఆరోగ్యంపై రచనలను ఎంచుకుంటున్నారు. టీవీ ధారావాహికలకు అలవాటు పడిన మహిళలు సైతం, అందులో విపరీత ధోరణులను విసిగి పుస్తక పఠనంవైపు మళ్లడం తాజా మార్పునకు నిదర్శనం. యువతరం మాత్రం పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల కోసమే ఎక్కువగా ఆరా తీస్తున్నారు.

భావ వ్యక్తీకరణలో పట్టు అవసరం

» ఉద్యోగార్థులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సూచన » ఘనంగా రీజనల్ పాలీటెక్ ఫెస్ట్



ప్రసంగిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రీజనల్ పాలీటెక్ ఫెస్ట్‌ను విష్ణుకుమార్‌రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సరైన భావ వ్యక్తీకరణ నైపుణ్యం (కమ్యూనికేషన్ స్కిల్స్) లేక ఉపాధిని పొందడంలో వెనకబడుతున్నారన్నారు. ఆంగ్ల భాషలో భావ వ్యక్తీకరణ నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను అందుకోవడంలో గురువుల పాత్రను కొనియాడారు. డిప్లొమా విద్యార్థులకు ఇంజినీరింగ్ చదివినవారికంటే ప్రాక్టికల్ నాలెడ్జ్ అధికంగా ఉండి ఎక్కువ సంఖ్యలో ప్రాంగణ ఎంపికల్లో ముందుండడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ప్రాజెక్టునమూనాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాల పిన్సిపాల్ డా.కె. నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్లు, 28 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రారంభమైన రీజనల్ పాలీటెక్ ఫెస్ట్‌లో ఉమ్మడి విశాఖపట్టణం జిలాలోని 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 19 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టు నమూనాలతో పాల్గొన్నారు.

రేపు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు ఈ నెల 6న నిర్వహించనున్నట్టు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి ఎస్.గోపీకృష్ణ తెలిపారు. విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరిగే ఎంపికలకు క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి తుది జట్టులో చోటు కల్పిస్తామన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 13 నుంచి అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని గోపీకృష్ణ పేర్కొన్నారు. ఔత్సాహిక క్రీడాకారులకు ఎలాంటి సందేహాలున్నా పూర్తి వివరాలు తెలుసుకునేందుకు గోపీకృష్ణ ఫోన్: 93939 96660 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ ఏదీ?



బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

మహారాణిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడికి పాల్పడుతూ మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని హిందూ ఐక్యవేదిక బుధవారం ఆందోళన చేపట్టింది. అనంతరం ఐక్యవేదిక ప్రతినిధులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. తొలుత బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ నిర్మాణంలో సహకరించిన హిందువులను, ఇతర మైనారిటీలను ఊచకోత కోస్తున్నారని, దేవాలయాలను, వారి నివాస గృహాలను కూల్చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హిందూ మహిళలపై అత్యాచారాలు, ఆస్తులు దోచుకోవడం వంటి పరిణామాలు మన దేశ ప్రజల మనసును గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తూ శాంతి వచనాలు పలికే రాజకీయ పక్షాలు, లెఫ్ట్ వాదులు, మానవహక్కుల సంఘాలు ఒక్కమాట మాట్లాడకపోవడం శోచనీయమని అన్నారు. అంతర్జాతీయ సమాజం ద్వారా మైనారిటీలకు రక్షణ కల్పించేలా కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎస్ మాధవ్, నారాయణరావు, అన్నాబాబ్జి, జనార్దన్, శివాజీ, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

29న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్



ఫిల్మ్ ఫెస్టివల్ ప్రచార పత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాస్టర్ సత్యానంద్ తదితరులు

సీతంపేట, డిసెంబరు 4: (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 29న ఇండియన్ ఫిల్మ్ మేకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్-2024 నిర్వహిస్తున్నట్లు స్టార్ మేకర్ సత్యానంద్ తెలిపారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో తన వద్ద శిక్షణ పొందిన సంతోష్ డాన్స్‌లో మాస్టర్ డిగ్రీ కోసం అమెరికా వెళ్లి షార్ట్ ఫిల్మ్ తీయడం అభినందనీయమని, ఈ లఘు చిత్రంలో తాను కూడా నటించానన్నారు. సంతోష్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ అవార్డు కోసం ఎంపిక కావడంతో పాటు అమెరికాలో అవార్డు పొందడం ఆయనలోని ప్రతిభకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఫిల్మ్ ఫెస్టివల్ గోడప్రతిని ఆవిష్కరించారు. ఆహూతులను ఆకట్టుకునే విధంగా, ప్రాధాన్యం కలిగిన చిత్రాలతో నిర్వహిస్తామన్నారు. ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాలది విజయ, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పీజీకి వర్తించేనా?

... 5వ పేజీ తరువాయి

సుమారు 4,958 సీట్లు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసినప్పటి నుంచి అనేక కాలేజీల్లో సీట్లు సరిగా భర్తీ కావడం లేదు. గతంలో శత శాతం సీట్లు భర్తీ అయిన గ్రూపుల్లో కూడా 20 నుంచి 40 శాతం కాని పరిస్థితి ఏర్పడడంతో ప్రముఖ కాలేజీలు కూడా పీజీ కోర్సుల నిర్వహణ నుంచి తప్పుకున్నాయి. మళ్లీ అమలు చేస్తారన్న ఉద్దేశంతో కొన్ని కాలేజీలు మాత్రం కోర్సులను కొనసాగిస్తూ వస్తున్నాయి.

కథలు సమాజానికి మార్గనిర్దేశం చేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ డి.వి. సూర్యారావు

సీతంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రచయితలు సమకాలీన పరిస్థితులను అధ్యయనం చేసి సమాజానికి అవసరమైన రచనలు చేయాలని, కథలు మార్గనిర్దేశం చేయాలని రచయిత, విశ్లేషకులు డాక్టర్ డి.వి. సూర్యారావు పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజం కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కథా కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ కథకులలో పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, గోపిచంద్ తదితరులు అగ్రశ్రేణి రచయితలన్నారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా విజయనిర్మాణ్ సంస్థ అధినేత డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, కార్యదర్శి చిన సూర్యనారాయణ, భాగవతుల మూర్తి పాల్గొన్నారు.

7 నుంచి గీతామృత ప్రవచనాలు

» చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో గీతా జయంతి వేడుకలు



పాదుకలు చూపుతున్న వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు, ఇతర ప్రముఖులు

సీతమ్మధార, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి 11 వరకు సీతమ్మధార రైతుబజార్ పక్కన గల వర్మ కాంప్లెక్స్‌లో గీతా జయంతి వేడుకలు, గీతామృత ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ఆర్ వర్మ, వైభవ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు తెలిపారు. వర్మ కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్న జీయర్ స్వామి 7న గీతామృత ప్రవచన కార్యక్రమం ప్రారంభిస్తారని వెల్లడించారు. ప్రజలంతా సౌఖ్యంగా ఉండాలని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలకు ఉజ్వల భవిష్యత్ రావాలనే సంకల్పంతో ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. రోజూ ఉదయం భగవద్గీత ప్రవచనం, అనంతరం తీర్థగోష్ఠి, భక్తుల గోత్రనామాలతో గోపూజ ఉంటుందన్నారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గీతా ప్రవచనం జరుగుతాయన్నారు. 8న ఉదయం 10 గంటల నుంచి శ్రీరామ పాదుకా ఆరాధన, సాయంత్రం నేత్ర విద్యాలయ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. 10న ఔత్సాహిక భక్తులకు మంత్రోపదేశం చేస్తారన్నారు. ఈ నెల 11న విద్యార్థులతో చిన్నజీయర్ స్వామి సంపూర్ణ భగవద్గీత పారాయణం చేయిస్తారన్నారు. సమావేశంలో వారిజ కమిటీ సభ్యులు ఎంఎస్ రాజు, సాతులూరి రామానుజం, టి.నారాయణ రెడ్డి, కాశిరాజు, బుస్కీ మాస్టర్, పీఎస్ఎన్ రాజు, వారిజ వేద పాఠశాల ఆచార్యులు సంతోష్‌కుమార్, నేత్ర విద్యాలయ ఇంచార్జ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

రసాయన విపత్తులపై మాక్‌డ్రిల్



ఈస్టిండియా పెట్రోలియంలో నిర్వహించిన మాక్ డ్రిల్

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ఇండియా పెట్రోలియంలో ఫ్యాక్టరీల శాఖ రసాయన విపత్తులపై బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించింది. సొసైటీ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీతో రసాయన పరిశ్రమలో భద్రత, అత్యవసర నిర్వహణపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించింది. ఇందులో భాగంగా ఫార్మాసహా వివిధ పరిశ్రమలకు చెందిన 300 మంది ప్రతినిధుల సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కర్మాగారాల జాయింట్ చీఫ్ జె.శివశంకరరెడ్డి ప్రసంగిస్తూ అత్యవసర రెస్క్యూటీమ్‌కు రసాయన విపత్తులను ఎలా ఎదుర్కోవాలో, ప్రాణ,ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలో నేర్పుతుందన్నారు. ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ఇన్‌స్పెక్టర్ జీవీవీఎస్ నారాయణ వీక్షించారు. సిబ్బందిని అభినందించారు. ఈస్టిండియా పెట్రోలియం లిమిటెడ్ ఈడీ కృష్ణప్రసాద్, సీనియర్ జనరల్ మేనేజర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఫార్మా ప్రమాదంపై దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

నియంత్రణ మండలి అధికారులు వెళ్లారు. వారు స్వతంత్రంగా విచారణ చేయలేదని, భిన్నమైన సమాచారం ఇచ్చారని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపిస్తున్నారు. లామివుడీన్ (హెచ్ఐవీ మందు) ఉత్పత్తి మూడో దశలో ఉండగా ప్రమాదం జరిగిందని ఫ్యాక్టరీస్ విభాగం వెల్లడించింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం 'పాంటోప్రజోల్' మూడో దశ ఉత్పత్తిలో ఉండగా ప్రమాదం జరిగిందని, క్లోరిన్ వాయువు వెలువడిందని నివేదించింది. ఈ రెండు శాఖల అధికారులకూ కంపెనీ యాజమాన్యమే సమాచారం ఇచ్చింది. కానీ వారు వేర్వేరు కారణాలు వెల్లడించారు.

ఫ్యాక్టరీస్ అధికారులు ఫాస్జీన్ గ్యాస్ వెలువడిందని పేర్కొన్నారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్‌లో క్లోరిన్ కలుపుతున్నప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి పెరిగిందని, యాసిడ్ బయటకు రాగా దానిపై సోడా జల్లారని, దాంతో ఫాస్జీన్ వాయువు వచ్చిందని, అది విషపూరితం కావడంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

క్లోరిన్ వాయువు వెలువడిందని కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది. వాస్తవానికి క్లోరిన్ వాసన సులువుగానే గుర్తించవచ్చు. 0.002-3.4 పీపీఎం స్థాయిలోనే వాసన తెలుస్తుంది. క్లోరిన్ వాయువు వస్తున్నప్పుడు దానిని పీలుస్తూ కార్మికులు అక్కడే ఎందుకు ఉంటారు?, ఘాటైన వాసన కాబట్టి దూరంగా వెళతారు. అది కనీస జాగ్రత్త. కానీ, బయటకు వచ్చింది క్లోరిన్ వాయువు అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎలా నిర్ధారించారో వెల్లడించలేదు.

ఇవీ అనుమానాలు...

» హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రెండూ కలవవు. అంటే రియాక్షన్ ఏమీ ఉండదు. అటువంటిది విషవాయువు ఎలా వచ్చింది?, ఎక్కడి నుంచి వచ్చింది?

» రియాక్టర్‌లో హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రియాక్టర్‌లో పోసినప్పుడు రియాక్షన్ ఉండదు. అటువంటపుడు ప్రెషర్ (ఒత్తిడి) ఎక్కడి నుంచి వచ్చింది?

» వెంట్ ఎందుకు తెరుచుకుంది?, అందులో నుంచి లిక్విడ్ ఎలా బయటకు వచ్చింది?

...ఇవన్నీ ప్రమాద స్థలిలో పరిశీలించాల్సిన ప్రాథమిక అంశాలు. కానీ రెండు శాఖల అధికారులు యాజమాన్యం చెప్పిన చిలక పలుకులే పలుకుతున్నారు తప్ప సొంతంగా విచారణ చేసి ఏమీ చెప్పడం లేదు. అనుమతి లేకుండా హెచ్ఐవీ మందులు తయారుచేయడం, అనుభవం లేని పనివారితో పనిచేయించడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి అనేక తప్పిదాలు ఉన్నాయి.

తరలింపులో అలసత్వం

ఘటన నవంబరు 26వ తేదీ సాయంత్రం 4.40 గంటలకు జరిగింది. ఆ స్థలంలో ఉన్న కార్మికులు బి-షిఫ్ట్ (మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10గంటలు) ముగిసిన తరువాత యాజమాన్యానికి చెప్పారు. వారిని 27వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు ఆస్పత్రిలో చేర్చారు. అంటే ఘటన జరిగిన 9 గంటల తరువాత వారిని చికిత్సకు పంపారు. కానీ యాజమాన్యం తక్షణమే పంపించామని చెబుతోంది. విషవాయువును పీల్చిన వెంటనే చికిత్సకు తరలిస్తే ప్రాణాలు దక్కేవి. కానీ 9 గంటలు ఆలస్యం కావడంతో ఇద్దరి ప్రాణాలు పోయాయి. ఇప్పటికి కూడా చనిపోయిన కార్మికులు పీల్చిన వాయువు ఏమిటనేది అధికారులు చెప్పడం లేదు.

భూములకు రక్ష, బాధ్యులకు శిక్ష

... 5వ పేజీ తరువాయి

ప్లాట్లను కేటాయించారు. అలాగే ఎంవీపీ కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూమిని వుడా అధికారులు అడ్డగోలుగా కొందరికి అతి తక్కువ ధరకు కేటాయించారు. అందులో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. మరో కేసులో బీచ్‌రోడ్డులోని పాండురంగాపురం ఏరియాలో 450 గజాల స్థలాన్ని అతి తక్కువ ధరకు కేటాయించారు. ఇలా అనేక అవకతవకలు జరగడంతో వాటిని 'ఆంధ్రజ్యోతి' 'విశాఖలో భారీ భూ కుంభకోణం', 'అంతా అడ్డగోలే', వరప్రసాదం తదితర శీర్షికలతో వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ కుంభకోణం వల్ల వుడాకు రూ.539.49 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నాటి వీసీ నివేదిక ఇచ్చారు. వీటిపై లోకాయుక్త సుమోటోగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సీఐడీ, విజిలెన్స్, ఏసీబీలతో విచారణ చేయించింది. తప్పులన్నీ నిర్ధారణ అయ్యాయి. అధికారులు, ఉద్యోగుల భాగస్వామ్యం ఉందని తేలింది. అప్పుడు వుడాకు వైస్ చైర్మన్‌గా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి ఎన్.విష్ణు తప్పు చేశారని నిర్ధారణ కావడం, ఆయన రాష్ట్ర విభజనలో తెలంగాణాకు వెళ్లడంతో చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ తరువాత వుడా వీసీగా చేసిన ఇంకో ఐఏఎస్ అధికారి బి.శ్రీధర్ కూడా నిబంధనలు ఉల్లంఘించారని తేల్చారు. అయితే ఆయనపై చర్యలను రాష్ట్ర ప్రభుత్వం 2018లోనే ఉపసంహరించుకుంది. వుడాలో దీనికి ప్రధాన కారణమైన అప్పటి ఎస్టేట్ అధికారి ఎ.జగదీశ్, పరిపాలన అధికారి కె.కరుణ కుమార్, మరో ఏఓ వి.చిరంజీవిరాజు, సీనియర్ అసిస్టెంట్ పి.రామకృష్ణ, ఏఓ నరసింహమూర్తి, ఏడీఎం పున్నయ్య, ఏఓపందునాయుడు, తహసీల్దార్ మనోరంజనిలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అలాగే ఈ కేసులతో సంబంధం ఉన్న వియ్యపు అప్పలనాయుడు, గెద్దాడ శ్రీనివాసరావు, బి.వరప్రసాద్, ధనలక్ష్మి, హయగ్రీవ జగదీశ్వరుడు, వై.పట్టాభి రామినాయుడు, కరణం రామారావులపై కేసులు నడుస్తున్నాయి.

కేసులు అన్ని నడుస్తున్నాయి

ల్యాండ్ పూలింగ్ కుంభకోణంలో అనర్హులకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేశాము. వాటి రిజిస్ట్రేషన్లు రద్దు చేశాము. కొందరు రిట్ పిటిషన్లు వేశారు. కొన్ని కేసులకు సంబంధించి పూర్తిస్థాయిలో కౌంటర్లు వేయలేదు. వాటిని కూడా వేయిస్తున్నాము. ఈ కుంభకోణంలో ఒక వ్యక్తికి 11 ప్లాట్లు దక్కాయి.

-విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

జైలులో వరుస ఘటనలపై సీరియస్

... 5వ పేజీ తరువాయి

కేంద్ర కారాగారంలో భద్రత, అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్ ఎస్.కిషోర్‌కుమార్‌ను అనంతపురం జైలు సూపరింటెండెంట్‌గా, అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును నెల్లూరు జైలు అదనపు సూపరింటెండెంట్‌గా అటాచ్‌మెంట్ చేశారు. మరోవైపు వరుస ఉదంతాలపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, సెక్యూరిటీ, గార్డు డ్యూటీలు చేసేవారికి సెక్షన్ మార్చకపోవడం, జైలు భద్రత, ఖైదీల ప్రవర్తనపై పర్యవేక్షణ లోపించడమే కారణంగా తేలింది. దీంతో ఏపీ ప్రిజన్స్ రూల్స్ 1979 ఆఫ్ 3 ప్రకారం వారిద్దరిపై సస్పెన్షన్ వేటు వస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మురళీనగర్‌లో కొత్త పెట్రోల్ బంకు



లీజు స్థలంలో నిర్మాణంలో ఉన్న షెడ్డు.

మురళీనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ, మధుసూదన్ నగర్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్ల వరకు ఉన్న విశాఖపట్నం పోర్టు ట్రస్టుకు చెందిన ఖాళీ స్థలాల్ని వినియోగంలోకి తీసుకొస్తూ పోర్టు యాజమాన్య పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ వద్ద బర్మాక్యాంపు నివాసిత ప్రాంతాల్ని ఆనుకొని ఉన్న రోడ్డు పక్క స్థలాల్ని కొద్ది రోజుల క్రితం లీజు ప్రాతిపదికన కేటాయించారు. ఈ ఖాళీ స్థలంలో ఇపుడు కొత్తగా పెట్రోల్ బంక్ ఏర్పాటు కానుంది. దీంతో పాటు కార్ల మరమ్మతుల షెడ్లు, పెళ్లి వేడుకల షామియానాల దుకాణాలు వెలుస్తున్నాయి. ఏళ్ల తరబడి వినియోగంలో లేని ఖాళీ స్థలాలిపుడు ఈ అభివృద్ధి పనుల కేటాయింపుతో కొత్త కళను సంతరించుకుంటున్నాయి. దీంతో పాటు అటు బిర్లా జంక్షన్ దాటి తాటిచెట్ల పాలెం వరకు హైవే రోడ్డులో మరో పెట్రోల్ బంక్ లేక ఎగువ 48ఏ బస్ రూట్‌ని ఆనుకొని ఉన్న వేలాది నివాస ప్రాంతాల్లో ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదురవుతు వచ్చాయి. కొత్త పెట్రోల్ బంక్ ఈ దారిలో ఏర్పాటుకానుండటంతో ఊరట లభించనుంది.

☛ సంక్షిప్తంగా..

కౌన్సిల్ సమావేశం అనుబంధ అజెండాలో కీలక అంశాలను చేర్చండి

» కార్పొరేటర్ మూర్తి యాదవ్

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11న జరిగే జీవీఎంసీ సర్వసభ్య సమావేశం కోసం తయారుచేసిన అజెండాలో కీలక అంశాలను విస్మరించినందున వాటిని అనుబంధ అజెండాలో చేర్చాలని కోరుతూ జనసేనకు చెందిన 22 వార్డు కార్పొరేటర్ పీతలమూర్తియాదవ్ జీవీఎంసీ కార్యదర్శి బి.వెంకటరమణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. జీవీఎంసీ పరిధిలో గత పదేళ్లలో జారీచేసిన టీడీఆర్ బాండ్లు, రెవెన్యూ విభాగంలో ఆస్తి పన్ను విధించడంలో జరుగుతున్న జాప్యం, గత ఐదేళ్లలో కాంట్రాక్టర్లకు చెల్లించిన బిల్లుల వివరాలతో పాటు బిల్లులు చెల్లింపునకు అనుసరిస్తున్న విధివిధానాలను తెలపాలంటూ కౌన్సిల్‌లో తాను గతంలో ప్రశ్నించానని, వాటిని తాజాగా కౌన్సిల్ అజెండాలో చేర్చనందున, అనుబంధ అజెండాలో చేర్చాలని డిమాండ్ చేశారు.

విశాఖలో క్రీడాభివృద్ధికి సహకరించాలి

శాప్ చైర్మన్ రవినాయుడును కోరిన వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్



శాప్ చైర్మన్‌తో చర్చిస్తున్న ప్రణవ్ గోపాల్

సిరిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖలో అంతర్జాతీయంగా గుర్తింపు వచ్చేలా క్రీడాభివృద్ధికి తగిన సహకారం అందించాలని శాప్ చైర్మన్ ఎ.రవినాయుడును వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ కోరారు. బుధవారం విజయవాడ శాప్ కార్యాలయంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా విశాఖ కైలాసగిరిపై సహస క్రీడలు ఏర్పాటు చేశామని వివరించారు. శాప్ ద్వారా వీలైనంత వరకు విశాఖ వేదుకగా క్రీడల ఉత్సవాలు జరపాలని, వీఎంఆర్డీఏ నుంచి కూడా సహకారం అందించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

చిన్నారులు ఉన్నత ఆశయాలతో చదువుకోవాలి : ప్రణవ్ గోపాల్



చిన్నారులతో ప్రణవ్ గోపాల్

సిరిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులు ఉన్నత ఆశయాలతో చదువుకోవాలని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ సూచించారు. తనను కలిసి అభినందనలు తెలియజేయడానికి వచ్చే వారందరికీ బోకేలు, శాలువాలు వద్దని చెప్పడం జరిగిందని పుస్తకాలు, పెన్నులూ ఇవ్వాలని కోరానన్నారు. అలా వచ్చిన పుస్తకాలు, పెన్నులూ స్వయంగా వివిధ ఆశ్రమాలలో చదువుకుంటున్న చిన్నారులు, వీఎంఆర్డీఏలో పని చేస్తున్న కింద స్థాయి ఉద్యోగులను గుర్తించి వారి పిల్లలకు సైతం అందించారు. దేశానికి అవసరమైన విలువైన మానవవనరులుగా విద్యార్థులు నిలవాలన్నారు. భవిష్యత్‌లో సైతం ఇదే విధానాన్ని తాను కొనసాగిస్తానని తెలియజేశారు. ఇందుకు అందరి సహకారం కావాలన్నారు.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు(తెలుపు) 28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళ దుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీర దోస 28, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 44, చిలగడ దుంపలు 34, కంద 58, దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్దకట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204

కలవరపెడుతున్న ఏడాకుల చెట్లు

» శ్వాస సంబంధిత సమస్యలు ఎదురవడంతో ప్రజల ఇబ్బందులు
» తొలగింపునకు చర్యలు తీసుకోవాలంటూ పెరుగుతున్న డిమాండ్



హెచ్‌బీ కాలనీలో ఏపుగా డివైడర్ మధ్యలో పెరిగిన ఏడాకుల చెట్లు



ఏపుగా పెరిగి విద్యుత్ వైర్లకు తాకుతున్న చెట్లు

వెంకోజీపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ల క్రితం నగరంలో వచ్చిన హుద్‌హుద్ తుపాను కారణంగా కోల్పోయిన పచ్చదనాన్ని సత్వరమే తీసుకువచ్చేందుకు అప్పట్లో ప్రధాన రోడ్ల పక్కన్న, డివైడర్ల మధ్యలో ఏడాకుల చెట్లను వేశారు.అవి పెరగడంలో త్వరగానే పెరిగాయి. కానీ ఇప్పుడు అవి నగరవాసులకు ఆరోగ్యపరంగా ముప్పు కలిగిస్తున్నాయి. శీతాకాలం వస్తే చాలు వీటి ప్రభావం మరింతగా పెరుగుతోంది. ప్రస్తుతం ఇది పుష్పించే కాలం కావడంతో ఈ చెట్లు నిండా తెల్లని పువ్వులతో దర్శనమిస్తున్నాయి. చూడటానికి ఎంతో ముచ్చటగా ఉండే ఈ వృక్షాలు పువ్వుల నుంచి వెలువడే పుప్పొడి గాలిలో కలిసి శ్వాస సంబంధమైన సమస్యలను కలిగిస్తున్నాయి. వైద్యుల కూడా ఇదే చెబుతున్నారు.

తూర్పు నియోజకవర్గంలోని అన్ని ప్రధాన మార్గాల్లో ఈ వృక్షాలు ఉన్నాయి. సీతమ్మధార నుంచి హెచ్‌బీ కాలనీ మీదుగా కొత్త వెంకోజీపాలెం జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఈ చెట్ల సంఖ్య విరివిగా కనిపిస్తాయి. ఏపుగా పెరిగిపోవడంతో ఇదే మార్గంలో ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్లకు తగులుతున్నాయి. దీంతో ఈదురుగాలులు వేసినా, వర్షం పడుతున్న సమయాల్లో ఈ కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి నిప్పురవ్వలు ఎగజిమ్ముతున్నాయి. స్థానికులు, చిన్నారులు, వృద్ధులు రోడ్డును దాటాలంటే ఈ మధ్య డివైడర్‌ను ఎక్కి, ఒక్కో చోట ఈ చెట్లను పట్టుకుని మరీ ఎక్కి రోడ్డును దాటుతుంటారు. ఈ క్రమంలో వర్షం పడే సమయంలోనూ, మంచుకురిసే సమయంలోనూ విద్యుత్ షాక్ తగులుతోందని ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు దాటాలంటే చాలు బిక్కుబిక్కుమంటున్నారు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు ఈ చెట్టు పుష్పిస్తాయి. ఈ సమయంలో చెట్లను ప్రూనింగ్ చేస్తే పూలు వచ్చే అవకాశం, ఇబ్బంది ఉండదని, అలాగే హై టెన్షన్ విద్యుత్ తీగలను తాకకుండా చెట్లను తొలగించడం వంటి చర్యలను జీవీఎంసీ ఉద్యానవన విభాగం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

22న పీవోడబ్ల్యూ విశాఖ జిల్లా 7వ మహాసభలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మి తదితరులు

సిరిపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) విశాఖ జిల్లా 7వ మహాసభలను ఈ నెల 22న నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తెలిపారు. బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద బుధవారం మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గాజువాక డ్రైవర్స్ కాలనీలోని ద్రోణంరాజు సత్యనారాయణ కల్యాణ మండపంలో ఉదయం 9 గంటలకు జెండా ఆవిష్కరణతో సభలు ప్రారంభం అవుతాయన్నారు. సభా ప్రాంగణానికి బోయి విజయభారతి ప్రాంగణంగా నామకరణం చేశామన్నారు. మహిళా సంఘాల జాతీయ కో-ఆర్డినేటర్ ఝాన్సీ ప్రారంభోపన్యాసం చేస్తారని, రచయిత్రి విజయభారతి స్మారకోపన్యాసం గూడూరు సీతామహాలక్ష్మి, ప్రైవేటీకరణ కోల్పోతున్న మహిళల ఉపాధి అవకాశాలపై రచయిత్రి మల్లీశ్వరి ప్రసంగించనున్నారని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు వెంకటలక్ష్మి, రోహిణి, సభ్యులు ఇ.లక్ష్మి, కె.జయమ్మ, హరిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరోగమనంలో ప్రభుత్వ నిర్ణయాలు

» యూటీఎఫ్ నేతల విమర్శ



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

ఆరిలోవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యా రంగానికి సంబంధించి గత వైసీపీ ప్రభుత్వానికి, ప్రస్తుతం కూటమి సర్కారు అవలంబిస్తున్న విధానాలకు పెద్ద తేడా లేకుండా పోతోందని విశాఖ జిల్లా ఐక్య ఫెడరేషన్ (యూటీఎఫ్) సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డి.నాగేశ్వరరావు, టీఆర్ అంబేడ్కర్ అసంతృప్తి వ్యక్తంచేశారు. బుధవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలు ఉపాధ్యాయులకు, విద్యా రంగానికి ఇబ్బందిగా ఉంటున్నాయని నిరసన వ్యక్తం చేస్తూ డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

అనంతరం వీరిరువురూ విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల పనివేళల పెంపు, 10 శాతం మించి ఉపాధ్యాయులు సెలవులు పెట్టరాదనే ఆంక్షలు, పదో తరగతి పరీక్షలకు సంసిద్ధత పేరుతో విడుదల చేసిన 100 రోజుల యాక్షన్ ప్లాన్, విద్యార్థుల వివరాలు అపార్‌లో నమోదు, ఇటువంటి ప్రతి నిర్ణయం అసంబద్ధంగా ఉందని పేర్కొన్నారు. మండలాల్లో పది శాతానికి మించి సెలవులు పెట్టరాదంటూ మండల విద్యాశాఖాధికారులు అత్యవసర సమయాల్లో కూడా సెలవులు ఇవ్వడం సబబుగా లేదన్నారు. అనారోగ్యం బారిన పడిన వారికి సైతం సెలవు ఇవ్వకుంటే ఎలా అని ప్రశ్నించారు. 100 రోజుల పాటు యాక్షన్ ప్లాన్‌లో ఆదివారంతో పాటు పండగ దినాలలో సైతం పని చేయాలని చెప్పడం అన్యాయమన్నారు. ఉపాధ్యాయుల పనితీరుపై ప్రభావం చూపే ఇలాంటి అనాలోచిత నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అలాగే యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 11న అన్ని డీఈవో కార్యాలయాల వద్ద నిరసనలు, 16వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేపడతామని వారు తెలిపారు.



ఘంటసాలకు నివాళులు అర్పిస్తున్న చెన్నా తిరుమలరావు తదితరులు

ఘంటసాల విగ్రహ పరిసరాల్లో ఆడిటోరియం ఏర్పాటు చేయాలి

రామ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : అమర గాయకుడు ఘంటసాల విగ్రహ ప్రాంగణంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండాచర్యలు తీసుకోవాలని ఘంటసాల స్పోర్ట్సు అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు కోరారు. ఘంటశాల 102వ జయంతి సందర్భంగా బుధవారం బీచ్‌రోడ్డులో ఘంటశాల కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఘంటసాల కోసం ఏర్పాటు చేసిన పార్కులో పాడైపోయిన హెలీకాప్టర్‌తో మ్యూజియం ఏర్పాటు చేయటం సమంజసం కాదన్నారు. చాలా కాలంగా ఘంటసాల స్మారక ఓపెన్ ఆడిటోరియం నిర్మించి కళాకారులకు అంకితం చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. గతంలో ఇదే ప్రాంతంలో ఫుడ్‌కోర్టు నిర్మాణం చేయాలని భావించారని, ఇప్పటి స్పీకర్ అయ్యన్నపాత్రుడి జోక్యంతో ఆ నిర్ణయం వెనక్కు తీసుకున్నారన్నారు. తాజాగా ఇప్పుడు మ్యూజియం పేరుతో నిర్మాణాలు చేస్తున్నారని, ఈ పనులను నిలిపివేసి ఘంటసాల ఆడిటోరియం నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు మహ్మద్ గౌస్, కొణతాల రాజు, నూకల ప్రభాకర్, కె.రాజేంద్ర ప్రసాద్, బొమ్మిడి సత్యనారాయణ, రమణి, పోలమర శెట్టి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ కవర్ల నిషేధంపై అవగాహన



వ్యాపారులకు అవగాహన కలిగిస్తున్న శానిటరీ సిబ్బంది

వెంకోజీపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పాలిథిన్ నిషేధంపై ప్రజలందరూ అవగాహన పెంపొందించుకోవాలని, తద్వారా విభిన్న రోగాల బారిన పడకుండా పరిరక్షించుకోవాలని 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిషోర్ సూచించారు. బుధవారం కొత్త వెంకోజీపాలెంలోని జాతీయ రహదారి పక్కనున్న పండ్ల దుకాణం వద్ద వ్యాపారులకు పాలిథిన్ కవర్ల నిషేధంపై అవగాహన కల్పించారు. డస్ట్‌బిన్‌లను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడడం వలన క్యాన్సర్, ఇతర రోగాలకు బారిన పడతారని, తడి చెత్త, పొడి చెత్త వేర్వేరు చేసి ఇస్తే నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. ఈ విషయమై ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ మేస్త్రి రమణ, శ్రీను, రాజు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జిల్లా స్థాయి కళాఉత్సవ్

భీమునిపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి కళా ఉత్సవ్‌ను ఈనెల 5,6 తేదీల్లో నిర్వహిస్తున్నామని డైట్ ప్రిన్సిపాల్ జ్యోతికుమారి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన పాఠశాలల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న బాలబాలికలు పోటీల్లో పాల్గొంటారన్నారు. గాత్ర సంగీతంలో శాస్త్రీయ, జానపద, భక్తి, దేశభక్తి గీతాలు, సోలో, ఐదుగురు సభ్యుల బృందం, వాద్య సంగీతంలో శాస్త్రీయ, సంప్రదాయ, మెలోడి, నృత్యంలో శాస్త్రీయ, సోలో, జానపద నాటక రంగంలో ఏకపాత్రాభినయం, మిమిక్రీ అంశాల్లో పోటీలుంటాయి. దృశ్యకళలో 2డి, 3డి, సంప్రదాయ బొమ్మల తయారీ, ప్రాంతీయ కలల వస్తువుల తయారీ, సంప్రదాయ కథ చెప్పడంలో బుర్రకథ, ఒగ్గు కథ ఉంటాయన్నారు. ఆయా పోటీల్లో పాల్గొనదలచిన విద్యార్థులు వారి పాఠశాలల ఉపాధ్యాయులతో సహా డైట్‌లో ఉదయం పది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ హాజరు కావాలన్నారు. వివరాలకు 94414 65299, 90524 23757 నంబర్లలో సంప్రతించాలన్నారు.

మానవ హక్కుల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నరవ ప్రకాశరావు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా డిసెంబరు 10న అవకాశమున్న అందరూ జరుపుకోవాలని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ వైజాగ్ శాఖ చైర్మన్ నరవ ప్రకాశరావు కోరారు. ఎంవీపీ కాలనీలోని ఎస్‌వీవీపీ డిగ్రీ కళాశాలలో బుధవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వరరావు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు అందరూ ముందడుగు వేయాలన్నారు. ఈ నెల 8న నగరంలోని ఎల్‌బీ కళాశాల గాంధీ సెంటర్ వద్ద ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకాశరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బాబ్జీ, అప్పారావు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సీపీ కార్యాలయంలో పార్కింగ్ ఎరీనా ప్రారంభం



పార్కింగ్ ఎరీనాను ప్రారంభిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చి, జీవీఎంసీ కమిషనర్ .సంపత్‌కుమార్, సంపత్‌కుమార్

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగర పోలీస్ కమిషనరేట్ ఆవరణలో వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన ఎరీనాను సీపీ శంఖబ్రతబాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది, ప్రజలు వాహనాల పార్కింగ్‌కు ఇబ్బంది పడుతుండడంతో జీవీఎంసీ కమిషనర్‌ను కోరిన వెంటనే నిధులు కేటాయించి షెడ్‌లను నిర్మించారన్నారు. సీసీ కెమెరాలు, లైటింగ్ సదుపాయం కల్పించేందుకు సహకరించారన్నారు. త్వరలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు. నేరస్తులను రోడ్లపైనే గుర్తించే సదుపాయం అందుబాటులోకి వచ్చి నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు. జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ సీపీతో చాలాకాలంగా అనుబంధం ఉందన్నారు. పోలీసులు కొన్ని వాహనాలు అడిగారని, వాటిని సీఎస్‌ఆర్ నిధులతో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు, ఏడీసీపీలు, ఏసీపీలు పాల్గొన్నారు.

పార్కింగ్ చేసిన లారీ దగ్ధం



దగ్ధమైన లారీ

ఆరిలోవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లో పార్కింగ్ చేసిన క్వారీ లారీ మంగళవారం రాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో దగ్ధమైంది. స్థానికులు గుర్తించి సమాచారం అందించడంతో అగ్నిమాపక దళ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే లారీ చాలా వరకు కాలిపోయింది. మంగళవారం రాత్రి పిక్క తీసుకొని వెళ్లి అన్‌లోడ్ చేసిన అనంతరం ఇక్కడ పార్కింగ్ చేశామని, అయితే ఎందువల్లనో ఈ లారీ దగ్ధమైందని లారీ యజమాని మహేశ్ తెలిపారు. దీనిపై ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

క్రీడాకారుల కోసం పకడ్బందీ ఏర్పాట్లు

» ఆర్టీసీ రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

ద్వారకాబస్‌స్టేషన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండర్‌టేకింగ్ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు అంతర్రాష్ట్ర క్రీడా పోటీలు జరుగుతాయని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు వచ్చే క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ద్వారకాకాంప్లెక్సులోని ఆర్‌ఎం కార్యాలయంలో అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల ఆర్టీసీ అధికారులతో బుధవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రీడాకారులకు రవాణా, వసతి, భోజనం, వైద్యం తదితర సౌకర్యాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ మేరకు సంబంధిత కమిటీలు చర్యలు తీసుకోవాలని సూచించారు. దేశంలోని 20 ఆర్టీసీ సంస్థల ఉద్యోగులు పోటీల్లో పాల్గొంటున్నారని, ఇప్పటికే గుజరాత్ ఆర్టీసీ నుంచి 24 మంది, బీఎంటీసీ నుంచి 50 మంది క్రీడాకారులు నగరానికి చేరుకున్నారన్నారు.

రమాదేవి స్కూలులో సమస్యల్ని పరిష్కరించండి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న విశాఖ ఆర్య వైశ్య సంఘం డైరెక్టర్ రూప, కూటమి పార్టీల నేతలు

ఆరిలోవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డులో గల రమాదేవి పబ్లిక్ స్కూలు తరగతులు అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ జిల్లా విద్యాశాఖాధికారిప్రేమ్‌కుమార్‌కు విశాఖ ఆర్య వైశ్య సంఘం డైరెక్టర్ కొల్లూరి రూప, టీడీపీ వార్డు అధ్యక్షుడు సారిపిల్లి మహేశ్, జనసేన 35వ వార్డు ఇన్‌చార్జి నారా నాగేశ్వరరావు, 42వ వార్డు ఇన్‌చార్జి ఎం.శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు.అలాగే స్కూలులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ప్రాంతంలో అంతా పేద విద్యార్థులు ఉన్నారని, వారంతా ఇదే పాఠశాలలో చదువుతుంటారని తెలిపారు.

తమ నివేదినపై డీఈవో సానుకూలంగా స్పందించినట్టు సంఘం నేతలు, పలు పార్టీల నాయకులు తెలిపారు.

అలాగే ఈ సమస్యలను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్టు చెప్పారు.

నేటి నుంచి టీటీడీ క్యాలెండర్ల విక్రయం

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానం ఏటా ప్రచురించే క్యాలెండర్ల విక్రయాలను గురువారం ప్రారంభించనున్నారు. ఎంవీపీ కాలనీలోని టీటీడీ కల్యాణ మండపంలో క్యాలెండర్లు అందుబాటులో ఉంటాయని టీటీడీ మేనేజర్ హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. బల్క్‌లో కావాల్సిన వారు తిరుమలబాలాజీ.ఏపీ.ఇన్ సైట్‌లో సంప్రతించాలని కోరారు.

స్పీడ్ బ్రేకర్ తొలగింపు

ఎంవీపీ కాలనీ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ కాలనీ టాస్క్‌ఫోర్స్ కార్యాలయం సమీపంలోని నాలుగు రోడ్ల కూడలికి అన్ని వైపులా ఎత్తైన స్పీడు బ్రేకర్లు నిర్మించారు. దాంతో ఆగకుండా బీచ్‌రోడ్డు వెళ్లే చోట అప్పటికే ఉన్న స్పీడు బ్రేకరుకు ముందు మరొకటి ఏర్పాటు చేశారు. దీంతో ప్రయాణికుల నుంచి పలు సార్లు ఫిర్యాదులు రావడంతో దానిని బుధవారం తొలగించారు.

7 నుంచి ప్రత్యేక రైళ్లు



దువ్వాడ మీదుగా...

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల డిమాండ్ మేరకు విశాఖ-చెన్నై, విశాఖ-షాలిమార్ మధ్య ప్రత్యేక రైళ్లతోపాటు దువ్వాడ మీదుగా సంబల్‌పూర్-ఇరోడ్, భువనేశ్వర్-యశ్వంత్‌పూర్ మధ్య ప్రత్యేక రైళ్లు ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

విశాఖ-చెన్నై-విశాఖ : 08557 నంబరు గల ప్రత్యేక రైలు ఈ నెల 7 నుంచి మార్చి 1 వరకు ప్రతి శనివారం రాత్రి 7 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.45 గంటలకు చెన్నై సమీపంలోని ఎగ్మోర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08558 నంబరు గల రైలు ఈ నెల 8 నుంచి మార్చి 2 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10.30 గంటలకు ఎగ్మోర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 10.35 గంటలకు విశాఖ చేరుతుంది.

విశాఖ-షాలిమార్-విశాఖ : 08508 నంబరు గల రైలు ఈ నెల 10 నుంచి మార్చి 4 వరకు ప్రతి మంగళవారం ఉదయం 11.20కు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం తెల్లవారుజామున 3 గంటలకు షాలిమార్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08507 నంబరు గల రైలు ఈ నెల 11 నుంచి మార్చి 5 వరకు ప్రతి బుధవారం ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 8.50 గంటలకు విశాఖ చేరుతుంది.

సంబల్‌పూర్-ఇరోడ్: 08311 నంబరు గల రైలు ఈ నెల 11 నుంచి మార్చి 3 వరకు ప్రతి బుధవారం ఉదయం 11.35 గంటలకు సంబల్‌పూర్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 9.30 గంటలకు దువ్వాడ, గురువారం రాత్రి 8.30 గంటలకు ఇరోడ్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08312 నంబరు గల రైలు ఈ నెల 13 నుంచి మార్చి 7 వరకు ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఇరోడ్‌లో బయలుదేరి శనివారం మధ్యాహ్నం 1.08 గంటలకు దువ్వాడ, రాత్రి 11.15 గంటలకు సంబల్‌పూర్ చేరుతుంది.

భువనేశ్వర్-యశ్వంతపూర్: 02811 నంబరు గల రైలు ఈ నెల 7 నుంచి ఫిబ్రవరి 22 వరకు ప్రతి శనివారం రాత్రి 7.15 గంటలకు భువనేశ్వర్‌లో బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున 1.53కు దువ్వాడ, అర్ధరాత్రి 12.15 గంటలకుయశ్వంతపూర్ చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 02812 నంబరు గల రైలు ఈ నెల 9 నుంచి ఫిబ్రవరి 24 వరకు ప్రతి సోమవారం ఉదయం 4.30 గంటలకు యశ్వంతపూర్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4.30 గంటలకు దువ్వాడ, మధ్యాహ్నం 12.15 గంటలకు భువనేశ్వర్ చేరుతుంది.

అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

విశాఖ మీదుగా షాలిమార్, వాస్కోడిగామ మధ్య నడిచే అమరావతి ఎక్స్‌ప్రెస్‌కు ఐసీఎఫ్ కోచ్‌ల స్థానంలో లింక్ హాఫ్మాన్ బుష్ (ఎల్‌హెచ్‌బీ) కోచ్‌లను అమరుస్తామని డీసీఎం తెలిపారు. విశాఖలో ఈ నెల 16 నుంచి, వాస్కోడిగామలో 19నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు.

చట్టాలు-హక్కులపై అవగాహన ఉండాలి



సదస్సు గోడప్రతిని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

డాబాగార్డెన్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినియోగదారుల హక్కులపై గడిచిన కొన్నేళ్లుగా ఆశ్ర (అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్నెస్) ప్రజల తరపున పోరాడుతోందని సంస్థ వ్యవస్థాపకుడు, సీనియర్ న్యాయవాది హబీబ్ సుల్తాన్ అలీ పేర్కొన్నారు. ఆశ్ర ఆధ్వర్యంలో ఈ నెల 15న బెంగళూరు వేదికగా 6వ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. బుధవారం డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాతీయ సదస్సు గోడప్రతిని ఏపీ స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యుడు నరసింగరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల హక్కులకు భంగం కలిగినప్పుడు వారి కోసం న్యాయ పోరాటం చేస్తున్నామన్నారు. సుమారు తొమ్మిది రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. ప్రతీ ఒక్కరికి చట్టాలు, హక్కులపై అవగాహన ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శత్రుఘ్నుడు, జాతీయ సభ్యుడు నాగరాజు, విశాఖపట్నం బార్ కౌన్సిల్ మాజీ అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉమానీలకంఠేశ్వర స్వామి ఆదాయం. రూ.2.32 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న పీఠం సభ్యులు, భక్తులు

సీతమ్మధార, డిసెంబరు 4: (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన హుండీల్లోని కానుకలను దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. ఆలయం హుండీల్లో రూ.2,31,904 ఆదాయం లభించింది. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

అక్కయ్యపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ 26వ వార్డు ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో ఈ నెల 7న జరిగే మెగా తల్లిదండ్రుల దినోత్సవానికి ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజును ప్రధానోపాధ్యాయిని బి.లక్ష్మీ నరస ఆహ్వానించారు. ఆయనకు బుధవారం ఆహ్వాన పత్రిక అందించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ ఆర్.శ్రీనివాసరావు, పీడీ ఎ.సునంద్ తదితరులు ఆమె వెంట ఉన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ కార్డులు అందిస్తున్న నాయకులు

అక్కయ్యపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 46వ వార్డు కస్తూరినగర్‌లో టీడీపీ సీనియర్ నాయకుడు ఆవాల నారాయణ స్వామి ఆధ్వర్యంలో బుధవారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందరూ మద్దతు తెలపాలన్నారు. అనంతరం సభ్యత్వం కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారడపూడి కుమారి, గొటివాడ గంగరాజు, మారడపూడి వెంకటరావు, ఎం.ఆనంద్, అర్జల దాను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి జనసేన సహాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఉషాకిరణ్

మద్రిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మద్రిపాలెం మహారాణివీధికి చెందిన జనసైనికుడు కొలుసు శివ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను బుధవారం ఉత్తర నియోజకవర్గ జనసేన కన్వీనర్ పసుపులేటి ఉషాకిరణ్ పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు జనసేన అధ్యక్షుడు వింజుమూరి భాస్కర్, దొగ్గ సురేంద్ర, వీరమహిళలు పాండ్రంకి స్వర్ణలత, రాజ్యలక్ష్మీచౌదరి పాల్గొన్నారు.

కాన్వెంట్ జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్

జ్ఞానాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాన్వెంట్ జంక్షన్‌లో బుధవారం రాత్రి ట్రాఫిక్ జామ్ అయ్యింది. దీంతో అల్లిపురం, రైల్వేస్టేషన్‌కు వెళ్లే వాహనదారులు అందులో చిక్కుకున్నారు. రాత్రి వేళలో ట్రాఫిక్ అధికారులు ముఖ్యకూడళ్లలో ఉంటే ట్రాఫిక్ జామ్ నియంత్రణ అవకాశం కలుగుతుందని పలువురు వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ అధికారులు చర్యలు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

పుస్తకాలకు వన్నె తరగని ఆదరణ

» టర్నర్ చౌల్ట్రీ హాల్లో ప్రదర్శన మహోత్సవానికి అనూహ్య స్పందన » ఆంగ్ల రచనల కోసం ఆసక్తి » సందర్శిస్తున్న ప్రముఖులు



విశాఖ టర్నర్ చౌల్ట్రీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రదర్శనలో వివిధ రకాల పుస్తకాలు

మహారాణిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పూర్వం పుస్తకమే ప్రపంచంగా చాలామంది గడిపేవారు. జ్ఞాన సముపార్జనకు, వికాసానికి, స్నేహ సంపద పెంచుకోవడానికి పుస్తకాలు ఉపకరిస్తాయన్నది చాలామంది నమ్మకం. కాలంతో పాటు వచ్చిన మార్పుల ప్రభావంతో పుస్తకాల వెలుగు మసకబారి, డిజిటల్ యుగం మానవాళిని చుట్టేసింది. సమాచార వేగానికి తప్ప విశ్లేషణాత్మక పఠనానికి ఉపకరించడం లేదన్నది క్రమేణా అర్థంకావడంతో పుస్తక పఠనానికే చాలామంది ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది కాలం నేర్పిన పాఠం. ఇంటర్నెట్, సెల్‌ఫోన్లలో క్షణాల్లో చేతిలోకి సమాచారం చేరుతున్నా.. పుస్తకాలు చదివిన అనుభూతి ఇందులో ఉండడం లేదు. ఈ కారణంగా అనేక మంది తిరిగి పుస్తకాలు, పత్రికా పఠనం వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఎక్కడ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేసినా విశేష ఆదరణ కనిపిస్తోంది. విశాఖ టర్నర్ చౌల్ట్రీ హాల్‌లో నవంబరు 14న ప్రారంభమైన విశాలాంధ్ర పుస్తక మహోత్సవానికి లభిస్తున్న స్పందనే ఇందుకు నిదర్శనం. ఈ నెల 10వ తేదీతో ముగియబోతున్న ఈ ప్రదర్శనకు అనేక మంది సాహిత్య అభిమానులు, పుస్తక ప్రియులు ఎగబడుతున్నారు. ఈ ప్రదర్శనలో పెద్దబాల శిక్ష, చందమామ కథల పుస్తకాల నుంచి, సుప్రసిద్ధ రచయితలు, నేటితరం రచయితలు రాసిన అనేకానేక పుస్తకాలు లభ్యం కావడం విశేషం. కొత్తగా వెలువడిన పుస్తకాల కోసం పుస్తకప్రియులు అన్వేషిస్తున్నారు. ఆంగ్ల రచయితలు ఆర్కే నారాయణ్, సుధామూర్తి, చేతన్ భగత్, రుస్కేల్ బాండ్ వంటి వారి రచనలకు విపరీతమైన ఆదరణ కనిపిస్తోంది. ఈ ప్రదర్శనలో సుమారు 30 వేల రకాల పుస్తకాలు, 40 రకాల ప్రచురణ కర్తల నవలలు, కథలు, కవితలు, బాల సాహిత్యం, ఆధ్యాత్మికం, మానసిక విశ్లేషణలు, ఆరోగ్యంపై రచనలను ఎంచుకుంటున్నారు. టీవీ ధారావాహికలకు అలవాటు పడిన మహిళలు సైతం, అందులో విపరీత ధోరణులను విసిగి పుస్తక పఠనంవైపు మళ్లడం తాజా మార్పునకు నిదర్శనం. యువతరం మాత్రం పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాల కోసమే ఎక్కువగా ఆరా తీస్తున్నారు.

భావ వ్యక్తీకరణలో పట్టు అవసరం

» ఉద్యోగార్థులకు ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు సూచన » ఘనంగా రీజనల్ పాలీటెక్ ఫెస్ట్



ప్రసంగిస్తున్న ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

కంచరపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు అన్నారు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రీజనల్ పాలీటెక్ ఫెస్ట్‌ను విష్ణుకుమార్‌రాజు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వేదికలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సరైన భావ వ్యక్తీకరణ నైపుణ్యం (కమ్యూనికేషన్ స్కిల్స్) లేక ఉపాధిని పొందడంలో వెనకబడుతున్నారన్నారు. ఆంగ్ల భాషలో భావ వ్యక్తీకరణ నేర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు తమ జీవిత లక్ష్యాలను అందుకోవడంలో గురువుల పాత్రను కొనియాడారు. డిప్లొమా విద్యార్థులకు ఇంజినీరింగ్ చదివినవారికంటే ప్రాక్టికల్ నాలెడ్జ్ అధికంగా ఉండి ఎక్కువ సంఖ్యలో ప్రాంగణ ఎంపికల్లో ముందుండడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించిన ప్రాజెక్టునమూనాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాల పిన్సిపాల్ డా.కె.నారాయణరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.వి.రమణ, ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్లు, 28 కళాశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శనలు

కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల్లో ప్రారంభమైన రీజనల్ పాలీటెక్ ఫెస్ట్‌లో ఉమ్మడి విశాఖపట్టణం జిలాలోని 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు, 19 ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు తమ ప్రాజెక్టు నమూనాలతో పాల్గొన్నారు.

రేపు జిల్లా హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు

విశాఖపట్నం స్పోర్ట్సు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా సీనియర్ పురుషుల హ్యాండ్‌బాల్ జట్టు ఎంపికలు ఈ నెల 6న నిర్వహించనున్నట్టు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి ఎస్.గోపీకృష్ణ తెలిపారు. విశాఖపట్నంలోని ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం సాయంత్రం 5 గంటలకు జరిగే ఎంపికలకు క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపిన వారిని ఎంపిక చేసి తుది జట్టులో చోటు కల్పిస్తామన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 13 నుంచి అనంతపురంలో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టోర్నీలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని గోపీకృష్ణ పేర్కొన్నారు. ఔత్సాహిక క్రీడాకారులకు ఎలాంటి సందేహాలున్నా పూర్తి వివరాలు తెలుసుకునేందుకు గోపీకృష్ణ ఫోన్: 93939 96660 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ ఏదీ?



బీచ్ రోడ్డులో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

మహారాణిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై దాడికి పాల్పడుతూ మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని హిందూ ఐక్యవేదిక బుధవారం ఆందోళన చేపట్టింది. అనంతరం ఐక్యవేదిక ప్రతినిధులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. తొలుత బీచ్‌రోడ్డులో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ బంగ్లాదేశ్ నిర్మాణంలో సహకరించిన హిందువులను, ఇతర మైనారిటీలను ఊచకోత కోస్తున్నారని, దేవాలయాలను, వారి నివాస గృహాలను కూల్చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హిందూ మహిళలపై అత్యాచారాలు, ఆస్తులు దోచుకోవడం వంటి పరిణామాలు మన దేశ ప్రజల మనసును గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతు ఇస్తూ శాంతి వచనాలు పలికే రాజకీయ పక్షాలు, లెఫ్ట్ వాదులు, మానవహక్కుల సంఘాలు ఒక్కమాట మాట్లాడకపోవడం శోచనీయమని అన్నారు. అంతర్జాతీయ సమాజం ద్వారా మైనారిటీలకు రక్షణ కల్పించేలా కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్, నారాయణరావు, అన్నాబాబ్జీ, జనార్దన్, శివాజీ, ధార్మిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

29న ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్



ఫిల్మ్ ఫెస్టివల్ ప్రచార పత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాస్టర్ సత్యానంద్ తదితరులు

సీతంపేట, డిసెంబరు 4: (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామారాజు విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 29న ఇండియన్ ఫిల్మ్ మేకర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్-2024 నిర్వహిస్తున్నట్టు స్టార్ మేకర్ సత్యానంద్ తెలిపారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో తన వద్ద శిక్షణ పొందిన సంతోష్ డాన్స్‌లో మాస్టర్ డిగ్రీ కోసం అమెరికా వెళ్లి షార్ట్ ఫిల్మ్ తీయడం అభినందనీయమని, ఈ లఘు చిత్రంలో తాను కూడా నటించానన్నారు. సంతోష్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ అవార్డు కోసం ఎంపిక కావడంతో పాటు అమెరికాలో అవార్డు పొందడం ఆయనలోని ప్రతిభకు నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా ఫిల్మ్ ఫెస్టివల్ గోడప్రతిని ఆవిష్కరించారు. ఆహూతులను ఆకట్టుకునే విధంగా, ప్రాధాన్యం కలిగిన చిత్రాలతో నిర్వహిస్తామన్నారు. ఇండియన్ ఫిల్మ్ మేకర్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాలది విజయ, మాజీ డెప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ పీజీకి వర్తించేనా?

... 5వ పేజీ తరువాయి

సుమారు 4,958 సీట్లు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసినప్పటి నుంచి అనేక కాలేజీల్లో సీట్లు సరిగా భర్తీ కావడం లేదు. గతంలో శత శాతం సీట్లు భర్తీ అయిన గ్రూపుల్లో కూడా 20 నుంచి 40 శాతం కాని పరిస్థితి ఏర్పడడంతో ప్రముఖ కాలేజీలు కూడా పీజీ కోర్సుల నిర్వహణ నుంచి తప్పుకున్నాయి. మళ్లీ అమలు చేస్తారన్న ఉద్దేశంతో కొన్ని కాలేజీలు మాత్రం కోర్సులను కొనసాగిస్తూ వస్తున్నాయి.

కథలు సమాజానికి మార్గనిర్దేశం చేయాలి




మాట్లాడుతున్న డాక్టర్ డి.వి. సూర్యారావు

సీతంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రచయితలు సమకాలీన పరిస్థితులను అధ్యయనం చేసి సమాజానికి అవసరమైన రచనలు చేయాలని, కథలు మార్గనిర్దేశం చేయాలని రచయిత, విశ్లేషకులు డాక్టర్ డి.వి. సూర్యారావు పేర్కొన్నారు. సీతంపేట రాజేంద్రనగర్‌లో గల ప్రిజం కళాశాలలో సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కథా కచేరి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా విచ్చేసిన డాక్టర్ సూర్యారావు మాట్లాడుతూ కథకులలో పాలగుమ్మి పద్మరాజు, బుచ్చిబాబు, గోపిచంద్ తదితరులు అగ్రశ్రేణి రచయితలన్నారు. సహృదయ సాహితి సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా విజయనిర్మాణ్ సంస్థ అధినేత డాక్టర్ సూరపనేని విజయ్‌కుమార్, కార్యదర్శి చిన సూర్యనారాయణ, భాగవతుల మూర్తి పాల్గొన్నారు.

7 నుంచి గీతామృత ప్రవచనాలు

» చిన్న జీయర్ స్వామి పర్యవేక్షణలో గీతా జయంతి వేడుకలు



పాదుకలు చూపుతున్న వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు, ఇతర ప్రముఖులు

సీతమ్మధార, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7 నుంచి 11 వరకు సీతమ్మధార రైతుబజార్ పక్కన గల వర్మ కాంప్లెక్స్‌లో గీతా జయంతి వేడుకలు, గీతామృత ప్రవచనాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వికాస తరంగిణి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ఆర్ వర్మ, వైభవ వెంకటేశ్వర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు శేషాచార్యులు తెలిపారు. వర్మ కాంప్లెక్స్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ చిన్న జీయర్ స్వామి 7న గీతామృత ప్రవచన కార్యక్రమం ప్రారంభిస్తారని వెల్లడించారు. ప్రజలంతా సౌఖ్యంగా ఉండాలని, విద్యార్థులు, రైతులు, ఉద్యోగులు, మహిళలకు ఉజ్వల భవిష్యత్ రావాలనే సంకల్పంతో ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. రోజూ ఉదయం భగవద్గీత ప్రవచనం, అనంతరం తీర్థగోష్ఠి, భక్తుల గోత్రనామాలతో గోపూజ ఉంటుందన్నారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, గీతా ప్రవచనం జరుగుతాయన్నారు. 8న ఉదయం 10 గంటల నుంచి శ్రీరామ పాదుకా ఆరాధన, సాయంత్రం నేత్ర విద్యాలయ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. 10న ఔత్సాహిక భక్తులకు మంత్రోపదేశం చేస్తారన్నారు. ఈ నెల 11న విద్యార్థులతో చిన్నజీయర్ స్వామి సంపూర్ణ భగవద్గీత పారాయణం చేయిస్తారన్నారు. సమావేశంలో వారిజ కమిటీ సభ్యులు ఎంఎస్ రాజు, సాతులూరి రామానుజం, టి.నారాయణ రెడ్డి, కాశిరాజు, బుస్కీ మాస్టర్, పీఎస్ఎన్ రాజు, వారిజ వేద పాఠశాల ఆచార్యులు సంతోష్‌కుమార్, నేత్ర విద్యాలయ ఇంచార్జ్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

రసాయన విపత్తులపై మాక్‌డ్రిల్



ఈస్టిండియా పెట్రోలియంలో నిర్వహించిన మాక్ డ్రిల్

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ఇండియా పెట్రోలియంలో ఫ్యాక్టరీల శాఖ రసాయన విపత్తులపై బుధవారం మాక్‌డ్రిల్ నిర్వహించింది. సొసైటీ ఫర్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీతో రసాయన పరిశ్రమలో భద్రత, అత్యవసర నిర్వహణపై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించింది. ఇందులో భాగంగా ఫార్మాసహా వివిధ పరిశ్రమలకు చెందిన 300 మంది ప్రతినిధుల సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. కర్మాగారాల జాయింట్ చీఫ్ జె.శివశంకరరెడ్డి ప్రసంగిస్తూ అత్యవసర రెస్క్యూటీమ్‌కు రసాయన విపత్తులను ఎలా ఎదుర్కోవాలో, ప్రాణ,ఆస్తి నష్టాన్ని ఎలా నివారించాలో నేర్పుతుందన్నారు. ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్‌ఇన్‌స్పెక్టర్ జీవీవీఎస్ నారాయణ వీక్షించారు. సిబ్బందిని అభినందించారు. ఈస్టిండియా పెట్రోలియం లిమిటెడ్ ఈడీ కృష్ణప్రసాద్, సీనియర్ జనరల్ మేనేజర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

ఫార్మా ప్రమాదంపై దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

నియంత్రణ మండలి అధికారులు వెళ్లారు. వారు స్వతంత్రంగా విచారణ చేయలేదని, భిన్నమైన సమాచారం ఇచ్చారని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపిస్తున్నారు. లామివుడీన్ (హెచ్‌ఐవీ మందు) ఉత్పత్తి మూడో దశలో ఉండగా ప్రమాదం జరిగిందని ఫ్యాక్టరీస్ విభాగం వెల్లడించింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం 'పాంటోప్రజోల్' మూడో దశ ఉత్పత్తిలో ఉండగా ప్రమాదం జరిగిందని, క్లోరిన్ వాయువు వెలువడిందని నివేదించింది. ఈ రెండు శాఖల అధికారులకూ కంపెనీ యాజమాన్యమే సమాచారం ఇచ్చింది. కానీ వారు వేర్వేరు కారణాలు వెల్లడించారు.

ఫ్యాక్టరీస్ అధికారులు ఫాస్జీన్ గ్యాస్ వెలువడిందని పేర్కొన్నారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్‌లో క్లోరిన్ కలుపుతున్నప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి పెరిగిందని, యాసిడ్ బయటకు రాగా దానిపై సోడా జల్లారని, దాంతో ఫాస్జీన్ వాయువు వచ్చిందని, అది విషపూరితం కావడంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

క్లోరిన్ వాయువు వెలువడిందని కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది. వాస్తవానికి క్లోరిన్ వాసన సులువుగానే గుర్తించవచ్చు. 0.002-3.4 పీపీఎం స్థాయిలోనే వాసన తెలుస్తుంది. క్లోరిన్ వాయువు వస్తున్నప్పుడు దానిని పీలుస్తూ కార్మికులు అక్కడే ఎందుకు ఉంటారు?, ఘాటైన వాసన కాబట్టి దూరంగా వెళతారు. అది కనీస జాగ్రత్త. కానీ, బయటకు వచ్చింది క్లోరిన్ వాయువు అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎలా నిర్ధారించారో వెల్లడించలేదు.

ఇవీ అనుమానాలు...

» హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రెండూ కలవవు. అంటే రియాక్షన్ ఏమీ ఉండదు. అటువంటిది విషవాయువు ఎలా వచ్చింది?, ఎక్కడి నుంచి వచ్చింది?

» రియాక్టర్‌లో హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రియాక్టర్‌లో పోసినప్పుడు రియాక్షన్ ఉండదు. అటువంటపుడు ప్రెషర్ (ఒత్తిడి) ఎక్కడి నుంచి వచ్చింది?

» వెంట్ ఎందుకు తెరుచుకుంది?, అందులో నుంచి లిక్విడ్ ఎలా బయటకు వచ్చింది?

...ఇవన్నీ ప్రమాద స్థలిలో పరిశీలించాల్సిన ప్రాథమిక అంశాలు. కానీ రెండు శాఖల అధికారులు యాజమాన్యం చెప్పిన చిలక పలుకులే పలుకుతున్నారు తప్ప సొంతంగా విచారణ చేసి ఏమీ చెప్పడం లేదు. అనుమతి లేకుండా హెచ్‌ఐవీ మందులు తయారుచేయడం, అనుభవం లేని పనివారితో పనిచేయించడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి అనేక తప్పిదాలు ఉన్నాయి.

తరలింపులో అలసత్వం

ఘటన నవంబరు 26వ తేదీ సాయంత్రం 4.40 గంటలకు జరిగింది. ఆ స్థలంలో ఉన్న కార్మికులు బి-షిఫ్ట్ (మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10గంటలు) ముగిసిన తరువాత యాజమాన్యానికి చెప్పారు. వారిని 27వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు ఆస్పత్రిలో చేర్చారు. అంటే ఘటన జరిగిన 9 గంటల తరువాత వారిని చికిత్సకు పంపారు. కానీ యాజమాన్యం తక్షణమే పంపించామని చెబుతోంది. విషవాయువును పీల్చిన వెంటనే చికిత్సకు తరలిస్తే ప్రాణాలు దక్కేవి. కానీ 9 గంటలు ఆలస్యం కావడంతో ఇద్దరి ప్రాణాలు పోయాయి. ఇప్పటికి కూడా చనిపోయిన కార్మికులు పీల్చిన వాయువు ఏమిటనేది అధికారులు చెప్పడం లేదు.

భూములకు రక్ష, బాధ్యులకు శిక్ష

... 5వ పేజీ తరువాయి

ప్లాట్లను కేటాయించారు. అలాగే ఎంవీపీ కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూమిని వుడా అధికారులు అడ్డగోలుగా కొందరికి అతి తక్కువ ధరకు కేటాయించారు. అందులో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. మరో కేసులో బీచ్‌రోడ్డులోని పాండురంగాపురం ఏరియాలో 450 గజాల స్థలాన్ని అతి తక్కువ ధరకు కేటాయించారు. ఇలా అనేక అవకతవకలు జరగడంతో వాటిని 'ఆంధ్రజ్యోతి' 'విశాఖలో భారీ భూ కుంభకోణం', 'అంతా అడ్డగోలే', వరప్రసాదం తదితర శీర్షికలతో వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ కుంభకోణం వల్ల వుడాకు రూ.539.49 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నాటి వీసీ నివేదిక ఇచ్చారు. వీటిపై లోకాయుక్త సుమోటోగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. మరో వైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సీఐడీ, విజిలెన్స్, ఏసీబీలతో విచారణ చేయించింది. తప్పులన్నీ నిర్ధారణ అయ్యాయి. అధికారులు, ఉద్యోగుల భాగస్వామ్యం ఉందని తేలింది. అప్పుడు వుడాకు వైస్ చైర్మన్‌గా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి ఎన్.విష్ణు తప్పు చేశారని నిర్ధారణ కావడం, ఆయన రాష్ట్ర విభజనలో తెలంగాణాకు వెళ్లడంతో చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ తరువాత వుడా వీసీగా చేసిన ఇంకో ఐఏఎస్ అధికారి బి.శ్రీధర్ కూడా నిబంధనలు ఉల్లంఘించారని తేల్చారు. అయితే ఆయనపై చర్యలను రాష్ట్ర ప్రభుత్వం 2018లోనే ఉపసంహరించుకుంది. వుడాలో దీనికి ప్రధాన కారణమైన అప్పటి ఎస్టేట్ అధికారి ఎ.జగదీశ్, పరిపాలన అధికారి కె.కరుణ కుమార్, మరో ఏఓ వి.చిరంజీవిరాజు, సీనియర్ అసిస్టెంట్ పి.రామకృష్ణ, ఏఓ నరసింహమూర్తి, ఏడీఎం పున్నయ్య, ఏఓపండునాయుడు, తహసీల్దార్ మనోరంజనిలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అలాగే ఈ కేసులతో సంబంధం ఉన్న వియ్యపు అప్పలనాయుడు, గెద్దాడ శ్రీనివాసరావు, బి.వరప్రసాద్, ధనలక్ష్మి, హయగ్రీవ జగదీశ్వరుడు, వై.పట్టాభి రామినాయుడు, కరణం రామారావులపై కేసులు నడుస్తున్నాయి.

కేసులు అన్నీ నడుస్తున్నాయి

ల్యాండ్ పూలింగ్ కుంభకోణంలో అనర్హులకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేశాము. వాటి రిజిస్ట్రేషన్లు రద్దు చేశాము. కొందరు రిట్ పిటిషన్లు వేశారు. కొన్ని కేసులకు సంబంధించి పూర్తిస్థాయిలో కౌంటర్లు వేయలేదు. వాటిని కూడా వేయిస్తున్నాము. ఈ కుంభకోణంలో ఒక వ్యక్తికి 11 ప్లాట్లు దక్కాయి.

-విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

జైలులో వరుస ఘటనలపై సీరియస్

... 5వ పేజీ తరువాయి

కేంద్ర కారాగారంలో భద్రత, అధికారుల పని తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్ ఎస్.కిషోర్‌కుమార్‌ను అనంతపురం జైలు సూపరింటెండెంట్‌గా, అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును నెల్లూరు జైలు అదనపు సూపరింటెండెంట్‌గా అటాచ్‌మెంట్ చేశారు. మరోవైపు వరుస ఉదంతాలపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, సెక్యూరిటీ, గార్డు డ్యూటీలు చేసేవారికి సెక్షన్ మార్చకపోవడం, జైలు భద్రత, ఖైదీల ప్రవర్తనపై పర్యవేక్షణ లోపించడమే కారణంగా తేలింది. దీంతో ఏపీ ప్రిజన్స్ రూల్స్ 1979 ఆఫ్ 3 ప్రకారం వారిద్దరిపై సస్పెన్షన్ వేటు వస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మురళీనగర్‌లో కొత్త పెట్రోల్ బంకు



లీజు స్థలంలో నిర్మాణంలో ఉన్న షెడ్డు.

మురళీనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ, మధుసూదన్ నగర్, సీఐఎస్ఎఫ్ క్వార్టర్ల వరకు ఉన్న విశాఖపట్నం పోర్టు ట్రస్టుకు చెందిన ఖాళీ స్థలాల్ని వినియోగంలోకి తీసుకొస్తూ పోర్టు యాజమాన్య పర్యవేక్షణలో చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగా మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ వద్ద బర్మాక్యాంపు నివాసిత ప్రాంతాల్ని ఆనుకొని ఉన్న రోడ్డు పక్క స్థలాల్ని కొద్ది రోజుల క్రితం లీజు ప్రాతిపదికన కేటాయించారు. ఈ ఖాళీ స్థలంలో ఇపుడు కొత్తగా పెట్రోల్ బంక్ ఏర్పాటు కానుంది. దీంతో పాటు కార్ల మరమ్మతుల షెడ్లు, పెళ్లి వేడుకల షామియానాల దుకాణాలు వెలుస్తున్నాయి. ఏళ్ల తరబడి వినియోగంలో లేని ఖాళీ స్థలాలిపుడు ఈ అభివృద్ధి పనుల కేటాయింపుతో కొత్త కళను సంతరించుకుంటున్నాయి. దీంతో పాటు అటు బిర్లా జంక్షన్ దాటి తాటిచెట్ల పాలెం వరకు హైవే రోడ్డులో మరో పెట్రోల్ బంక్ లేక ఎగువ 48ఎ బస్ రూట్‌ని ఆనుకొని ఉన్న వేలాది నివాస ప్రాంతాల్లో ప్రయాణీకులకు ఇబ్బందులు ఎదురవుతు వచ్చాయి. కొత్త పెట్రోల్ బంక్ ఈ దారిలో ఏర్పాటుకానుండటంతో ఊరట లభించనుంది.



ఆక్రమణల తొలగింపు

పెందుర్తి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతల అగ్రహారం బస్ స్టాండ్ కూడలిలో ఉన్న ఆక్రమణలను అధికారులు బుధవారం తొలగించారు. ఇక్కడి బస్ స్టాండ్ కూడలిలో పీఏసీఎస్‌కు చెందిన 40 సెంట్ల స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ. 2 కోట్లకు పైమాటే. ఇంతటి విలువైన స్థలం పరిరక్షణకు పీఏసీఎస్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కనీసం చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయలేదు. ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని ఇప్పటివరకు ఆర్టీసీ అధికారులు బస్ స్టాండ్‌గా వినియోగించేవారు.బస్సులు రద్దయిన తర్వాత ఆటో డ్రైవర్లు ఆటోలు నిలపడానికి వినియోగిస్తున్నారు. వీరితో పాటు కొంతమంది చిల్లర వ్యాపారులు కూడా స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొంతమంది బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి, మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారుల మధ్య గొడవలు జరిగి పోలీసుల దృష్టికి వెళ్లడంతో స్థానిక నాయకులు జోక్యం చేసుకుని సొసైటీ స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టారు.దుకాణాలతో పాటు మందుబాబులు, చిల్లర ఆటగాళ్లు కూర్చోవడానికి నిర్మించిన సిమెంట్ దిమ్మలు, బల్లలను కూడా తొలగించారు. సొసైటీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోతులు సక్రమంగా పూడ్చక ఇబ్బందులు



రోడ్డుపై చదును చేయకుండా ఉన్న మట్టి

మల్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గాజువాక ఆర్టీసీ డిపో నుంచి అచ్చినాయుడు తోటలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు తాగునీటి సరఫరా నిమిత్తం పైపులైన్ ఏర్పాటుకు అధికారులు గోతులు తవ్వారు. పైప్‌లైన్ ఏర్పాటు తరువాత గోతులను సక్రమంగా పూడ్చకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు మార్గం బాగా నానిపోయింది. ఈ మార్గం మీదుగా వెళ్లేటప్పుడు వాహనాలు మట్టిలోకి కురుకుపోతున్నాయి. దీనికితోడు ఇక్కడ విద్యుత్ లైట్లు కూడా లేవు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి గోతుల పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు రేపు

వేపగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలో శుక్రవారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు అర్చకుడు శేషాద్రి శర్మ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, స్వర్ణ పుష్పాలతో అర్చన, పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తామని చెప్పారు.

సినిమా గైడ్

● పుష్ప-2 : జగదాంబ, శారద, రమాదేవి, శ్రీవెంకటేశ్వర, వెంకటేశ్వర, శ్రీకన్య, సంగం, శరత్, మెలోడి, శరత్, కిన్నెర, కామేశ్వరి, శ్రీరామ, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), శ్రీనరసింహ, నరసింహ, సుకన్య, సౌజన్య, మౌర్య (గోపాలపట్నం), శ్రీకన్య కాంప్లెక్స్, మోహిని, లక్ష్మి (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-1,2 (పెందుర్తి), శ్రీరాములమ్మ, గణేష్, తాతా (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 52, టమాటా 47, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 34, బెండకాయలు 18, పచ్చిమిర్చి 26, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 30, క్యాబేజి 30, క్యారెట్ 60 దొండకాయలు 32, బంగాళ దుంపలు 37, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 90, అల్లం (పాతది)50, బరబాటి 32, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 28 దోస కాయలు 26, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 60, పొటల్స్ 50, కీర దోస 28,కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు44, చిలగడదుంపలు 34, కంద 58,దేముడు చిక్కుడు 54, కొండఉసిరి 50, కరివేపాకు (కిలో) 55, కొత్తిమీర (పెద్ద కట్ట) 35, పుదీన (కట్ట) 5, చుక్కకూర 4, పాల కూర 4, తోటకూర 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 64, బొప్పాయి 40, జామకాయలు (కిలో) 45.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	610
విజయనగరం	614
శ్రీకాకుళం	614

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	92
ఫారం ధర	112
విత్ స్కిన్	194
స్కిన్‌లెస్	204



మల్కాపురం : సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు



కంచరపాలెం : దయానందనగర్ కాలనీలో గెడ్డను పరిశీలిస్తున్న గణబాబు

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు

» ఇబ్బందులను ధైర్యంతో ఎదుర్కోవాలి
» ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ ఆస్పత్రి అడ్మిన్ బిల్డింగ్ సమావేశ మందిరంలో పారిశ్రామిక ప్రాంత విలేఖర్ల సంఘం, సెయింట్ ఆన్స్ ఆస్పత్రి పరిపాలన విభాగం, సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'ఆత్మహత్య మహాపాపం' అన్న అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జీవితం పట్ల అనురాగంతో ఉండాలని, ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని సూచించారు. పారిశ్రామిక ప్రాంతం విలేకరులు తలపెట్టిన ఇటువంటి కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలను సునాయసంగా నివారించవచ్చునని తెలిపారు. ఆత్మహత్యల నివారణకు పాఠశాలలు, కళాశాలల్లో సదస్సుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పారిశ్రామిక ప్రాంతం విలేకరుల సంఘం అధ్యక్షుడు ఎంవీ గిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ భుజంగరావు, మల్కాపురం సీఐ విద్యసాగర్, సెయింట్ ఆన్స్ పరిపాలన అధికారి సిస్టర్ బెస్సీ, మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్ఎం అరుణకుమారి, ఎన్ఎస్ఎస్ జిల్లా అధికారి ప్రతినిధి ఈపీఎస్ బాగ్యలక్ష్మి, షిప్ యార్డు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు పాల్గొన్నారు.

56వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు దయానందనగర్, చాకలిగెడ్డ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గణబాబు పర్యటించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దయానందనగర్‌లో ప్రధాన గెడ్డలో పూడిక పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు తెలియజేయగా వెంటనే పూడికలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజశేఖర్, జడ్సీ రాము, ఈఈ ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మడిపాలెంలో ప్రజా దర్బార్

జీవీఎంసీ 57వ వార్డు తుమ్మడిపాలెంలో ఎమ్మెల్యే గణబాబు బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. ఎక్కువగా పింఛన్లు, ఇంటి పన్ను సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, కుట్టా కార్తీక్, శరగడం రాజశేఖర్ పాల్గొన్నారు.



రెండు రోజుల క్రితం పడిన వర్షాలకు బురదమయమైన రోడ్డు

కాలనీకి వెళ్లే దారేది?

పెందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వాలిమెరక జుత్తాడలోని జగనన్న కాలనీకి వెళ్లే దారి లేక స్థానికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ పాలనలో వాలిమెరక గ్రామానికి చెందిన 200 మందికి, పెదగాడి గ్రామానికి చెందిన 127 మందికి ఇళ్లు కేటాయించారు. అయితే కాలనీకి వెళ్లే రోడ్డు పనులు పూర్తి చేయలేదు. 2020లో జిల్లాలోనే జుత్తాడను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి జగనన్న కాలనీని అట్టహాసంగా ప్రారంభించి స్థలాలను లబ్ధిదారులకు కేటాయించారు. కాలనీకి సుమారు 2 కిలోమీటర్ల దూరం నుంచి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ తొలుత సిద్ధపడ్డారు. అనంతరం బిల్లులు రావని తెలిసి పనులను పూర్తి చేయకుండా వెనుదిరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన నివాసితులు చిత్తడి మార్గంలో రాకపోకలు చేయడానికి అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం స్థానికులు రోడ్డుపై గ్రావెల్, రాళ్లు వేసి రాకపోకలు కొనసాగిస్తున్నారు.

అప్పన్నను దర్శించుకున్న బీసీసీఐ సభ్యుడు

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామిని భారత క్రికెట్ టీమ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు అజేయ్‌రాత్రా బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. కప్పస్తంభ ఆలింగనం చేసుకున్న అతని గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు పూజలు చేశారు. గోదాదేవి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు వేదాశీర్వచనాలు, అధికారులు స్వామి వారి ప్రసాదాలు అందజేశారు.

కప్పస్తంభ ఆదాయం రూ.7.9లక్షలు

కప్పస్తంభం ఆలింగనాల ద్వారా గత నెలలో రూ. 7.9 లక్షల ఆదాయం సమకూరింది. 31,788 మంది భక్తులు రూ.25 టికెట్ చెల్లించి కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకోగా రూ.7,94,700 ఆదాయం వచ్చింది.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తం

ఉక్కుటౌన్ షిప్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరస్థుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇటీవల మహిళ వాయిస్‌తో కాల్స్ వస్తున్నాయి. నమస్కారం సార్....నేను మీ బ్యాంక్ మేనేజర్‌ను...బాగున్నారా...అంటూ తియ్యని పలకరింపు. తరువాత మాటలు కలిపి మీ ఏటీఎం కార్డు కాలపరిమితి ముగిసిందని, మీ కార్డు, పిన్ నంబరు చెబితే కొత్త కార్డు అడ్రస్‌కు పంపుతామంటూ బురిడీ కొట్టిస్తోంది. ఆమె మాటలకు లోబడి వివరాలు చెప్పిన అనేక మంది ఖాతాల్లో నగదు మాయమైంది. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీస్ స్టేషన్‌కు పరుగు తీస్తున్నారు. ఇటీవల మరో కొత్త తరహా మోసం కూడా వెలుగుచూసింది. ఆధార్ కార్డు కాలపరిమితి ముగిసిందని, బ్యాంకు ఖాతాకు లింక్ చేయాలని ఫోన్ చేసి వివరాలు అడుగుతున్నారు. కొంతమంది అప్రమత్తంగా ఉంటున్నారు. మరికొందరు నిజమేనని వివరాలు చెబుతున్నారు. ఇలా వివరాలు ఇచ్చిన వారి బ్యాంకు ఖాతా ఖాళీ అయిపోతోంది. ఖాతాదారుడు ఏమాత్రం ఏమరుపాటుగా ఉండరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. నెమ్మదిగా మాట్లాడితే ఏదో విధంగా వివరాలు రాబట్టేందుకు ప్రయత్నిస్తారని చెబుతున్నారు.



గేటు వద్ద నిరసన తెలుపుతున్న ట్రేడ్ యూనియన్ నాయకులు

ఉద్యోగులపై సస్పెన్షన్‌ను ఎత్తి వేయాలి

ఎన్ఏడీ గేటు వద్ద ట్రేడ్ యూనియన్ నాయకుల నిరసన

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఎన్ఏడీలో 36 మంది ఉద్యోగులపై అన్యాయంగా విధించిన సస్పెన్షన్‌ను తక్షణమే ఎత్తివేయాలని కమాండ్ ట్రేడ్ యూనియన్ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం వారు ఎన్ఏడీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఐఎన్‌సీఈ పూర్వ ప్రధాన కార్యదర్శి, జేసీఎం సభ్యుడు టీఎన్ ప్రకాశ్ రావు మాట్లాడుతూ ఎన్ఏడీ యాజమాన్యం కార్మికులను సస్పెండ్ చేసిన విధానం సరికాదన్నారు. కార్మికులపై పెట్టిన కేసులు, సస్పెన్షన్‌ను ఎత్తి వేయకపోతే కార్మిక సంఘాలన్నీ కలిసి పోరాటం చేస్తాయన్నారు. ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి సాలాపు మారయ్య మాట్లాడుతూ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించమని అడిగినందుకు కేసులు బనాయించడం సరికాదన్నారు. ఒకేసారి 36 మంది ఉద్యోగులను సస్పెండ్ చేయడం దారుణమని చెప్పారు. ఇప్పటికైనా యాజమాన్యం తన వైఖరిని మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, కార్మిక సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విక్టమైజేషన్ వారోత్సవాలు



ధర్నా చేస్తున్న ఎన్ఏడీసీఈ యూనియన్ నాయకులు

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విశాఖ రక్షణ రంగంలో జరుగుతున్న యాజమాన్య నిరంకుశ విధానాలను నిరసిస్తూ శుక్రవారం నుంచి 12వ తేదీ వరకు విక్టమైజేషన్ వారోత్సవాలు నిర్వహించాలని డిఫెన్స్ కోర్ నేషనల్ కమిటీ నిర్ణయించిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ తెలిపారు. ఎన్ఏడీ గేటు వద్ద సివిల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజీఎం చర్చలకు పిలిచి 36 మంది కార్మికులను సస్పెండ్ చేయడం దేశ చరిత్రలో ఎక్కడా జరగలేదన్నారు. అధికారం ఉందని కార్మికులపై అన్యాయంగా కేసులు పెడితే కార్మిక సంఘాలు చూస్తూ ఊరుకోవన్నారు.వారోత్సవాల్లో భాగంగా గ్రూపు సమావేశాలు, గేట్లు దగ్గర నిరసన, ప్లకార్డులు ప్రదర్శన తదితర కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఏడీ సీఈ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, అధ్యక్షుడు నూకరాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కమనీయం...అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

ఉక్కు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించాలి



ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రధాన పరిపాలన ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కుంటుపడ్డాయన్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలని, క్యాంటీన్‌లు మెరుగుపర్చాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తమ పద్ధతి మార్చుకోలేదని, పార్లమెంట్ సాక్షిగా ప్రైవేటీకరణపై ప్రకటనలు చేస్తే తెలుగు రాష్ట్రాల ఎంపీలు ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థికసహాయం ప్రకటించామని చెప్పడం తప్ప ఇందులో ఒక్క రూపాయి కూడా ప్లాంట్ వినియోగించలేదన్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వైటీ దాసు, యు.రామస్వామి, కె.గంగాధర్, కృష్ణమూర్తి, మరిడయ్య, బి.అప్పారావు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంటులో ఉద్యోగుల సంఖ్య పెంచాలి'

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 4 : (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్య పెంచాలని, ప్రతి నెలా ఎక్కువ సంఖ్యలో పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల సంఖ్య పెరిగిపోతోందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు యాజమాన్యాన్ని కోరారు. ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండటం వలన ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై పని భారం పడిపోతోందన్నారు. కార్మికుల కొరత ప్రభావం ఉక్కు ఉత్పత్తిపై పడుతుందన్నారు. యాజమాన్యం తక్షణమే పరీక్షలు నిర్వహించి నియామకాలు చేపట్టాలని కోరారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శివశంకరరెడ్డి తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి అన్నారు. ఫ్యాక్టరీస్ విభాగం, సొసైటీ ఫర్ అక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ ఆధ్వర్యంలో 'రసాయన పరిశ్రమల్లో భద్రత, అత్యవసర నిర్వహణ' అనే అంశంపై స్టీల్‌ప్లాంట్ ఎల్ అండ్ డీసీలో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ రీజియన్‌లో దాదాపు 165 కెమికల్ ప్లాంట్లు ఉన్నాయని, వీటిలో రెండు ఫ్యాక్టరీల్లో పెద్ద ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రమాదాల నివారణకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఫార్మాజెల్ ఎండీ అనంత్ బర్వడికర్, స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి, లారస్ ల్యాబ్స్ ఏవీపీ శ్రీనివాసరావు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటక్ జాతీయ అధ్యక్షుడి దృష్టికి స్టీల్‌ప్లాంటు ఉద్యోగుల సమస్యలు



జాతీయ అధ్యక్షుడిని కలిసిన స్టీల్‌ప్లాంట్ ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ఇంటక్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి దృష్టికి స్టీల్‌ప్లాంట్ ఇంటక్ నాయకులు తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో బుధవారం ఇంటక్ నాయకులు సంజీవరెడ్డిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఉద్యోగులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదని, కాంట్రాక్టు కార్మికులకు ఆరు నెలల నుంచి జీతాలు బకాయి ఉందని, ప్లాంట్ నిర్వహణ బాగోలేదని, ముఖ్యంగా జీతాలు ఇవ్వకపోవటంతో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ఫీజులు చెల్లించలేకపోతున్నామని, బ్యాంకుల డిఫాల్టర్‌లుగా మారుతున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సంజీవరెడ్డిని కలిసిన వారిలో స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు, తదితరులు ఉన్నారు.

చంద్రబాబు మళ్లీ సీఎం అవుతారని ఆనాడే చెప్పా : కార్పొరేటర్ గోవిందరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలన మరో పదేళ్లు పాటు అవసరమని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి అన్నారు. తుంగ్లాంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అక్రమ కేసులతో చంద్రబాబును అరెస్టు చేయడాన్ని ఖండించిన తాను అప్పుడే ఆయన మళ్లీ సీఎం అయితే భద్రాచలం పాదయాత్రగా వస్తానని మొక్కుకున్నానని తెలిపారు. గత నెల 20న తుంగ్లాం నుంచి పాదయాత్ర ప్రారంభించి 12 రోజుల్లో 380 కిలోమీటర్లు నడచి ఈనెల 1న భద్రాచలం చేరుకొని మొక్కు తీర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు నావన సింహచలం, జి.మధులత, కోన హరి, సంద్రాన వరహాలరాజు, జి.దేముడు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వర్ల సారె సంబరం

ఆటోనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 70వ వార్డు టీపీఎన్ కాలనీలో నిర్వహిస్తున్న శ్రీగౌరీ పరమేశ్వర్లు ఉత్సవ సారె సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు కేవీఎస్ శంకరరావు, పాల రమణ మాట్లాడుతూ ఆ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. అమ్మవారి సారె ముందు మహిళలు కోలాటాలు నిర్వహించారు. భక్తిగీతాలను ఆలపించారు. భారీ మందుగుండు సామగ్రితో అమ్మ వారి సారెను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు టీఎన్‌టీయూసీ నాయకులు పీఎంఎల్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ ఉత్సవాలను నెల రోజులు పాటు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వేగి పాపారావు, వెలగ శ్రీను, నూకరాజు, ఆడారి రామకృష్ణ, చంద్రరావు, రాజు, రాము, గోవింద్, శివ, సత్యనారాయణ, ఎర్రినాయుడు, జ్యోతి, ఉమ, కనకశ్వరి, వరలక్ష్మి, గౌరీ సేవా సంఘం సభ్యులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీగౌరీ పరమేశ్వరుల సారెఉత్సవంలో పాల్గొన్న భక్తులు

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

గాజువాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గాజువాక మండలంలో ఈనెల 6 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ శ్రీవల్లి తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గాజువాక మండలానికి సంబంధించి 18 రెవెన్యూ వార్డుల్లో ఆయా ప్రాంతాల్లో గల సచివాలయంలో సదస్సులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈనెల 6న అక్కిరెడ్డిపాలెం, 7న అగనంపూడి, 10న కణితి, 11న కూర్మన్నపాలెం, 13 కొండయ్యవలస, 17న గాజువాక, 18న చినగంట్యాడ, 20న జగ్గరాజుపేట, 21న శనివాడ, 24న తలారివానిపాలెం, 26న తుంగ్లాం, 27న దువ్వాడ, 28న పకీరుతక్యా, 31న మింది, వచ్చే నెల 3న వడ్లపూడి, 4న వెంకటపతిరాజుపేట, 7న యారాడ, 8న డాల్ఫిన్ నోస్ ప్రాంతాల్లో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆక్రమణల తొలగింపు

పెందుర్తి రూరల్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని చింతల అగ్రహారం బస్ స్టాండ్ కూడలిలో ఉన్న ఆక్రమణలను అధికారులు బుధవారం తొలగించారు. ఇక్కడి బస్ స్టాండ్ కూడలిలో పీఏసీఎస్‌కు చెందిన 40 సెంట్ల స్థలం ఉంది. దీని విలువ సుమారు రూ. 2 కోట్లకు పైమాటే. ఇంతటి విలువైన స్థలం పరిరక్షణకు పీఏసీఎస్ అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టలేదు. కనీసం చుట్టూ కంచె కూడా ఏర్పాటు చేయలేదు. ఖాళీగా ఉన్న ఈ స్థలాన్ని ఇప్పటివరకు ఆర్టీసీ అధికారులు బస్ స్టాండ్‌గా వినియోగించే వారు.బస్సులు రద్దయిన తర్వాత ఆటో డ్రైవర్లు ఆటోలు నిలపడానికి వినియోగిస్తున్నారు. వీరితో పాటు కొంతమంది చిల్లర వ్యాపారులు కూడా స్థలాన్ని ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేశారు. వీటిలో కొంతమంది బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి, మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వ్యాపారుల మధ్య గొడవలు జరిగి పోలీసుల దృష్టికి వెళ్లడంతో స్థానిక నాయకులు జోక్యం చేసుకుని సొసైటీ స్థలంలో ఉన్న ఆక్రమణలు తొలగించే చర్యలు చేపట్టారు. దుకాణాలతో పాటు మందుబాబులు, చిల్లర ఆటగాళ్లు కూర్చోవడానికి నిర్మించిన సిమెంట్ దిమ్మలు, బల్లలను కూడా తొలగించారు. సొసైటీ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి స్థల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గోతులు పూడ్చక ఇబ్బందులు



రోడ్డుపై చదును చేయకుండా ఉన్న మట్టి

మల్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గాజువాక ఆర్టీసీ డిపో నుంచి అచ్చినాయుడు తోటలో నిర్మిస్తున్న టిడ్కో ఇళ్లకు తాగునీటి సరఫరా నిమిత్తం పైపులైన్ ఏర్పాటుకు అధికారులు గోతులు తవ్వారు. పైప్‌లైన్ ఏర్పాటు తరువాత గోతులను సక్రమంగా పూడ్చకపోవడంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు రోడ్డు మార్గం బాగా నానిపోయింది. ఈ మార్గం మీదుగా వెళ్లేటప్పుడు వాహనాలు మట్టిలోకి కురుకుపోతున్నాయి. దీనికితోడు ఇక్కడ విద్యుత్ లైట్లు కూడా లేవు. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు తక్షణమే స్పందించి గోతుల పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు రేపు

వేపగుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలో శుక్రవారం స్వామివారి జన్మ నక్షత్రం శ్రవణం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు అర్చకుడు శేషాద్రి శర్మ తెలిపారు. బుధ వారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, స్వర్ణ పుష్పాలతో అర్చన, పంచామృతాభిషేకాలు, మధ్యాహ్నం అన్నసంతర్పణ, సాయం త్రం సామూహిక విష్ణు సమస్రనామ పారాయణం నిర్వహిస్తామని చెప్పారు.

IN THE HON'BLE COURT OF THE ADDL. FAMILY JUDGE AT: VISAKHAPATNAM
F.C.O.P. 997/2024

Between:
Smt. Pyla Sri Suma ...Petitioner
And
Moturu Appala Raju ...Respondent

NOTICE

To, **The Respondent:**
Moturu Appala Raju,
S/o. Suryanarayana, R/at
D.No.11-9-11, Simhagiri Colony,
Gajuwaka, Visakhapatnam-530026.

Please take notice that the above Original Petition is filed by the petitioner for Divorce and for other reliefs from you and the same is posted to **20-12-2024** for your appearance on which date, you are required to appear before the above Hon'ble Court either in person or through your Advocate at **10:30 A.M.**, failing which you will be set exparte and the matter will be decided in your absence on merits.

(By Order of the Hon'ble Court)
NAMMI SRINIVAS & PRADEEP. P
Advocates
Near District Court, Visakhapatnam.

ఘనంగా గౌరీపరమేశ్వరుల సారె సంబరం

ఆటోనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 70వ వార్డు టీవీఎస్ కాలనీలో నిర్వహిస్తున్న శ్రీగౌరీ పరమేశ్వర్ల ఉత్సవ సారె సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. అమ్మవారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు కేవీఎస్ శంకరరావు, పాల రమణ మాట్లాడుతూ ఆ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. అమ్మవారి సారె ముందు మహిళలు కోలాటాలు నిర్వహించారు. భక్తిగీతాలను ఆలపించారు. భారీ మందుగుండు సామగ్రితో అమ్మ వారి సారెను పురవీధుల్లో ఘనంగా ఊరేగించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు టీఎన్‌టీయూసీ నాయకులు పీఎంఎల్ నాయుడు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఈ ఉత్సవాలను నెల రోజులు పాటు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో వేగి పాపారావు, వెలగ శ్రీను, నూకరాజు, ఆడారి రామకృష్ణ, చంద్రరావు, రాజు, రాము, గోవింద్, శివ, సత్యనారాయణ, ఎర్రినాయుడు, జ్యోతి, ఉమ, కనకశ్వరి, వరలక్ష్మి, గౌరీ సేవా సంఘం సభ్యులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.



శ్రీగౌరీ పరమేశ్వరుల సారె ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

ఇంటక్ జాతీయ అధ్యక్షుడి దృష్టికి సమస్యలు



జాతీయ అధ్యక్షుడిని కలిసిన స్టీల్‌ప్లాంట్ ఇంటక్ నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ప్రస్తుతం నెలకొన్న సమస్యలను ఇంటక్ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి దృష్టికి స్టీల్‌ప్లాంట్ ఇంటక్ నాయకులు తీసుకెళ్లారు. హైదరాబాద్‌లో బుధవారం ఇంటక్ నాయకులు సంజీవరెడ్డిని కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఉద్యోగులకు జీతాలు సరిగా ఇవ్వడం లేదని, కాంట్రాక్టు కార్మికులకు ఆరు నెలల నుంచి జీతాలు బకాయి ఉందని, ప్లాంట్ నిర్వహణ బాగోలేదని, ముఖ్యంగా జీతాలు ఇవ్వకపోవటంతో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలకు ఫీజులు చెల్లించలేకపోతున్నామని, బ్యాంకుల డిఫాల్టర్‌లుగా మారుతున్నామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సంజీవరెడ్డిని కలిసి వారిలో స్టీల్ ఇంటక్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు, నాయకులు, తదితరులు ఉన్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు

» ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శివశంకరరెడ్డి తదితరులు

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) :పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నామని ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకరరెడ్డి అన్నారు. ఫ్యాక్టరీస్ విభాగం, సొసైటీ ఫర్ అక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ ఆధ్వర్యంలో 'రసాయన పరిశ్రమల్లో భద్రత, అత్యవసర నిర్వహణ' అనే అంశంపై స్టీల్‌ప్లాంట్ ఎల్ అండ్ డీసీలో నిర్వహించిన రెండు రోజుల వర్క్‌షాప్ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ రీజియన్‌లో దాదాపు 165 కెమికల్ ప్లాంట్లు ఉన్నాయని, వీటిలో రెండు ఫ్యాక్టరీల్లో పెద్ద ప్రమాదాలు జరిగాయన్నారు. ప్రమాదాల నివారణకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఫార్మాజెల్ ఎండీ అనంత్ బర్వడికర్, స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) రంజన్ మహంతి, లారస్ ల్యాబ్స్ ఏవీపీ శ్రీనివాసరావు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబు మళ్లీ సీఎం అవుతారని ఆనాడే చెప్పా : గోవిందరెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలన మరో పదేళ్లు పాటు అవసరమని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి అన్నారు. తుంగ్లాంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అక్రమ కేసులతో చంద్రబాబును అరెస్టు చేయడాన్ని ఖండించిన తాను అప్పుడే ఆయన మళ్లీ సీఎం అయితే భద్రాచలం పాదయాత్రగా వస్తానని మొక్కుకున్నానని తెలిపారు. గత నెల 20న తుంగ్లాం నుంచి పాదయాత్ర ప్రారంభించి 12 రోజుల్లో 380 కిలోమీటర్లు నడచి ఈనెల 1న భద్రాచలం చేరుకొని మొక్కు తీర్చుకోవడం ఆనందంగా ఉందన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు నావన సింహచలం, జి.మధులత, కోన హరి, నంద్రాన వరహాలరాజు, జి.దేముడు, నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్య పెంచాలి'

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 4 : (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగుల సంఖ్య పెంచాలని, ప్రతి నెలా ఎక్కువ సంఖ్యలో పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగుల సంఖ్య పెరిగిపోతోందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోగంటి లెనిన్‌బాబు యాజమాన్యాన్ని కోరారు. ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండటం వలన ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులపై పని భారం పడిపోతోందన్నారు. కార్మికుల కొరత ప్రభావం ఉక్కు ఉత్పత్తిపై పడుతుందన్నారు. యాజమాన్యం తక్షణమే పరీక్షలు నిర్వహించి నియామకాలు చేపట్టాలని కోరారు.



మల్కాపురం : సదస్సులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు



కంచరపాలెం : దయానందనగర్ కాలనీలో గెడ్డను పరిశీలిస్తున్న గణబాబు

సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు

» ఇబ్బందులను ధైర్యంతో ఎదుర్కోవాలి
» ప్రభుత్వ విప్, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

మల్కాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు ఎదురైనప్పుడు ధైర్యంగా ఎదుర్కోవాలి తప్ప ఆత్మహత్యలకు పాల్పడడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ ఆస్పత్రి అడ్మిన్ బిల్డింగ్ సమావేశ మందిరంలో పారిశ్రామిక ప్రాంత విలేఖర్ల సంఘం, సెయింట్ ఆన్స్ ఆస్పత్రి పరిపాలన విభాగం, సెయింట్ ఆన్స్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో 'ఆత్మ హత్య మహాపాపం' అన్న అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జీవితం పట్ల అనురాగంతో ఉండాలని, ఆత్మవిశ్వాసం పెంచుకోవాలని సూచించారు. పారిశ్రామిక ప్రాంతం విలేకరులు తలపెట్టిన ఇటువంటి కార్యక్రమాన్ని ఎక్కడికక్కడ ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలను సునాయసంగా నివారించవచ్చునని తెలిపారు. ఆత్మహత్యల నివారణకు పాఠశాలలు, కళాశాలల్లో సదస్సుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. పారిశ్రామిక ప్రాంతం విలేకరుల సంఘం అధ్యక్షుడు ఎంవీ గిరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ భుజంగరావు, మల్కాపురం సీఐ విద్యసాగర్, సెయింట్ ఆన్స్ పరిపాలన అధికారి సిస్టర్ జెస్సీ మల్కాపురం జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అరుణకుమారి, ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా అధికారి ప్రతినిధి ఈ పీఎస్ బాగ్యలక్ష్మి, షిప్ యార్డు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి సుంకర చలపతిరావు పాల్గొన్నారు.

56వ వార్డులో ఎమ్మెల్యే పర్యటన

కంచరపాలెం : జీవీఎంసీ 56వ వార్డు దయానందనగర్, చాకలిగెడ్డ ప్రాంతాల్లో ఎమ్మెల్యే గణబాబు పర్యటించి, స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దయానందనగర్‌లో ప్రధాన గెడ్డలో పూడిక పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు తెలియజేయగా వెంటనే పూడికలు తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాజశేఖర్, జడ్డీ రాము, ఈతి ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

తుమ్మడిపాలెంలో ప్రజా దర్బార్

జీవీఎంసీ 57వ వార్డు తుమ్మడిపాలెంలో ఎమ్మెల్యే గణబాబు బుధవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల నుంచి వినతులు స్వీకరించారు. ఎక్కువగా పించన్లు, ఇంటి పన్ను సమస్యలపై ప్రజలు అర్జీలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు పెంటకోట అజయ్‌బాబు, కుట్టా కార్తీక్, శరగడం రాజశేఖర్ పాల్గొన్నారు.

6 నుంచి రెవెన్యూ సదస్సులు

గాజువాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాజువాక మండలంలో ఈ నెల 6 నుంచి వచ్చే నెల 8వ తేది వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ శ్రీవల్లి ఒక ప్రకటనలో తెలిపారు. గాజువాక మండలానికి సంబంధించి 18 రెవెన్యూ వార్డుల్లో ఆయా ప్రాంతాల్లో గల సచివాలయంలో సదస్సులు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 6న అక్కిరెడ్డిపాలెం, 7న అగనంపూడి, 10న కణితి, 11న కూర్మన్నపాలెం, 13 కొండయ్యవలస, 17న గాజువాక, 18న చినగంట్యాడ, 20న జగ్గరాజు పేట, 21న శనివాడ, 24న తలారివానిపాలెం, 26న తుంగ్లాం, 27న దువ్వాడ, 28న పకీరుతక్యా, 31న మింది, వచ్చేనెల 3న వడ్లపూడి, 4న వెంకటపతిరాజుపేట, 7న యారాడ, 8న డాల్ఫిన్ నోస్ ప్రాంతాల్లో నిర్వహించనున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని తహసీల్దార్ కోరారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఉక్కుటౌన్ షిప్, డిసెంబరు 4 (ఆంధ్ర జ్యోతి) : సైబర్ నేరస్తుల పట్ల ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు. ఇటీవల మహిళ వాయిస్‌తో కాల్స్ వస్తున్నాయి. తియ్యని పలకరింపు. తరువాత మాటలు కలిపి ఏటీఎం కార్డు కాలపరిమితి ముగిసిందని, కార్డు, పిన్ నంబరు చెబితే కొత్త కార్డు పంపుతామంటూ బురిడీ కొట్టిస్తోంది. ఆమె మాటలకు లోబడి వివరాలు చెప్పిన అనేక మంది ఖాతాల్లో నగదు మాయమైంది. దీంతో బాధితులు పోలీస్ స్టేషన్‌కు పరుగు తీస్తున్నారు. ఇటీవల మరో కొత్త తరహా మోసం కూడా వెలుగుచూసింది. ఆధార్ కార్డు కాల పరిమితి ముగిసిందని, బ్యాంకు ఖాతాకు లింక్ చేయాలని ఫోన్ చేసి వివరాలు అడుగుతున్నారు. కొంత మంది నిజమేనని వివరాలు చెబుతున్నారు. ఇలా వివరాలు ఇచ్చిన వారి బ్యాంకు ఖాతా ఖాళీ అయిపోతోంది. ఖాతాదారుడు ఏమరుపాటుగా ఉండరాదని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

రేపటి నుంచి విక్టమైజేషన్ వారోత్సవాలు

ఎన్ఏడీ జంక్షన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విశాఖ రక్షణ రంగంలో జరుగుతున్న యాజమాన్య నిరంకుశ విధానాలను నిరసిస్తూ శుక్రవారం నుంచి 12 వరకు విక్టమైజేషన్ వారోత్సవాలు నిర్వహించాలని డిఫెన్స్ కోర్ నేషనల్ కమిటీ నిర్ణయించిందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్ తెలిపారు. ఎన్ఏడీ గేటు వద్ద సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ధర్నా నిర్వహించారు.

ఉక్కు ఉద్యోగులకు జీతాలివ్వాలి



ధర్నాలో మాట్లాడుతున్న జె.అయోధ్యరాం

ఉక్కుటౌన్‌షిప్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉక్కు ఉద్యోగులకు తక్షణమే వేతనాలు చెల్లించేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ప్రధాన పరిపాలన ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు అన్ని సౌకర్యాలు కుంటుపడ్డాయన్నారు. ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలని, క్యాంటీన్‌లు మెరుగుపర్చాలన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తమ పద్ధతి మార్చుకోలేదని, పార్లమెంట్ సాక్షిగా ప్రైవేటీకరణపై ప్రకటనలు చేస్తే తెలుగు రాష్ట్రాల ఎంపీలు ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థికసహాయం ప్రకటించామని చెప్పడం తప్ప ఇందులో ఒక్క రూపాయి కూడా ప్లాంట్ వినియోగించలేదన్నారు. ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసే చర్యలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వైటీ దాసు, యు.రామస్వామి, కె.గంగాధర్, కృష్ణమూర్తి, మరిడయ్య, బి.అప్పారావు పాల్గొన్నారు.

కమనీయం...అప్పన్న నిత్య కల్యాణం

సింహాచలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆర్జిత నిత్య కల్యాణం బుధవారం కమనీయంగా సాగింది. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలతో అలంకరించి, ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం పాంచరాత్రాగమశాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు. భక్తులకు వేదాశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు.

భూములకు రక్ష, బాధ్యులకు శిక్ష

... 5వ పేజీ తరువాయి

ప్లాట్లను కేటాయించారు. అలాగే ఎంవీపీ కాలనీలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన భూమిని వుడా అధికారులు అడ్డగోలుగా కొందరికి అతి తక్కువ ధరకు కేటాయించారు. అందులో అపార్ట్‌మెంట్ నిర్మాణం చేపట్టారు. మరో కేసులో బీచ్‌రోడ్డులోని పాండురంగాపురం ఏరియాలో 450 గజాల స్థలాన్ని అతి తక్కువ ధరకు కేటాయించారు. ఇలా అనేక అవకతవకలు జరగడంతో వాటిని 'ఆంధ్రజ్యోతి' 'విశాఖలో భారీ భూ కుంభకోణం', 'అంతా అడ్డగోలే', వరప్రసాదం తదితర శీర్షికలతో వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ కుంభకోణం వల్ల వుడాకు రూ.539.49 కోట్ల నష్టం వాటిల్లిందని ప్రభుత్వానికి నాటి వీసీ నివేదిక ఇచ్చారు. వీటిపై లోకాయుక్త సుమోటోగా కేసు నమోదుచేసి విచారణ చేపట్టింది. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సీఐడీ, విజిలెన్స్, ఏసీబీలతో విచారణ చేయించింది. తప్పులన్నీ నిర్ధారణ అయ్యాయి. అధికారులు, ఉద్యోగుల భాగస్వామ్యం ఉందని తేలింది. అప్పుడు వుడాకు వైస్ ఛైర్మన్‌గా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి ఎన్.విష్ణు తప్పు చేశారని నిర్ధారణ కావడం, ఆయన రాష్ట్ర విభజనలో తెలంగాణాకు వెళ్లడంతో చర్యలు తీసుకోవాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆ తరువాత వుడా వీసీగా చేసిన ఇంకో ఐఏఎస్ అధికారి బి.శ్రీధర్ కూడా నిబంధనలు ఉల్లంఘించారని తేల్చారు. అయితే ఆయనపై చర్యలను రాష్ట్ర ప్రభుత్వం 2018లోనే ఉపసంహరించుకుంది. ఇక వుడాలో దీనికి ప్రధాన కారణమైన అప్పటి ఎస్టేట్ అధికారి ఎ.జగదీశ్, పరిపాలన అధికారి కె.కరుణకుమార్, మరో ఏఓ వి.చిరంజీవి రాజు, సీనియర్ అసిస్టెంట్ పి.రామకృష్ణ, ఏఓ నరసింహమూర్తి, ఏడీఎం పున్నయ్య, ఏఓ పండునాయుడు, తహసీల్దార్ మనోరంజనిలపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అలాగే ఈ కేసులతో సంబంధం ఉన్న వియ్యపు అప్పలనాయుడు, గెద్దాడ శ్రీనివాసరావు, బి.వరప్రసాద్, ధనలక్ష్మి, హయగ్రీవ జగదీశ్వరుడు, వై.పట్టాభి రామినాయుడు, కరణం రామారావులపై కేసులు నడుస్తున్నాయి.

కేసులు అన్నీ నడుస్తున్నాయి

ల్యాండ్ పూలింగ్ కుంభకోణంలో అనర్హులకు ఇచ్చిన ప్లాట్లను రద్దు చేశాము. వాటి రిజిస్ట్రేషన్లు రద్దు చేశాము. కొందరు రిట్ పిటిషన్లు వేశారు. కొన్ని కేసులకు సంబంధించి పూర్తిస్థాయిలో కౌంటర్లు వేయలేదు. వాటిని కూడా వేయిస్తున్నాము. ఈ కుంభకోణంలో ఒక వ్యక్తికి 11 ప్లాట్లు దక్కాయి.

- విశ్వనాథన్, కమిషనర్, వీఎంఆర్‌డీఏ

ఫీజు రీయింబర్స్‌మెంట్ పీజీకి వర్తించేనా?

... 5వ పేజీ తరువాయి

సుమారు 4,958 సీట్లు ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ నిలిపివేసినప్పటి నుంచి అనేక కాలేజీల్లో సీట్లు సరిగా భర్తీ కావడం లేదు. గతంలో శత శాతం సీట్లు భర్తీ అయిన గ్రూపుల్లో కూడా 20 నుంచి 40 శాతం కాని పరిస్థితి ఏర్పడడంతో ప్రముఖ కాలేజీలు కూడా పీజీ కోర్సుల నిర్వహణ నుంచి తప్పుకున్నాయి. మళ్లీ అమలు చేస్తారన్న ఉద్దేశంతో కొన్ని కాలేజీలు మాత్రం కోర్సులను కొనసాగిస్తూ వస్తున్నాయి.

ఫార్మా ప్రమాదంపై దాగుడుమూతలు

... 5వ పేజీ తరువాయి

నియంత్రణ మండలి అధికారులు వెళ్లారు. వారు స్వతంత్రంగా విచారణ చేయలేదని, భిన్నమైన సమాచారం ఇచ్చారని శాస్త్రవేత్త బాబూరావు ఆరోపిస్తున్నారు. లామివుడీన్ (హెచ్ఐవీ మందు) ఉత్పత్తి మూడో దశలో ఉండగా ప్రమాదం జరిగిందని ఫ్యాక్టరీస్ విభాగం వెల్లడించింది. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు మాత్రం 'పాంటోప్రజోల్' మూడో దశ ఉత్పత్తిలో ఉండగా ప్రమాదం జరిగిందని, క్లోరిన్ వాయువు వెలువడిందని నివేదించింది. ఈ రెండు శాఖల అధికారులకూ కంపెనీ యాజమాన్యమే సమాచారం ఇచ్చింది. కానీ వారు వేర్వేరు కారణాలు వెల్లడించారు.

ఫ్యాక్టరీస్ అధికారులు ఫాస్జీన్ గ్యాస్ వెలువడిందని పేర్కొన్నారు. హైడ్రోక్లోరిక్ యాసిడ్‌లో క్లోరిన్ కలుపుతున్నప్పుడు రియాక్టర్‌లో ఒత్తిడి పెరిగిందని, యాసిడ్ బయటకు రాగా దానిపై సోడా జల్లారని, దాంతో ఫాస్జీన్ వాయువు వచ్చిందని, అది విషపూరితం కావడంతో ప్రమాదం జరిగిందని చెబుతున్నారు.

క్లోరిన్ వాయువు వెలువడిందని కాలుష్య నియంత్రణ మండలి చెబుతోంది. వాస్తవానికి క్లోరిన్ వాసన సులువుగానే గుర్తించవచ్చు. 0.002-3.4 పీపీఎం స్థాయిలోనే వాసన తెలుస్తుంది. క్లోరిన్ వాయువు వస్తున్నప్పుడు దానిని పీలుస్తూ కార్మికులు అక్కడే ఎందుకు ఉంటారు?, ఘాటైన వాసన కాబట్టి దూరంగా వెళతారు. అది కనీస జాగ్రత్త. కానీ, బయటకు వచ్చింది క్లోరిన్ వాయువు అని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు ఎలా నిర్ధారించారో వెల్లడించలేదు.

ఇవీ అనుమానాలు...

- హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రెండూ కలవవు. అంటే రియాక్షన్ ఏమీ ఉండదు. అటువంటిది విషవాయువు ఎలా వచ్చింది?, ఎక్కడి నుంచి వచ్చింది?
- రియాక్టర్‌లో హైడ్రోక్లోరిక్ యాసిడ్, క్లోరోఫామ్ రియాక్టర్‌లో పోసినప్పుడు రియాక్షన్ ఉండదు. అటువంటపుడు ప్రెషర్ (ఒత్తిడి) ఎక్కడి నుంచి వచ్చింది?
- వెంట్ ఎందుకు తెరుచుకుంది?, అందులో నుంచి లిక్విడ్ ఎలా బయటకు వచ్చింది?

...ఇవన్నీ ప్రమాద స్థలిలో పరిశీలించాల్సిన ప్రాథమిక అంశాలు. కానీ రెండు శాఖల అధికారులు యాజమాన్యం చెప్పిన చిలక పలుకులే పలుకుతున్నారు తప్ప సొంతంగా విచారణ చేసి ఏమీ చెప్పడం లేదు. అనుమతి లేకుండా హెచ్ఐవీ మందులు తయారుచేయడం, అనుభవం లేని పనివారితో పనిచేయించడం, తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వంటి అనేక తప్పిదాలు ఉన్నాయి.

తరలింపులో అలసత్వం

ఘటన నవంబరు 26వ తేదీ సాయంత్రం 4.40 గంటలకు జరిగింది. ఆ స్థలంలో ఉన్న కార్మికులు బి-షిఫ్ట్ (మధ్యాహ్నం 2 నుంచి రాత్రి 10గంటలు) ముగిసిన తరువాత యాజమాన్యానికి చెప్పారు. వారిని 27వ తేదీ తెల్లవారుజామున రెండు గంటలకు ఆస్పత్రిలో చేర్చారు. అంటే ఘటన జరిగిన 9 గంటల తరువాత వారిని చికిత్సకు పంపారు. కానీ యాజమాన్యం తక్షణమే పంపించామని చెబుతోంది. విషవాయువును పీల్చిన వెంటనే చికిత్సకు తరలిస్తే ప్రాణాలు దక్కేవి. కానీ 9 గంటలు ఆలస్యం కావడంతో ఇద్దరి ప్రాణాలు పోయాయి. ఇప్పటికి కూడా చనిపోయిన కార్మికులు పీల్చిన వాయువు ఏమిటనేది అధికారులు చెప్పడం లేదు.

జైలులో వరుస ఘటనలపై సీరియస్

... 5వ పేజీ తరువాయి

కేంద్ర కారాగారంలో భద్రత, అధికారుల పనితీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో సూపరింటెండెంట్ ఎస్.కిషోర్‌కుమార్‌ను అనంతపురం జైలు సూపరింటెండెంట్‌గా, అదనపు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎం.వెంకటేశ్వర్లును నెల్లూరు జైలు అదనపు సూపరింటెండెంట్‌గా అటాచ్‌మెంట్ చేశారు. మరోవైపు వరుస ఉదంతాలపై శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. విచారణలో సూపరింటెండెంట్, అదనపు సూపరింటెండెంట్ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడం, సెక్యూరిటీ, గార్డు డ్యూటీలు చేసేవారికి సెక్షన్ మార్చకపోవడం, జైలు భద్రత, ఖైదీల ప్రవర్తనపై పర్యవేక్షణ లోపించడమే కారణంగా తేలింది. దీంతో ఏపీ ప్రిజన్స్ రూల్స్ 1979 ఆఫ్ 3 ప్రకారం వారిద్దరిపై సస్పెన్షన్ వేటు వస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కాలనీకి చేరుకునే దారేదీ?



ఇటీవల కురిసిన వర్షాలకు బురదమయమైన రోడ్డు

పెందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాలిమెరక జుత్తాడలోని జగనన్న కాలనీకి వెళ్లే దారి లేక స్థానికులు అవస్థలు ఎదు ర్కొంటున్నారు. గత వైసీపీ పాలనలో వాలిమెరక గ్రామానికి చెందిన 200 మందికి, పెదగాడి గ్రామానికి చెందిన 127 మందికి ఇళ్లు కేటాయించారు. అయితే కాలనీకి వెళ్లే రోడ్డు పనులు పూర్తి చేయలేదు. 2020లో జిల్లాలోనే జుత్తాడను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి జగనన్న కాలనీని అట్టహాసంగా ప్రారంభించి స్థలాలను లబ్ధిదారులకు కేటాయించారు. కాలనీకి సుమారు 2 కిలోమీటర్ల దూరం నుంచి రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ తొలుత సిద్ధపడ్డారు. అనంతరం బిల్లులు రావని తెలిసి పనులను పూర్తి చేయకుండా వెనుదిరిగినట్టు స్థానికులు చెబుతున్నారు. ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన నివాసితులు చిత్తడి మార్గంలో రాకపోకలు చేయడానికి అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం స్థానికులు రోడ్డుపై గ్రావెల్, రాళ్లు వేసి రాకపోకలు కొనసాగిస్తున్నారు.

గౌ॥ శ్రీ గంధం శ్రీనివాసరావు గార్కి జన్మదిన శుభాకాంక్షలు

22న హైందవ శంఖారావం

గాజువాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గాజువాక లంకా మైదానంలో ఈ నెల 22న హైందవ శంఖారావం సభ నిర్వహించనున్నట్టు బీజేపీ గాజువాక శాఖ కన్వీనర్ కరణం రెడ్డి నరసింగరావు తెలిపారు. హిందూ ధర్మం పరిరక్షణలో భాగంగా సభ నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రజలు కుటుంబ సభ్యులతో సహా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

కూర్మన్నపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 86వ వార్డులోని కూర్మన్నపాలెం స్టీల్‌సిటీ ఆర్టీసీ డిపో ఆవరణలో ఉన్న శ్రీదుర్గాదేవి అమ్మవారి ఆలయ 20 వార్షికోత్సవాలు బుధవారం అత్యంత ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక అలంకరణ చేశారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, పార్టీ కార్యదర్శి బొండా జగన్, 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ ప్రత్యేక పూజలు, అన్న సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ యూనియన్ నాయకులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లా, ఎమ్మెల్సీ వేపాడ

వార్డు అభివృద్ధికి కృషి చేసిన గంధం

» నేడు పుట్టినరోజు వేడుకలు

గాజువాక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం పాటు అంకిత భావంతో ప్రజలకు సేవలందించి, రెండు సార్లు కౌన్సిలర్‌గా, రెండుసార్లు కార్పొరేటర్‌గా విజయం సాధించి, ప్రజల మన్ననలు పొందిన గంధం శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు గురువారం జరగనున్నాయి. ఆది నుంచీ తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతూ 1995లో గాజువాక మునిసిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్‌గా, 2000లో 25వ వార్డు కౌన్సిలర్‌గా, జీవీఎంసీ ఏర్పడిన తరువాత 2007లో 52వ వార్డు కార్పొరేటర్‌గా, 2022లో 76 వార్డు కార్పొరేటర్‌గా విజయం సాధించారు. వార్డులో ప్రధాన సమస్యలను పరిష్కరించి అభిమానం సంపాదించుకున్నారు. సుమారు 29ఏళ్ల పాటు కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా సేవలందిస్తున్నారు. ప్రస్తుతం జీవీఎంసీలో టీడీపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్‌గా గంధం శ్రీనివాసరావు కొనసాగుతున్నారు.





నితీష్ కల నెరవేరింది



కోహ్లీకి అతడు వీరాభిమాని

బ్యాట్ పట్టుకుని గ్రౌండ్‌లోకి వెళుతున్న కుమారుడిని చూసి తండ్రి మురిసిపోతే... ఆటలో పడి చదువును నిర్లక్ష్యం చేస్తాడేమోనని తల్లి ఆందోళన చెందేది. ఈ సందిగ్ధావస్థలో తండ్రి నమ్మకాన్ని నిలబెట్టడంతోపాటు తల్లి భయాన్ని పోగొట్టాలని సంకల్పించుకుని అటు చదువులో రాణిస్తూ, ఇటు క్రికెట్‌లో పరుగుల వరద పారించాడు. అండర్-14 కేటగిరీ నుంచి వివిధ ఏజ్ గ్రూప్‌లలో వరుసగా రాష్ట్ర జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌లో చోటు దక్కించుకుని ఆట తీరుతో టీమిండియా సెలక్టర్ల దృష్టిని ఆకర్షించి, ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌లో స్థానం సంపాదించాడు నగరానికి చెందిన యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి. త్వరలో జరగనున్న ఐపీఎల్ సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు రూ.ఆరు కోట్ల పారితోషకంతో ఎంపికై మరో రికార్డు నెలకొల్పాడు. ఈ సందర్భంగా అతడి తల్లిదండ్రులు మానస, ముత్యాలరెడ్డి తమ ఆనందాన్ని 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

- విశాఖపట్నం స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి

» అతని చేతుల మీదుగా క్యాప్ తీసుకోవడం మధురానుభూతి

» కపిల్‌దేవ్‌తో పోల్చడం గర్వంగా ఉంది

» యువ క్రికెటర్ నితీష్‌కుమార్‌రెడ్డి తల్లిదండ్రుల అంతరంగం

నితీష్‌కు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఆసక్తి. పట్టుదలతో సాధన చేసేవాడు. తొలుత అండర్-16 జట్టుకు ఎంపికై విజయ్ మర్చంట్ ట్రోఫీలో తొలిమ్యాచ్ నాగాలాండ్‌పై 345 బంతుల్లో 441 పరుగులతో సత్తా చాటాడు. టోర్నీలో సగటున 176 పరుగులతో 1,237 పరుగులు చేసి రికార్డు నెలకొల్పాడు. బీసీసీఐ నుంచి అండర్-16 ఉత్తమ క్రికెటర్ అవార్డు అందుకున్నాడు. కోచ్‌లు, నిపుణులు, మేధావులు సలహాతో సీమర్‌గా బౌలింగ్‌పై దృష్టి సారించి ఆల్‌రౌండర్‌గా మలచుకున్నాడు.

ఐపీఎల్‌తో సెలక్టర్ల దృష్టికి..

గతంలో ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ నితీష్‌ను రూ.20 లక్షలకు కొనుగోలు చేసింది. బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. గత ఏడాది అదే జట్టులో చేరి పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 64 పరుగులతో జట్టును ప్లేఆఫ్స్‌కు చేర్చాడు. తర్వాత రాజస్థాన్ రాయల్స్‌పై అజేయ అర్ధసెంచరీ (76) చేసి టీమిండియా సెలక్టర్ల దృష్టిలో పడ్డాడు.

బంగ్లాదేశ్‌తో సిరీస్‌కు పిలుపు

బంగ్లాదేశ్‌తో జరిగిన టీ20 సిరీస్‌కు టీమిండియా నుంచి నితీష్‌కు పిలుపువచ్చింది. ఆస్ట్రేలియాతో జరిగిన టెస్టు సిరీస్‌కు నితీష్ పేరు వినిపించినా చివరివరకూ ఉత్కంఠ మధ్య ఎంపికచేశారు. పెర్త్ టెస్టులో ఆడే అవకాశం రావడం, తొలి ఇన్నింగ్స్‌లో కీలకమైన 41 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 38 నాటౌట్ చేయడం ఆనందాన్నిచ్చింది.

కోహ్లీ చేతుల మీదుగా క్యాప్

నితీష్‌కు టీమిండియా క్యాప్‌ను కోహ్లీ అందించడం గొప్ప గౌరవంగా భావించాం. ఒకప్పుడు అతనితో ఫొటో తీసుకుంటే చాలనుకున్న యువకుడికి...ఇప్పుడు కలిసి బ్యాటింగ్ చేసే అవకాశం వచ్చింది. నితీష్ కూడా ఫోన్ చేసి తన ఆనందాన్ని పంచుకున్నాడు. కల నెరవేరిందన్నాడు. నితీష్‌కుమార్‌ను నాటి గొప్ప ఆల్‌రౌండర్ కపిల్‌దేవ్‌తో పోల్చడం మరింత ఆనందాన్నిచ్చింది.

కోహ్లీతో కలిసి మైదానంలో...

చిన్నప్పటి నుంచి విరాట్ కోహ్లీ, ధోనీ, రోహిత్‌శర్మ వంటిస్టార్ ఆటగాళ్లంటే నితీష్‌కు ఇష్టం. కోహ్లీకి వీరాభిమాని. స్టేట్ ప్లేయర్‌గా ఆడుతున్న సమయంలో ఒకసారి కోహ్లీతో ఫొటో తీసుకునేందుకు యత్నించి విఫలమయ్యాడు. ఇప్పుడు తన అభిమాన క్రికెటర్ విరాట్ కోహ్లీతో నితీష్‌కుమార్ కలిసి ఆడుతుంటే టీవీలో చూసి చాలా సంతోషించాం. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో విరాట్ కోహ్లీ సెంచరీ చేసిన సమయంలో నితీష్‌కుమార్ క్రీజులో ఉండడం, నితీష్‌ని కోహ్లీ కౌగిలించుకోవడం మధురానుభూతిని ఇచ్చింది.

ఐపీఎల్‌లో అత్యధిక ధర

సన్‌రైజర్స్ హైదరాబాద్ నితీష్‌ను వేలానికి పెట్టకుండా రూ.ఆరు కోట్లతో జట్టులో కొనసాగించడం విశేషం. నితీష్‌ను ఆదినుంచీ విశాఖ జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ), ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ప్రోత్సహించాయి. అతడి ప్రతిభను గుర్తించిన ఎంఎస్‌కే ప్రసాద్ కడపలోని అండర్-14 క్రికెట్ అకాడమీకి ఎంపిక చేశారు.


తల్లిదండ్రులతో నితీష్‌కుమార్‌రెడ్డి

నమ్మకాన్ని నిలబెట్టాడు

- ముత్యాలరెడ్డి, నితీష్‌కుమార్‌రెడ్డి తండ్రి

నితీష్‌ను ఉత్తమ క్రికెటర్‌గా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో సర్వీసు ఉండగానే ఉద్యోగాన్ని వదిలేశాను. రోజూ గ్రౌండ్‌కు తీసుకువెళ్లడం, తీసుకురావడమే నా డ్యూటీ. అండర్-16 స్టేట్ టీమ్‌లోకి ప్రవేశించిన తర్వాతే వదిలిపెట్టాను. ఆర్థిక సమస్యలు తలెత్తినా నితీష్ తల్లి మానస ధైర్యంగా కుటుంబాన్ని నడిపించింది. టీమిండియాలో నితీష్ చేరడం, అభిమాన క్రికెటర్లతో క్రీజును పంచుకోవడం టీవీలో చూసినప్పటి నుంచి పడిన కష్టాలను మరిచిపోయాం.

కనకమహాలక్ష్మికి మార్గశిర అభిషేకాలు

» తొలి గురువారం పూజలు ప్రారంభించిన వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఈవో సుజాత


అమ్మవారికి హారతి ఇస్తున్న వీఎంఆర్‌డీ చైర్మన్, ఎమ్మెల్యే, ఈవో, తదితరులు

జగదాంబ కూడలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిర తొలి గురువారం పూజలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, ఈవో సుజాత ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. కాగా భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని భారీ ఏర్పాట్లు చేశారు. టౌన్ కొత్తరోడ్డు నుంచి క్యూలైన్ల ద్వారా వచ్చే భక్తులకు శీఘ్ర దర్శనం కల్పించేలా చర్యలు తీసుకున్నారు. విక్టోరియా ఆస్పత్రి రోడ్డు నుంచి ముఖ్యులు, అతిముఖ్యులు, వృద్ధులు, దివ్యాంగులు, టికెట్ కొన్న భక్తులను అనుమతిస్తారు. దర్శనం ఆలయం వద్ద పోలీస్ ఔట్‌పోస్టు, వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో సహా ప్రాంగణంలో తాగునీటిని అందుబాటులో ఉంచారు. జగదాంబ జంక్షన్ నుంచి అమ్మవారి దర్శనానికి ఏవీఎన్ కాలేజీ, టౌన్ కొత్తరోడ్డు, సూయిజ్ ఫారం వద్ద వాహనాలను నిలిపి భక్తులు కాలినడకన వెళ్లాలి. పాతపోస్టాఫీసు నుంచి వచ్చే ద్విచక్రవాహనాలు లక్ష్మీటాకీస్, ఎంవీడీఎం హైస్కూల్ మీదుగా కురుపాం మార్కెట్ మెయిన్ రోడ్డు వద్ద పార్కింగ్ చేసుకోవాలి. వీఐపీ, రూ.500 టికెట్ కలిగిన భక్తులు బీచ్ రోడ్డు నుంచి టౌన్ హాల్ వద్ద వాహనాలు పార్కింగ్ చేసుకోవాలి. ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలతో ప్రకాశిస్తోంది. జగన్నాథుని ఆలయం వద్ద ఉచిత అన్న ప్రసాదానికి ఏర్పాట్లు చేశారు.


విద్యుత్ దీప కాంతులతో ప్రకాశిస్తున్న కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం

కామత్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

» పరీక్షల కోసం నమూనాల సేకరణ

» ఫిర్యాదు చేసిన 24 గంటల తరువాత చర్యలు


తనిఖీ చేస్తున్న అధికారి

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): లాసన్స్ బే కాలనీలో కామత్ రెస్టారెంట్‌లో ఆహార భద్రత అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఒక వినియోగదారుడు మంగళవారం ఆ రెస్టారెంట్ కౌంజు మాంసం కొనుగోలు చేయగా, అది కుళ్లిపోవడంతో ఆహార భద్రత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వచ్చి పరిశీలించాలని కోరారు. ఆ సమయంలో వీలు కాదని వారు తెలపడంతో సదరు వ్యక్తి కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆ విషయం పత్రికల్లో రావడంతో ఆహార భద్రత అధికారులు తీరుబడిగా బుధవారం రెస్టారెంట్‌కు వెళ్లి అదే కౌంజు కోడి మాంసం నమూనా తీసుకొని పరీక్షలకు పంపించారు. ఫిర్యాదు చేసిన మరుసటి రోజు వెళితే.. అదే మాంసం ఉంచుతారా? అదొక్కటే పరిశీలిస్తారా? మిగిలినవి చూడరా? అనే అనుమానాలు కలుగుతున్నాయి. కామత్ రెస్టారెంట్‌పై అధికారులు ప్రత్యేక అభిమానం చూపుతున్నారని, అందుకే వంట గదిలోకి వెళ్లి పదార్థాలు పరిశీలించలేదని, అక్కడికి వెళితే అసలు రంగు బయటపడుతుందంటున్నారు.

అజెండా తయారీలో మేయర్ ఒంటెత్తుపోకడ

» ఆమె వార్డులోనే భారీగా పనులకు ప్రతిపాదన

» ముందస్తు ఆమోదం ఇవ్వనని చెప్పి ఇప్పుడెలా ఇచ్చారు?

» ప్రశ్నించిన జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాస్

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం నిర్వహణ, అజెండా తయారీలో మేయర్ గొలగాని హరివెంకటకుమారి అంతా తానే అన్నట్టు ఒంటెత్తు పోకడ అవలంభిస్తున్నారని టీడీపీ ఫ్లోర్‌లీడర్ పీలా శ్రీనివాసరావు విమర్శించారు. కౌన్సిల్ సమావేశం నిర్వహించే ముందు అన్నిపార్టీల ఫ్లోర్‌లీడర్లతో మేయర్ మర్యాదపూర్వంగా చర్చించి తేదీని ప్రకటించడం పరిపాటిగా వస్తోందన్నారు. అలాగే కౌన్సిల్ సమావేశానికి సంబంధించి ఏమైనా ప్రతిపాదనలు ఉంటే పంపించాలంటూ కార్పొరేటర్లందరికీ గ్రూపులో వాట్సాప్ మెసేజ్‌చేస్తే వారు కూడా వార్డులో సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ ఆమోదంతో నిధులు కేటాయించుకునేందుకు వీలుంటుందన్నారు. కానీ తాజా సమావేశానికి సంబంధించి మేయర్ తమతో కనీసం మాటమాత్రమైనా చర్చించకుండా కౌన్సిల్ తేదీని ప్రకటించడంతోపాటు అజెండాను కూడా ఖరారు చేసేశారని ఆరోపించారు. జీవీఎంసీ కౌన్సిల్ సమావేశానికి రూపొందించిన అజెండాలో 40 అంశాలు పొందుపరిస్తే అందులో ముడసర్లోవ పార్కులో రూ.ఆరు కోట్లతో గుర్రాలస్వారీ ప్రాజెక్టుకి ఈ ఏడాది జనవరిలో ముందస్తు ఆమోదం ఇచ్చినందున ర్యాటిఫికేషన్ చేయాలంటూ ప్రతిపాదించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. మేయర్ అనేక వివాదాస్పద అంశాలకు ముందస్తు ఆమోదం ఇచ్చేస్తుండడంపై ఏడాది కిందటఅభ్యంతరం వ్యక్తం చేసి, ముందస్తు ఆమోదం ఇచ్చే అధికారం లేదని కూడా స్పష్టం చేశామన్నారు. ఈ నేపథ్యంలో ఇకపై తాను ఎలాంటి పనులకు ముందస్తు ఆమోదం ఇవ్వనని మేయర్ సభాముఖంగా స్పష్టంగా చెప్పారన్నారు. అయినప్పటికీ ముడసర్లోవ పార్కులో గుర్రాల స్వారీ ప్రాజెక్టుకు ఈ ఏడాది జనవరిలోనే తాను ముందస్తు ఆమోదం ఇచ్చానంటూ అజెండాలో పొందుపరచడం మేయర్ పనితీరుకు అద్దంపడుతోందన్నారు. అలాగే తనవార్డులోనే కోట్లాది రూపాయల విలువైన పనులకు ప్రతిపాదనలను అజెండాలో చేర్చిన మేయర్, ఇతర కార్పొరేటర్లకు అవకాశం కల్పించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. జీవీఎంసీ వాహనాలకు టైర్లు, ట్యూబులు కొనుగోలుకి ఏకంగా రూ.92 లక్షలు, కాలువలు, డ్రైనేజీల స్థితిగతుల పర్యవేక్షణను ఒక ఏజెన్సీకి అప్పగించేందుకు ఏడాదికి రూ.93 లక్షలు ఖర్చుకు వీలుగా ప్రతిపాదనలు అజెండాలో చేర్చడం సరికాదని అభిప్రాయపడ్డారు. జీవీఎంసీకి న్యాయ సహకారం అందించేందుకు స్టాండింగ్ కౌన్సిల్సుగా ప్రస్తుతం పనిచేస్తున్నవారిపై ఆరోపణలున్నా వారినే కొనసాగించాలన ప్రతిపాదన దారుణమన్నారు. వీటన్నింటిపైనా మేయర్‌తోపాటు జీవీఎంసీ కమిషనర్‌ను కలిసి అభ్యంతరం తెలియజేస్తానన్నారు.

గోపాలపట్నంలో ఎస్‌ఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభం


షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు


ఆఫర్స్ కార్డ్‌ను ప్రారంభిస్తున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం

గోపాలపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఆర్ షాపింగ్ మాల్ 13వ బ్రాంచిని బుధవారం గోపాలపట్నం ప్రధాన రహదారిలో పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి. గణబాబు, సినీహీరో కిరణ్ అబ్బవరం ప్రారంభించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఎస్‌ఆర్ షాపింగ్‌మాల్‌లో ఆఫర్లను కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. తన మొదటి సినిమా ఎస్‌ఆర్ కల్యాణ మండపంను ఆదరించినట్టుగానే ఎస్‌ఆర్ షాపింగ్ మాల్‌ను ఆదరించాలని కోరారు. ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ గోపాలపట్నంలో భారీ షాపింగ్‌మాల్‌ల ఏర్పాటుతో ఈ ప్రాంతం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సంస్థ అధినేత గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రప్రథమంగా విశాఖలో ఎస్‌ఆర్ షాపింగ్ మాల్ ప్రారంభించి, ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 13 బ్రాంచీలు ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో నాణ్యమైన వస్త్రాలు, వివిన్న ఆఫర్లతో అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని కొనుగోలుదారులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. షాపింగ్ మాల్‌లో లేడీస్, కిడ్స్‌వేర్‌ను గణబాబు, మెన్స్‌వేర్‌ను కిరణ్ అబ్బవరం ప్రారంభించారు. కార్యక్రమంలో షాపింగ్ మాల్ డైరెక్టర్ ఎస్ఎల్ఎన్ ప్రసాద్‌రెడ్డి, ఏరియామేనేజర్ రామ్మోహన్‌రెడ్డి, బ్రాంచి మేనేజర్ వెంకట్ పాల్గొన్నారు.

ప్రకృతి విపత్తులు ఎదుర్కొనేందుకు సన్నద్ధత అవసరం

» యంత్రాంగానికి కలెక్టర్ ఆదేశం


సమావేశంలో పాల్గొన్న అధికారులు

మహారాణిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఊహించని రీతిలో జరిగే ప్రమాదాలకు తావిచ్చే ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. హోంమంత్రి వంగలపూడి అనిత బుధవారం విపత్తుల నిర్వహణ, ఇతర అంశాలపై ప్రత్యేకంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో జరగబోయే సంఘటనలను పసిగట్టి సంసిద్ధంగా ఉండాలన్నారు. జిల్లాలో శిథిల స్థితికి చేరిన వంతెనలు, కాలువల రక్షణ గోడలు, తుఫాన్ షెల్టర్లు, కొండవాలు ప్రాంతాల్లో నివసించే ప్రజల వివరాలు సేకరించి నివేదిక తయారు చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. ప్రమాదాలు జరగడానికి ఆస్కారం ఉండే ప్రాంతాలను గుర్తించి, ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కొండవాలు, లోతట్టు ప్రాంతాల్లోనూ ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డీఆర్వో బీహెచ్ భవానీశంకర్, ఏవో ఈశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాక

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం నగరానికి రానున్నారు. ఉదయం 7.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి 8.30 గంటలకు విశాఖ చేరుకుంటారు. విమానాశ్రయం నుంచి గెస్ట్‌హౌస్‌కు వచ్చి కొద్దిసేపు ఉంటారు. అక్కడ నుంచి నోవాటెల్ హోటల్‌కు వెళ్లి 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'లో పాల్గొంటారు. రాత్రికి గెస్ట్ హౌస్‌లో బస చేసి తిరిగి ఆరో తేదీ నోవాటెల్‌లో 'డీప్ టెక్నాలజీ సదస్సు-2024'కు సీఎం చంద్రబాబునాయుడుతో కలిసి హాజరవుతారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

పద్మనాభం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలో ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతి చెం దాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని విలాస్‌ఖాన్‌పాలెం గ్రామానికి చెందిన బొడ్డు అప్పలనాయుడు (64) పద్మనాభం జంక్షన్‌కు పని మీద వచ్చాడు. పని ముగించుకుని రోడ్డు దాటుతుండగా విజయనగరం నుంచి సింహాచలం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడ్ని కుటుంబ సభ్యులు, స్థానికులు విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 7 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

జూలో నాలుగు నెమలి పిల్లలు


పిల్లలతో తల్లి నెమలి

ఆరిలోవ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలోని ఒక నెమలి నాలుగు పిల్లలకు జన్మనిచ్చినట్టు (గుడ్లను పొదగడం ద్వారా) జూ క్యూరేటర్ మంగమ్మ తెలిపారు. నెమలి ఐదు గుడ్లను పెట్టింది. వాటిని పొదగ్గా నాలుగు పిల్లలు అయ్యాయి. మరో గుడ్డు అలాగే ఉండిపోయింది. మొటులో 17 మగ నెమళ్లు, 14 ఆడ నెమళ్లు ఉన్నట్టు క్యూరేటర్ చెప్పారు.

నేడు పౌర సరఫరాల శాఖ ప్రాంతీయ సదస్సు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర జిల్లాల్లో పౌర సరఫరాల శాఖ పనితీరు, ధాన్యం కొనుగోళ్లు, రేషన్ బియ్యం పంపిణీ తదితర అంశాలపై గురువారం ఉదయం విశాఖ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించనున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్, కమిషనర్ వీరపాండ్యన్, పౌర సరఫరాల సంస్థ ఎండీ మనిజీర్ జిలాని, ఉత్తరాంధ్రలో ఆరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు, డీఎస్‌వోలు, డీఎంలు సమావేశంలో పాల్గొంటారు.


తునిలో వైశ్యరాజు జ్యూవెలర్స్ ప్రారంభం


తునిలో వైశ్యరాజు జ్యూవెలర్స్ నూతన షోరూమ్‌ను ప్రారంభిస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధాబాలు

విశాఖపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తుని పెంటకోటదరి బాలాజీ కాంప్లెక్సు ఎదురుగా వైశ్యరాజు జ్యూవెలర్స్ నూతన షోరూమ్ బుధవారం ప్రారంభమయింది.తుని మునిసిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధాబాలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. మొదట చక్కా సూర్యనారాయణ కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా వైశ్యరాజు జ్యూవెలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మొదటి షోరూమ్ తునిలోనే ప్రారంభించామన్నారు.వినూత్న కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల బంగారు ఆభరణాలను నగదు/యూపీఐ/ఈ-ట్రాన్స్‌ఫర్ ద్వారా ఫ్లాట్ 6 శాతం తరుగుకే అందిస్తున్నామన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరీ లేదని, జీఎస్టీ కూడా తామే చెల్లిస్తామని పేర్కొన్నారు. కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై రూ.10వేలవరకు తగ్గింపు ఇస్తామని, ఈ ఆఫర్ కొద్దిరోజులు మాత్రమే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ షోరూమ్‌నకు వచ్చి ప్రత్యేక డిజైనరీ కలెక్షన్లు ఎంపిక చేసుకొని ఆఫర్‌ను వినియోగించుకోవాలని కోరారు. ప్రారంభోత్సవంలో వైశ్యరాజు జ్యూవెలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరెక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్‌రాజు, చక్కా రమేష్, గోగుల కోటేశ్వరరావు, కోలా ఈశ్వరరావు, అధిక సంఖ్యలో వినియోగదారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం


సాత్విక్ కుమార్ మృతదేహం

కూర్మన్నపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైటెన్షన్ విద్యుత్ వైరు తగలడంతో బాలుడు మృతిచెందాడు. ఈ సంఘటన కణితి గవరవీధిలో బుధవారం రాత్రి జరిగింది. దువ్వాడ పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉక్కు ఉద్యోగి దాడి దిలీప్‌కుమార్ చిన్న కుమారుడు దాడి సాత్విక్‌కుమార్ (10) ఇంటివద్ద విద్యుత్ సీరియల్ లైట్స్‌తో బుధవారం రాత్రి ఆడుకుంటున్నాడు. వైరును తిప్పుతున్న క్రమంలో ఇంటిపక్కనే ఉన్న హైటెన్షన్ వైరుకు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన తల్లి భారతి వడ్లపూడి ఆస్పత్రికి, అక్కడి నుంచి కేజీహెచ్‌కు తరలించారు. అప్పటికే సాత్విక్ మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

కంచరపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భవనం పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన గొల్లకంచరపాలెంలో బుధవారం జరిగింది. మురళీనగర్ ఎన్‌జీజీవోస్ కాలనీలో ఉంటున్న మామిడి రమణారావు (48) గొల్ల కంచరపాలెం తోటవీధిలో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నాడు. రెండో అంతస్తు శ్లాబ్ వేసేందుకు పనులు ప్రారంభించారు. కళ్లు తిరగడంతో కిందకు పడిపోయాడు. ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం చింతపేట నుంచి ఉపాధి నిమిత్తం నగరానికి వచ్చాడు. కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పినగాడిలో చోరీ

» రూ.5 లక్షలు నగదు, 8 తులాల బంగారం అపహరణ

పెందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పినగాడిలో భారీ చోరీ జరిగింది ఇంటి తలపుతట్టి ప్రవేశించిన ముసుగు ధరించిన ఆగంతకులు ఒంటిరిగా ఉన్న వృద్ధురాలిని కత్తి తో బెదిరించి చోరికి పాల్పడ్డారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. పినగాడి రహదారి ఆనకుని ఉన్న ఇంట్లో షేక్ సహానా ఒంటరిగా ఉం టోంది. ఆమె కుమారుడి కుటుంబం సమీపంలోని బహళ అంతస్థుల భవనంలో ఉంటున్నారు. మంగళవారం అర్ధరాత్రి ఇంటి తలపు తట్టినట్టు వినిపించడంతో సహానా తలుపు తీసింది. ముసుగు ధరించిన ముగ్గురు ఆగంతకులు ఆమెను కత్తితో బెదిరించి బీరువాలో భద్రపరిచిన రూ.5 లక్షల నగదు, 8 తులాలు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఆధారాలు సేకరించారు. కాగా చోరీపై ఇప్పటివరకు భాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని, కేసు నమోదు చేయలేదని, పోలీసులు చెబుతున్నారు. సంఘటనాస్థలాన్ని పరిశీలించిన సందర్భంలో చోరీ జరిగిన తీరు, బాధితుల మాటలకు పొంతన కుదరడంలేదంటున్నారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి

» పెట్రోల్ పోసి నిప్పంటించిన మహిళ


గాయపడిన బేగం, నిందితురాలు సంగీత

సీతంపేట/అక్కయ్యపాలెం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాను ఇచ్చిన డబ్బులు తిరిగివ్వలేదనే కోపంతో ఓ మహిళ అంగన్‌వాడీ కార్యకర్తపై పెట్రోల్ పోసి నిప్పంటించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్కయపాలెం శ్రీనివాసనగర్‌లో రహీమున్నీసా బేగం (42) అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తోంది. గోపాలపట్నం వాసి సంగీత అనే మహిళ ఆమెకు ఫోను చేసి కేంద్రం వద్ద ఉన్నానని, రావాలని కోరింది. దీంతో బేగం వచ్చింది. ఇద్దరూ ఆటోలో కూర్చుని మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఆటోలో నుంచి కేకలు వినిపించాయి. రహీమున్నీసా బేగం మంటల్లో కాలిపోతుండడంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంగీత పారిపోయింది. సంఘటన స్థలానికి చేరుకున్న ఏసీపీ లక్ష్మణమూర్తి, సీఐ విజయ్‌కుమార్, దిశ సీఐ నిర్మల, ఎస్ఐ వెంకటరావు విచారణ చేపట్టారు. సంగీత గతంలో రహీమున్నీసా బేగంకి డబ్బులు ఇచ్చింది. ఇంకా రూ.32 వేలు బకాయి ఉండడంతో అడిగినా ఇవ్వడం లేదు. దీనిపై మాట్లాడేందుకు వచ్చి, బెదిరించాలని పెట్రోల్ పోసి నిప్పు అంటించానని పోలీసుల విచారణలో తెలిపింది. ఆమెను అదుపులోకి తీసుకుని, బాధితురాలిని ఆస్పత్రికి తరలించి సీఐ కేసు నమోదుచేశారు.

బాలికను మోసగించిన యువకుడి అరెస్టు

సీతంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి బాలికను గర్భవతిని చేసిన యువకుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. అక్కయ్యపాలేనికి చెందిన బాలికకు కేజీహెచ్ డౌన్ వార్డుబాయ్ కాలనీలో జలగడుగుల ముత్యాలుతో పరిచయం ఏర్పడింది. బాలికకు మాయమాటలు చెప్పి లోబరచుకున్నాడు. గర్భం రావడంతో అబార్షన్ చేయించాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు కేజీహెచ్‌కు తీసుకువెళ్లారు. పరీక్షించిన వైద్యులు విషయం తెలిపారు. సమాచారం మేరకు నాలుగో పట్టణ సీఐ విజయకుమార్ కేసు నమోదు చేశారు. పోలీసుల విచారణలో జలగడుగుల ముత్యాలు తప్పు చేసినట్టు తేలడంతో అరెస్టు చేసి రిమాండ్‌కి తరలించారు.